www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 44 | గురువారం | 3 ఆగస్టు, 2017

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

విలన్ కాంగ్రెస్



దానిది కుంచిత బుద్ధి, ప్రతికూల ఆలోచనా ధోరణి, దాని దుష్ట పన్నాగాలు తిప్పికొడతాం

ప్రాజెక్టులపై 196 కేసులు వేశారు, అందులో ఇరిగేషన్‌పైనే 164, వారెప్పుడైనా ఇంత పరిహారం ఇచ్చారా?, కమ్యూనిస్టులకు భవిష్యత్తులేదు : మీడియా గోష్ఠిలో సిఎం ఫైర్

మన తెలంగాణ/ హైదరాబాద్ : అధికారం కోల్పోయి ఆశాభంగానికి గురైన కాంగ్రెస్ పార్టీ ప్రజోపయోగ, సంక్షేమ పథకాలు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై కోర్టు కేసులు వేసి అడ్డంపడుతోందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక తమకే అధికారం వస్తుందని ఆశించి భంగపడ్డారని, ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు, చిత్తశుద్ధిని గమనించి ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారని సిఎం అన్నారు. ప్రగతి భవన్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సిఎం మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి కుంచిత బుద్ధి, ఈర్ష్య బుద్ధి, ప్రతికూల ఆలోచన ధోరణి ఉందన్నారు. ఆ పార్టీ దుష్ట పన్నాగాలను తిప్పికొడతామని, వారికి ఏ శిక్ష విధించాలో ప్రజలు, కాంట్రాక్టు ఉద్యోగులు ఆలోచించుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఎకరాకు రూ.6 నుంచి 12 లక్షల మధ్య పరిహారం ఇచ్చామని, మీ మొహానికి ఇంత పరిహారం ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజాక్షేత్రంలో తేలుస్తాం, క్షుద్ర రాజకీయాల బండారం బయటపెడ్తామని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ దుస్థితికి ప్రథమ విలన్ కాంగ్రెస్ పార్టీ, ఉద్యమం నాటి నుంచి నేటి వరకు పిశాచి, భూతంలా వ్యవహరించిందన్నారు. నాడు నెహ్రూ ఫజల్ అలీ కమిషన్‌ను వ్యతిరేకించి ఎపిలో తెలంగాణను విలీనం చేశారని, ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమిస్తే 400 మందిని ఇందిరాగాంధీ పొట్టనబెట్టుకున్నారని, ప్రజలతీర్పును వ్యతిరేకించిన పార్టీ అని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రాజెక్టులపై మొత్తం 196 కేసులు వేయగా, ఒక్క నీటి పారుదల శాఖ ప్రాజెక్టులపైనే 164 కేసుల వేశారని అన్నారు. ప్రభుత్వం జిఒ తీయగానే, కేసులు వేయడం పనిగా పెట్టుకున్నారన్నారు. నోటిఫికేషన్లు ఇస్తే కేసులు, ఉద్యోగాలు ఇస్తే కేసులు, సింగరేణిలో డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇస్తే కేసులు, ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి కేసులో కాంగ్రెస్ పార్టీ హస్తముందని సిఎం ఘాటుగా విమర్శించారు. 'మేము పని చేయలేదు, విఫలం చెందాం, తరువాయి 9లో

క్రమబద్ధంపై స్టే



- ఔట్ సోర్సింగ్ విద్యుత్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను సస్పెండ్ చేసిన హైకోర్టు
- పిల్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని విద్యుత్ సంస్థలకు ఆదేశం
- తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు క్రమబద్ధీకరణ నిలిపివేత

మన తెలంగాణ/ హైదరాబాద్ : విద్యుత్ సంస్థల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న 21 వేల మంది సర్వీసుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను ఉమ్మడి హైకోర్టు సస్పెండ్ చేసింది. నాలుగు వారాలపాటు స్టే ఉత్తర్వులు అమల్లో ఉంటాయని, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలుపుదల చేయాలని బుధవారం హైకోర్టు డివిజన్ బెంచ్ మధ్యంతర ఆదేశాలిచ్చింది. నాలుగు వారాల్లోగా ప్రతివాదులైన విద్యుత్ సంస్థలు, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె. ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్‌కో, జెన్‌కో తదితర విద్యుత్ సంస్థల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న 20,903 మంది కాంట్రాక్టు ఉద్యోగులను జులై నెలాఖరులో తెలంగాణ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. 23,667 మంది విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసకోగా, 20,903 మంది అర్హులని దరఖాస్తుల పరిశీలన నిమిత్తం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కమిటీలు తేల్చాయి. తెలంగాణ స్థానికత లేకపోవడం, వయోపరిమితి మీరిపోవడం, ఉద్యోగాన్ని మధ్యలో వదిలేయడం వంటి కారణాలతో మిగిలిన దరఖాస్తులను కమిటీలు తిరస్కరించాయి. ఈ



నేపథ్యంలో విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న సుమారు 24 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయకూడదని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని హైదరాబాద్‌కు చెందిన శ్రావణ్ కుమార్ అనే నిరుద్యోగి దాఖలు చేశారు. జూన్ 29న జరిగిన విచారణ సమయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విలీన ప్రక్రియ ఇప్పటికిప్పుడు పూర్తయ్యేది కాదని, ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బయోడేటాల పరిశీలన నిమిత్తమే కమిటీని ఏర్పాటు చేశామని హైకోర్టుకు విద్యుత్ సంస్థల తరపు న్యాయవాది చెప్పారు. అంతేగాక కార్మిక సంఘాల సమాఖ్యతో జరుగుతున్న రాజీ తరువాయి 9లో

6



ఆర్‌బిఐ రేట్ల కత్తిరింపు

- వడ్డీ రేటు పావుశాతం తగ్గింపు, రెపోలో 25 పాయింట్లు కోత

ఆర్‌బిఐ వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించింది. ప్రస్తుతం 6.25 శాతం ఉన్న వడ్డీ రేట్లు ఇప్పుడు 6 శాతానికి తగ్గనున్నాయి. ద్రవ్యోల్బణం ఇప్పటికే అత్యంత కనిష్ఠానికి పడిపోవడంతో ఆర్‌బిఐ వడ్డీ రేట్ల తగ్గింపునకే మొగ్గుచూపింది. బుధవారం మూడో ద్వైమాసిక సమీక్షలో ఆర్‌బిఐ తీసుకున్న నిర్ణయంతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాల వాయిదాలు తగ్గనున్నాయి.

కర్నాటక మంత్రి ఇంటిలో ఐటి సోదాలు

- బెంగళూరు సమీపంలోని గుజరాత్ కాంగ్రెస్ ఎంఎల్‌ఎల బసలోకి వెళ్లిన అధికారులు
- పార్లమెంట్‌లో కాంగ్రెస్ నిరసన



బెంగళూరు/ న్యూఢిల్లీ : పన్ను ఎగవేత కేసుకు సంబంధించి కర్నాటక రాష్ట్ర ఇంధన శాఖమంత్రి డికె శివకుమార్ ఇంట్లో ఆదాయపు పన్ను (ఐటి) శాఖ అధికారులు బుధవారం ఉదయం సోదాలు చేపట్టారు. సుమారు రూ.10 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఐటి శాఖకు సంబంధించిన కర్నాటక దర్యాప్తు విభాగం ఆధ్వర్యంలో సోదాలు జరిగాయి. మంత్రికి సంబంధించిన ఇతర ఆస్తులపై కూడా అధికారులు దాడులు చేశారు. గుజరాత్ నుండి ఇక్కడికి సమీపంలోని ఒక రిసార్టుకు తరలించిన కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు మంత్రి పర్యవేక్షణలోనే ఉన్నారు. ఐటి అధికారులు ఆయనను రిసార్టు నుండి నేరుగా ఆయన నివాసానికి తీసుకెళ్లారు. మంత్రిని ప్రశ్నించడానికి ఐటి అధికారులు ఉదయమే ఇక్కడ తరువాయి 9లో

ఉద్యానం ఉద్రిక్తం

- హైదరాబాద్‌లోని హార్టికల్చర్ వర్శిటీలో తెల్లవారుజాము అరెస్టులు
- ఇద్దరు విద్యార్థుల ఆమరణదీక్ష భగ్నం
- లేడీ హాస్టల్‌లో మగ పోలీసుల వీరంగం,
- అదుపులోకి రేవంత్ రెడ్డి
- భగ్గుమన్న స్టూడెంట్స్, రాస్తారోకో

మన తెలంగాణ/ మైలార్‌దేవ్‌పల్లి/ హైదరాబాద్ : ఉద్యాన శాఖలో పోస్టుల భర్తీ కోసం రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్శిటీలో విద్యార్థులు నెల రోజులుగా చేస్తున్న ఆందోళన బుధవారం ఉద్రిక్తతకు దారితీసింది. గత నాలుగు రోజులుగా ఇద్దరు విద్యార్థులు ఆమరణ దీక్ష చేస్తుండటంతో బుధవారం వేకువ జాము 3 గంటల ప్రాంతంలో పోలీసులు వారి దీక్షను భగ్నం చేశారు. దీక్షా శిబిరాన్ని, ఆ ప్రాంతంలో విద్యార్థులు కట్టిన ఫ్లెక్సీలను చించివేశారు. తనిఖీల పేరుతో హాస్టల్‌లోకి చొరబడి విద్యార్థులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. లేడిస్ హాస్టల్‌లోకి కూడా మగ పోలీసులు వెళ్లి అరెస్ట్ చేయడంతో



విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో విద్యార్థులంతా ఒక్కసారి భగ్గుమన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రాస్తారోకో, తరువాయి 9లో

8 నుంచి ఐసెట్ తుది కౌన్సెలింగ్

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో ఎంబిఎ, ఎంసిఎ ప్రవేశాలకు ఈనెల 8వ తేదీ నుంచి ఐసెట్ తుది విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రవేశాల కన్వీనర్ ఎ.వాణీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 8న ధృవపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 8,9 తేదీలలో ఆప్షన్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 11న సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. తొలి విడతలో తరువాయి 9లో

స్టేషన్‌లో మహిళను చితకబాదిన ఎస్‌ఐ 3

11 ఇసుక లారీ కిందపడిన వ్యక్తి మృతి

కుంచెపోటు



ఎవరైనా టివి ఆఫ్ చేయండి.. బాబోయ్..!

కాల్పించుకున్న విక్రమ్

- సానుభూతి కోసం కిరాయి ముఠాను ఆశ్రయించి భంగపడ్డ ముఖేష్‌గౌడ్ తనయుడు
- రూ.50 లక్షలకు డీల్
- 9 మంది నిందితులను గుర్తించిన పోలీసులు
- కస్టడీలో ఐదుగురు
- కోలుకోగానే విక్రమ్ అరెస్టు
- వివరాలు వెల్లడించిన సిపి

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో: 'అతడు' సినిమాలో తన పార్టీని అధికారంలోకి తెచ్చి ముఖ్యమంత్రి కావాలనే ఉద్దేశంతో విలన్ షియాజీ షిండే కిరాయి హంతకుడితో తనపై తానే కాల్పులు జరిపించుకొని చివరకు భంగపడ్డాడు. అచ్చం ఇదే రీతిలో మాజీమంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్ తాను నిజజీవితంలో ఎమ్మెల్యే అయ్యేందుకు తనపై కాల్పులు జరిపించుకొని భంగపడ్డాడు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం విక్రమ్‌పై జరిగిన కాల్పుల ఘటన మిస్టరీ వీడింది. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచేందుకు కావాల్సిన ప్రజల సానుభూతిని పొందేందుకు పక్కా ప్లాన్‌తో తనపై కాల్పులు జరిపించుకున్నాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. కాల్పుల డ్రామాకు కిరాయి హంతక ముఠాతో విక్రమ్ రూ.50 లక్షలకు డీల్ కుదుర్చుకున్నాడు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులను గుర్తించారు. విక్రమ్‌గౌడ్ సహా ఆరుగురిని కస్టడీలోకి తీసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు



పరారీలో ఉన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను నగర పోలీసు కమిషనర్ ఎం.మహేందర్‌రెడ్డి బుధవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచేందుకు ప్రజల సానుభూతిని సంపాదించేందుకు విక్రమ్‌గౌడ్ కాల్పుల డ్రామాకు తెర లేపాడు. అనంతపురానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఎస్.నందకుమార్(35), తరువాయి 9లో

పత్తి విలవిల

- మరి పక్షం రోజులు చినుకు కరువు
- ఇప్పటికే పత్తి పంటకు కాయ తొలుచు పురుగు
- వాడిపోతున్న ఆకులు

మన తెలంగాణ/ హైదరాబాద్: వానలు ముఖం చాటేయడంతో రాష్ట్రంలోని పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం మినహా అన్ని జిల్లాలోనూ ఈ ప్రభావం స్పష్టంగా ఉన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. మరో 15 రోజుల పాటు వర్షాభావ పరిస్థితులే ఉంటాయని స్కైమెట్ అంచనా వేసింది. ఇప్పటికే పత్తికి కాయతొలుచు పురుగు పడుతుండగా కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడం, వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో ఆకులు వాడిపోతున్నాయి. మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే డ్రైస్పెల్‌గా (వర్షాల మధ్య తీవ్ర



అంతరం) నమోదు కానుంది. ఇది పంటల ఎదుగుదల, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఫలితంగా రైతులు కూడా సాగు విస్తీర్ణం తగ్గించుకుంటున్నట్లు రాష్ట్ర తరువాయి 9లో

ప్రభుత్వానికి ప్రజల కంటే ఇసుకనే ముఖ్యమా?

మన తెలంగాణ / హైదరాబాద్ : నేరెళ్ళ ఘటనపై లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఎఐసిసి కార్యదర్శి వి.హనుమంతరావు అన్నారు. ప్రభుత్వానికి ప్రజల కంటే ఇసుకనే ముఖ్యమా?అని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపితో చేతులు కలిపిన బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సిఎం కెసిఆర్ పాలనలో ప్రభుత్వం దళితులు, బడుగు, బలహీనవర్గాలను అణిచి వేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వానికి ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ కొనసాగిస్తున్న వేధింపులను ప్రజలు గమనిస్తున్నారని, దేశంలో సెక్యులర్ పార్టీలన్నీ ఏకం కావాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా దిగ్విజయ్ సింగ్‌ను ఎందుకు తప్పించారో తనకు తెలియదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తాను గతంలో దిగ్విజయ్ సింగ్‌తో విబేధించానని, ఈ మేరకు తన అభిప్రాయాలను అధిష్టానానికి తెలియజేశానన్నారు. మధ్యప్రదేశ్‌లో పాదయాత్ర చేసేందుకే దిగ్విజయ్ తప్పుకున్నట్లుందన్నారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాలపై కొత్త ఇన్‌ఛార్జ్ కుంతియాకు అవగాహన ఉందని, ఆయన సమర్థుడో కాదో భవిష్యత్తు తేలుస్తుందని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.



ఎస్‌సి కార్పొరేషన్@థర్డ్ పార్టీ

● త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు

మన తెలంగాణ/హైదరాబాద్: స్వయం ఉపాధి పథకాల అమలు తీరును, యూనిట్ల ఏర్పాటును పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక థర్డ్ పార్టీ కమిటీని ఏర్పాటు చేయాలని ఎస్‌సి కార్పొరేషన్ యోచిస్తోంది. ఈ విషయమై త్వరలోనే ప్రభుత్వానికి ఒక ప్రతిపాదన పంపించనుంది. రుణాలు పొందే లబ్ధిదారులు బ్యాంకులు, కార్పొరేషన్ల చుట్టు చక్కర్లు కొట్టకుండా కొని పత్రాల సమర్పణ అంశంలో కూడా నిబంధనలను సరళతరం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేసేందుకు బ్యాంకర్లు ముందుకు రాకపోవడం కూడా స్వయం ఉపాధి పథకాలు నిర్దేంచుకున్న లక్ష్యాలను చేరకపోవడానికి ప్రధాన కారణమని అధికార యంత్రంగం పేర్కొంటున్నది. అందుకే త్వరలోనే హైదరాబాద్‌లో పలు బ్యాంక్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించాలని ఎస్‌సి కార్పొరేషన్ భావిస్తున్నది. లబ్ధిదారులకు రూ. 1లక్ష రుణానికి కార్పొరేషన్ రూ. 80వేల సబ్సిడీ ఇస్తోంది. మిగిలిన రూ. 20వేలను ఇచ్చేందుకు కూడా బ్యాంకర్లు ససేమిరా అనడంతో లబ్ధిదారులను గుర్తించినా ప్రయోజనం లేకుండా పోతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు ఎస్‌సి కార్పొరేషన్ ప్రత్యేక కసరత్తు మొదలు పెట్టింది. స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బ్యాంకు, కార్పొరేషన్ అధికారుల సంయుక్తంగా నిర్వహించే ఇంటర్వ్యూ సమయంలోనే కొన్ని పత్రాల విషయంలో అప్పటికి అప్పుడే నిర్ణయం తీసుకుంటే యూనిట్ల మంజూరులో కొంత జాప్యాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని అధికారులు గుర్తించారు. ఇదే విషయమై బ్యాంకర్ల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. జిల్లా అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఆదేశించారు. 2016–17 వార్షిక సంవత్సరంలో 26,731 మందికి స్వయం ఉపాధి పథకాలను అందించేందుకు రూ.322.61 కోట్లను మంజూరు చేయగా కేవలం 9455 మంది లబ్ధిదారులకు రూ.111.69 కోట్లను మాత్రమే విడుదల చేశారు. దీంతో సగానికిపైగా నిధులు వెనిక్కి వెళ్లాయి. నిధులు వెనక్కివెళ్లేందుకు అధికార యంత్రాంగం అనేక కారణాలు చెబుతున్నప్పటికీ ఈ పథకాలను అమలు చేయడంలో పెద్దగా ఆసక్తి చూపలేదనే విమర్శలు మాత్రం ఉన్నాయి. దీంతో ప్రస్తుత ఏడాదిలోనైనా పూర్తి స్థాయిలో స్వయం ఉపాధి పథకాన్ని అమలు చేయాలని కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో భాగంగానే ఈసారి కొత్తగా థర్డ్‌పార్టీ ఏర్పాటును తెరమీదకు తీసుకొస్తుంది. తొలుత ప్రయోగాత్మకంగా రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఒక అధికారి, బ్యాంకర్ల నుంచి ఒక ప్రతినిధి ఉంటారు. ఆ తరువాత జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయనున్నారు. మంజూరైన లబ్ధిదారుల సంఖ్య, వారు ఏర్పాటు చేసిన యూనిట్లను పరిశీలించి దానికి సంబంధించిన నివేదికను ఎస్‌సి కార్పొరేషన్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే లబ్ధిదారులను గుర్తించినా యూనిట్లు ఏర్పాటు చేయక పోతే దానికి గల కారణలను కూడా గుర్తించి, దీనికి బాధ్యులు ఎవరనే విషయాన్ని కూడా థర్డ్ పార్టీ తన నివేదికలో పొందపర్చాల్సి ఉంటుంది. తద్వారా యూనిట్ల ఏర్పాటులో లోపాన్ని వెంటనే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. థర్డ్‌పార్టీ ఏర్పాటుపై ప్రభుత్వానికి ఒక ప్రతిపాదనను పంపించే ముందు కార్పొరేషన్ చేపడుతున్న పలు కార్యక్రమాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు.

కోర్టుకు ఎవరో వెళ్తే
మాకేంటి సంబంధం?

మన తెలంగాణ/ హైదరాబాద్ : విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై ఎవరో కోర్టుకు పోతే కాంగ్రెస్ పార్టీకి అంటగడతారా? అని శాసనమండలిలో కాంగ్రెస్ పక్ష ఉప నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. శాసనసభ మీడియా పాయింట్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలోనే విద్యుత్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. అయితే, అందులో ఎస్‌సి, ఎస్‌టిలకు మేలు చేసే రూల్ ఆఫ్ రిజర్వేషన్ గురించి అడగడం తప్పా, ఎవరి సిఫారసులతో ఆ ఉద్యోగాలు ఇచ్చారో బయటపెట్టాలని, వారికి ఇఎస్ఐ, ఇపిఎఫ్ ఉందా? అని అన్నారు. మంత్రులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, టిడిపిలో జరిగిన పదిరికుప్పం, నీరుగొండ ఘటనలను తమకు ఆపాదిస్తున్నారన్నారు.

ట్రాఫిక్ పాయింట్‌లపై అభ్యంతరం

ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే పాయింట్‌లు వేసి, భవిష్యత్తులో అరెస్టు చేస్తామనే విధానాన్ని హడావుడిగా అమలు చేయడం పట్ల పొంగులేటి అభ్యంతరం వ్యక్తం చేశారు. అవగాహన కల్పించకుండా, రోడ్లు సరిగా లేకుండా పాయింట్లు వేయడమేమిటన్నారు. ముందు రోడ్లు సరిగా వేయని కాంట్రాక్టర్‌లకు పాయింట్లు వేయాలన్నారు. దీనిపై హోం మంత్రి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడినట్లు తెలిపారు.

పిల్లల దత్తత కోసం కారా తరహాలో సారా

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మన తెలంగాణ /హైదరాబాద్ : పిల్లల దత్తత కోసం కేంద్ర స్థాయిలో ఉన్న సెంట్రల్ ఆడాప్షన్ అథారిటి అడ్వయిజరీ కమిటి (కారా) తరహాలోనే రాష్ట్రంలోనూ తెలంగాణ స్టేట్ ఆడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సారా) ఏర్పాటు చేస్తామని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఇది సరిగ్గా పని చేసేలా టాస్క్‌ఫోర్స్‌ను కూడా నియమించి చిన్న పిల్లల దత్తత విషయంలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి అక్రమాలకు తావు లేకుండా చేస్తామన్నారు. నవజాత శిశువుల దత్తత విషయంలో ప్రైవేటు చైల్డ్ కేర్ సెంటర్లు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడు తున్నాయని, వారి దత్తత విషయంలో కూడా ఆన్‌లైన్ విధానం ద్వారానే జరిగేలా చూడాలని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటి సలహా కమిటి (కారా) ఛైర్మన్ రాంచంద్రరెడ్డి బుధవారం సచివాలయం లో మంత్రి తుమ్మల నాగేశ్వర రావును కలిశారు. తెలం గాణలో ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న నవజాత శిశువుల దత్తత అంశంలో దాదాపు 20 వేల అప్లికేషన్లు పెండింగ్ లో ఉన్నాయని ఆయన మంత్రి తుమ్మల దృష్టికి తీసుకు వచ్చారు. కారా చేసిన ఈ వినతిపై తుమ్మల స్పందిస్తూ నూతనంగా ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే అన్ని జిల్లాల్లో త్వరలోనే చైల్డ్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఇందుకు సంబంధించిన ఫైలు ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపామని, సిఎం ఆమోదంతో త్వరలోనే వీటిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పిల్లల దత్తత విషయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా అగ్రస్థానంలో ఉన్న విషయాన్ని కారా ప్రతినిధులకు తెలిపారు. ఆన్‌లైన్ అప్లికేషన్ విధానంలో ఎదురవుతున్న ఇబ్బందులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని కారాకు తుమ్మల హామీ ఇచ్చారు. నవ జాత శిశువుల దత్తత విషయంలో సబ్ రిజిస్ట్రార్లు, రిజిస్ట్రార్ల నుండి ఎదురవుతున్న ఇబ్బందులను కూడా మంత్రి దృష్టికి కారా ప్రతినిధులు తీసుకువచ్చారు.



చేప పిల్లల పంపిణీపై అవగాహన సదస్సులు : మంత్రి తలసాని

మన తెలంగాణ/హైదరాబాద్ : చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అన్ని జిల్లాలలోని రిజర్వాయర్ల వద్ద అవగాహన సదస్సులు నిర్వహించాలని పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. సచివాలయం నుంచి బుధవారం మంత్రి జిల్లా కలెక్టర్లలో చేప పిల్లలు, గొర్రెల పంపిణీ కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అవగాహన సదస్సులకు జిల్లా మంత్రితో పాటు, ఎంపి, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, మత్స్యసొసైటీ సభ్యులను ఆహ్వానించాలన్నారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువులలో ఈ ఏడాది సుమారు 70 కోట్ల చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం లేని చేప పిల్లలను వెనక్కి పంపిచాలని ఆదేశించారు. గత సంవత్సరం జరిగిన తప్పిదాలు తిరిగి చోటు చేసుకోకుండా జాగ్రత్త పడాలన్నారు. మత్స్యశాఖలో సిబ్బంది కొరత ఉన్నందున చేప పిల్లల విడుదల కార్యక్రమంలో రెవిన్యూ, పంచాయితీరాజ్ శాఖ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన మత్స్యశాఖలో సిబ్బంది నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లా కేంద్రంలో చేపల మార్కెట్ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణకు కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

ఆగస్టులో సెలవులే సెలవులు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఈ నెలలో సెలవులే సెలవులు. ముఖ్యంగా పండుగలు ఎక్కువగా వీకెండ్ సెలవులతో కలిసి వస్తుండగా లాంగ్‌టూర్లు ప్లాన్ చేసుకోవాలనుకునే వారికి ఆగస్టు మంచి ఛాన్స్ ఇస్తుంది. రానున్న వీకెండ్‌తో అది మొదలవుతుంది. ఈ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కాగా, ఆ తర్వాత వీకెండ్, మళ్లీ సోమవారం రక్షాబంధన్. మళ్లీ 12న రెండవ శనివారం, 13న ఆదివారం కాగా, 14న శ్రీకృష్ణ జన్మాష్టమి, 15న స్వాతంత్ర్య దినోత్సవం. అంటే వరుసగా నాలుగు రోజులు హాలిడేస్. ఇక ఆగస్టు 25న అంటే శుక్రవారం వినాయక చవితి. ఆ తర్వాత రెండు రోజులు వీకెండ్. సాధారణంగా ఐటి, ఎంఎన్‌సి కంపెనీలలో పనిచేసే ఉద్యోగులకు శని, ఆదివారాలు సెలవులు ఉంటాయి.

బోగస్ ఐటి నోటీసులపై జాగ్రత్త!

మన తెలంగాణ/హైదరాబాద్: బోగస్ ఆదాయపు పన్ను నోటీసులపై జాగ్రత్తగా ఉండాలని ఆదాయపు పన్ను శాఖ హెచ్చరించింది. ఆదాయపు పన్ను శాఖ పేరుతో మోసపూరిత నోటీసులు కొందరికి వచ్చినట్లుగా తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి నోటీసులపై జాగ్రత్తగా ఉండాలని ఒక ప్రకటనలో ప్రజానీకానికి సూచించింది. అటువంటి నోటీసులలో ఆదాయపు పన్ను శాఖ అధికారిక చిహ్నాములు, తప్పుడు హోదాలు, అధికారుల తప్పుడు పేర్లు వాడుతున్నారని ఒక ప్రకటన విడుదల చేశారు. నోటీసులలో ఆదాయపు పన్ను చట్టం, బినామి నిషేధ చట్టం నిబంధనలు కూడా పేర్కొంటున్నారని, నోటీసులు అందుకున్న పన్ను చెల్లింపుదారులు, ప్రతిస్పందించే ముందు నోటీసు జారీచేసిన అధికారుల వివరాలను ఆదాయపు పన్ను శాఖ పిఆర్‌వో బివి వినోద్ (04023425200, 8985970011)తో సంప్రదించి, నిర్ధారించుకున్న తరువాత మాత్రమే సమాధానము ఇవ్వాలని కోరారు. మోసపూరిత నోటీసులు అందితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

నాలుగు రోజుల పాటు వర్షాలు

మన తెలంగాణ/హైదరాబాద్: వచ్చే నాలుగు రోజుల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉపరితల ఆవర్తనం నైరుతి బంగాళాఖాతం నుంచి ఉత్తర తమిళనాడు వరకు ఏర్పడింది. ఇది సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. ఒడిషా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర మీదుగా ద్రోణి పయనిస్తోంది. ఫలితంగా చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. ఇదేవిధంగా గత 24 గంటల్లో వరంగల్ జిల్లా వెంకటాపూర్, నల్లబెల్లి, ఖమ్మం జిల్లా దుమ్ముగూడెంలో 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కొత్తగూడెం, సత్తుపల్లి, నాగిరెడ్డిపేటలో 3, గోవింద రావు పేట, చెన్నూరు, జగిత్యాల, జూలూరుపాడు, ఎంకూరులో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు, మణుగూరు, మంచి ర్యాల, పర్వతగిరి, పినపాక, తిమ్మాపూర్, ఎడపల్లి, చెన్నారావుపేట, కాళేశ్వరం, ములకలపల్లి, గూడూరు, బిర్కూరు, శాయంపేట, బయ్యారం, ముధోల్, మిర్యాలగూడ, లక్సెట్టిపేట, మహబూబాబాద్, ఖానాపూర్, నల్లగొండ తదితర ప్రాంతాలలో 1 సెంటీమీటర్ వర్షం కురిసింది.

ఆవు మూత్రం, పాలు ప్రయోజనాలపై అధ్యయనం

న్యూఢిల్లీ: ఆవు మూత్రం, పాలు వంటి ఉత్పత్తులతో కలిగే ప్రయోజనాలపై అధ్యయనం చేసేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఢిల్లీ (ఐఐటిడి)కి వివిధ విద్యాసంబంధిత, పరిశోధన సంస్థల నుంచి 50 అధ్యయన ప్రతిపాదనలు అందినట్టు బుధవారం ప్రభుత్వం వెల్లడించింది. ఐఐటి ప్రాంగణంలో ఎస్‌విఎఆర్‌ఒపి (సైంటిఫిక్ వాలిడేషన్ అండ్ రీసెర్చ్ ఆన్ పంచ్‌గావ్య) కార్యక్రమానికి సంబంధించి భావన ఆలోచనలు, ప్రతిపాదనలతో వర్క్‌షాపును నిర్వహించినట్టు శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ సహాయ మంత్రి వైస్ చౌదరి లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆవు ఉత్పన్నాలపై రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్&డి) విభాగం సహా పలు పరిశోధన సంస్థలు చర్చించినట్టు ఆయన తెలిపారు.నేషనల్ స్టీరింగ్ కమిటీ (ఎన్‌ఎస్‌సి)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఎస్‌సిఆర్‌ఎంయు విజయం

మన తెలంగాణ/ హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) గుంతకల్ డివిజన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికల్లో ఎస్‌సిఆర్ మజ్దూర్ యూనియన్ విజయం సాధించింది. ఇనిస్టిట్యూట్‌లో బుధవారం జరిగిన మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ నుంచి కార్యదర్శిగా మేఘ శ్యామ్, సంయుక్త కార్యదర్శిగా పి.ఇర్షియాజ్ కాన్, కోశాధికారిగా కె.గిరిమోహన్‌రావు, ముగ్గురు కమిటీ సభ్యులు ఎన్నికైనట్లు ఎస్‌సిఆర్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.శంకర్‌రావు తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన కోరారు. కమిటీ సభ్యులుగా కె.ఇరేషా, పి.రాజ్ కిరణ్, సయ్యద్ ముజఫర్, కె.లక్ష్మీ నారాయణ, ఎల్.శ్రీధర్, వి.ఏడుకొండలు ఎన్నికయ్యారు.

త్వరలో గురుకుల పరీక్షలకు సవరించిన షెడ్యూల్

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో వివిధ గురుకుల విద్యాసంస్థల్లో ఉద్యోగాల నియామక పరీక్షలపై హైకోర్టు స్టే ఎత్తి వేసిన నేపథ్యంలో వాయిదా పడిన పరీక్షలను నిర్వహించేందుకు త్వరలోనే సవరించిన షెడ్యూల్ విడుదల చేస్తామని టిఎస్‌పిఎస్‌సి ప్రకటించింది. గతంలో గురుకుల పరీక్షలను నిలిపిస్తే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ పరీక్షలను టిఎస్‌పిఎస్‌సి వాయిదా వేసింది.

కృత్రిమ వర్షాలతోనైనా రైతులను ఆదుకోండి : సిపిఐ

మన తెలంగాణ/ హైదరాబాద్: గత 20 రోజులుగా వర్షాలు లేకపోవడంతో రైతులు వేసిన విత్తనాలు ఎండిపోతున్నా యని, వేల కోట్ల విలువైన పంటలను కాపాడడానికి మేఘమథనంతో కృత్రిమ వర్షాలు కురిపించే ప్రయత్నం చేయడం ద్వారా రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సిఎం కెసిఆర్‌కు ఒక లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా వేరుశెనగ, పత్తి లాంటి మెట్టపంటలకు వర్షాలు లేకపోవడంతో ఎండిపోతున్నాయని, ఫలితంగా రైతుల పెట్టుబడులు వృథాగా భూమిలో కలిసిపోతున్నాయని ఆయన లేఖలో వివరించారు. ఇప్పటికే రైతులు అప్పులు ఇతర అనేక సమస్యలను ఎదుర్కొంటుండగా ఇప్పుడు వర్షాభావంతో మరిన్ని మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రం లో కొన్ని చోట్ల వర్షాలు పడని కారణంగా ప్రయోగాత్మకంగా మేఘమథనం చేశారని, ప్రస్తుతం అలాంటి ప్రయత్నం చేయడం సమంజసంగా ఉంటుందన్నారు.

బరి తెగించిన డ్రగ్స్ పెడ్లర్లు

- నిన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్
- తాజాగా డార్క్‌నెట్‌పై వార్త రాసిన విలే-ఖరిని అంతం చేస్తామని బెదిరింపులు
- సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు



మన తెలంగాణ/హైదరాబాద్: దేశ వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసులో సూత్రధారులు బరితెగించి బెదిరింపులకు దిగుతున్నారు. కేసును లోతుగా దర్యాప్తు చేసేందుకు నడుం కట్టిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సభర్వాల్‌ను, ఆయన కుటుంబాన్ని అంతం చేస్తామని బెదరించిన డ్రగ్స్ పెడ్లర్లు తాజాగా డార్క్‌నెట్, డ్రగ్స్ పెడర్ల ఆన్‌లైన్ వ్యాపారం తదితర అంశాలపై కథనాన్ని రాసిన విలేఖరిని, ఆయన కుటుంబానికి హెచ్చరికలు అందాయి. వాస్తవానికి డ్రగ్స్ కేసు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఎవరు నిందితులు, ఏ మేరకు ఎవరి పాత్ర ఎంత అంశంపై స్పష్టత కోసం అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే డ్రగ్స్ పెడ్లర్లు తమకు అడ్డువస్తే అంతు చూస్తామన్న రీతిలో వ్యవహరించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. డార్క్‌నెట్‌లో డ్రగ్స్ వ్యాపారంపై హైదరాబాద్‌కు చెందిన ఒక ఆంగ్ల పత్రిక కథనాన్ని రాసింది. ఈ కథనం ఆయన పేరుతో ప్రచురితం కావడంతో పెడ్లర్లు ఆయనకు హెచ్చరికలు జారీ చేశారు. సదరు జర్నలిస్టును, ఆయన కుటుంబాన్ని అంతం చేస్తే బిట్ కాయిన్స్ రూపంలో నజరానా ఇస్తామంటూ ఇంటర్‌నెట్‌లో ప్రకటించారు. ఈ బెదరింపులపై సదరు జర్నలిస్టు హైదరాబాద్ నగర నేర పరిశోధనా విభాగం (సిసిఎస్) పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయ్యింది. డ్రగ్స్ కేసులో ఎక్సైజ్ అధికారులు దాదాపు 19 మందిని అరెస్టు చేశారు. వీరిలో చాలా మంది ఇంటర్‌నెట్‌లో అథోజగత్తుగా భావించే డార్క్‌నెట్ ద్వారా ఆర్డర్ చేసి, విదేశాల నుంచి డ్రగ్స్ ఖరీదు చేసినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే సదరు పత్రికా జర్నలిస్టు మ్యాడీ బ్లాడెడ్ ఐడీతో ఉన్న వ్యక్తి భారీగా డ్రగ్స్ క్రయ విక్రయాలు సాగిస్తున్నారని గుర్తించారు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై డ్రగ్స్ పెడ్లర్ ఫేస్ బుక్ ద్వారా జర్నలిస్ట్, ఆయన కుటుంబసభ్యుల వివరాలను సేకరించాడు. వీటిని పొందు పరుస్తూ ఇంటర్‌నెట్‌లో ద్వారా ప్రకటించాడు. జర్నలిస్ట్‌ను అంతం చేస్తే నాలుగు బిట్ కాయిన్లు అంటే రూ. 7.2 లక్షలు, కుటుంబసభ్యులను చంపితే ఆరు బిట్ కాయిన్లు అంటే రూ. 10.8 లక్షలు నజరానాగా ఇస్తామని వారి ఫొటోలతో సహా ఓ పోస్టర్‌ను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశాడు. ఈ వివరాలు జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలపై ఇష్టాగోష్ఠి చర్చలు జరిగే రెడిట్ డాట్ కామ్ ఫోరమ్‌లో కనిపించాయి. దీనిపై ఈ ఫోరమ్‌లో బెదరింపులపై పెద్ద ఎత్తున చర్చలు కూడా జరిగాయి. ఈ విషయం మిత్రుల ద్వారా తెలుసుకున్న విలేఖరి సిసిఎస్‌లోని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసును నమోదు చేసుకున్న ఎసిపి రఘువీర్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ చాంద్‌పాషా దర్యాప్తును చేపట్టారు. ప్రాథమికంగా సేకరించిన సమాచారం ప్రకారం డ్రగ్స్ పెడ్లర్ మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన వాడని భావిస్తున్నారు. ప్రత్యేక బ్రౌజర్ల ద్వారా డార్క్‌నెట్ వినియోగించే వారి ఐపీ చిరునామాను గుర్తించడం కష్టమని అధికారులు అంటున్నారు. ఆయా వెబ్ సైట్లు, హోస్ట్ అయ్యే సర్వర్లు రష్యా, పోలాండ్ తదితర దేశాల్లో ఉండటమే కారణమని వారు పేర్కొంటున్నారు. ఈ మేరకు డ్రగ్స్ పెడ్లర్ల చిరునామా తెలపాలని లేఖలు రాశామని వారు చెప్పారు. పూర్తి వివరాలు వచ్చిన తర్వాత కేసు దర్యాప్తు మరింత ముమ్మరం చేస్తామని వారంటున్నారు.

అప్పుల బాధతో నలుగురు రైతుల ఆత్మహత్య

జిల్లాల నుంచి మన తెలంగాణ ప్రతినిధులు: అప్పుల బాధ భరించలేక రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో బుధవారం నలుగురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వరంగల్ జిల్లా పాలకుర్తి మండలంలోని వల్మిడి గ్రామంలో అప్పులు తీర్చలేక రైతు వాసూరి వెంకన్న (40) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తనకున్న రెండెకరాల భూమి సాగు చేసేందుకు చేసిన అప్పులు వడ్డీలతో సహా అంతకంతకు పెరుగుతుండడంతో పాటు తన కూతురు వివాహానికి చేసిన అప్పు కూడా మోయలేని భారంగా మారుతుండడంతో వెంకన్న గత కొంత కాలంగా తీవ్ర మనోవ్యథ చెందుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం తన వ్యవసాయ బావి వద్ద ఎవరూలేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మెదక్ జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన కొంతం కనకయ్య (55)అనే రైతు అప్పుల బాధతో బుధవారం తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకుని మరణించాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామంలో అప్పులు తీర్చలేమన్న బెంగతో పి.శ్యామప్ప(42) అనే రైతు పురుగుల మందు తాగి చనిపోయాడు. అదే విధంగా రంగారెడ్డి జిల్లా గొల్లపల్లికి చెందిన కటిక రామచంద్రయ్య (42) పురుగుల మందు తాగి ఆత్మహత్మ హత్య చేసుకున్నాడు.

మంత్రి కెటిఆర్‌ను అనర్హుడిగా ప్రకటించండి



మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘిస్తూ హిమాన్షు మోటార్ల కంపెనీకి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారని, శాసనసభకు ఆయనను అనర్హునిగా ప్రకటించాలని వామపక్షాలు ఎన్నికల కమిషన్‌ను కోరాయి. వామపక్షాల నాయకులు తమ్మినేని వీరభద్రం (సిపిఐ(ఎం), మల్లెపల్లి ఆదిరెడ్డి, ఈర్ల నరసింహ (సిపిఐ), డి.జి.నర్సింహారావు (సిపిఐ(ఎం), జి.ఝాన్సీ, (సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ), తాండ్ర కుమార్ (ఎంసిపిఐ) సిహెచ్.మురహరి (ఎస్‌యుసిఐసి) జె.జానకిరాములు (ఆర్‌ఎస్‌పి), బండా సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), గుర్రం విజయకుమార్ (సిపిఐ(ఎంఎల్), భూతం వీరన్న (సిపిఐ ఎంఎల్) బుధవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌ను సచివాలయంలోని ఆయన కార్యాలయంలో కలిసి మంత్రి కెటిఆర్‌పై ఫిర్యాదు చేశారు. హిమాన్షు మోటార్స్‌లో తనకు 3 లక్షల షేర్లు ఉన్నట్లు కెటిఆర్ 2014 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అఫిడవిట్, ఇటీవల కంపెనీ సమర్పించిన వార్షిక నివేదిక కాపీలను వారు ఎన్నికల అధికారికి అందజేశారు. హిమాన్షు మోటార్ల వ్యవహారంలో అవకతవకలకు సంబంధించిన పూర్తి ఆధారాలున్నందున మంత్రి కెటిఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మీడియా పాయింట్లో తమ్మినేని వీరభద్రం మీడియాతో మాట్లాడుతూ హిమాన్షు వ్యవహారంపై సిఎం కెసిఆర్ స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధ్య చట్టాన్ని ఉల్లంఘించినందుకు మంత్రి కెటిఆర్ నైతిక భాధ్యత వహించి మంత్రి పదవికి, శాసనసభ్యత్వానికి రాజీనామా చేయాలన్నారు. టెండర్లు లేకుండానే వెంకయ్య నాయుడు కుమారుడి కంపెనీకి ఇచ్చిన ఆర్డర్లపైనా విచారణ జరపాలన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర న్యాయ విచారణకు ఆదేశించడం ద్వారా సిఎం కెసిఆర్ తన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు.

రామానాయుడు స్టూడియోకు విదేశీ పార్సిల్

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రాన్ని ఒక కుదుపు కుదిపిన డ్రగ్స్ వ్యవహారం టాలీవుడ్‌ను ఇంకా వెంటాడుతూనే ఉంది. విదేశాల నుంచి విరివిగా డ్రగ్స్ హైదరాబాద్‌కు దిగుమతి అవుతున్నాయని, ఇందుకు పార్సిల్ కంపెనీల పాత్ర ఉందన్న విషయాన్ని రూఢీ చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వారికి కొన్ని మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం నగరంలోని రామానాయుడు స్టూడియోకు విదేశాల నుంచి ఒక పార్సిల్ వచ్చింది. ఈ పార్సిల్ విషయాన్ని సదరు కొరియర్ సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందించింది. దీంతో రామానాయుడు స్టూడియోకు పార్సిల్ చేరుకున్న క్షణాల్లోనే ఎక్సైజ్ శాఖ సిఐ కనకదుర్గ వెళ్ళారు. విదేశాల నుంచి వచ్చిన పార్సిల్‌ను తనిఖీ చేయాలని కోరడంతో అక్కడి వారు పార్సిల్‌ను అందించారు. దాన్ని విప్పి పరిశీలించగా అందులో వెన్నునొప్పి నివారణ కోసం సినీ నటుడు రానా పరికరాలను తెప్పించాడని గుర్తించి వెళ్ళిపోయారు. ఈ విషయంపై స్పందించిన స్టూడియో అధినేత సురేష్‌బాబు తమ స్టూడియోకు పార్సిల్ వచ్చిన విషయం వాస్తవమేనని, ఎక్సైజ్ అధికారులు వచ్చి పార్సిల్‌ను పరిశీలించి వెళ్ళిన విషయం కూడా నిజమేనని చెప్పారు. వెన్నునొప్పి నివారణ కోసం తన కుమారుడు రాణా కొన్ని పరికరాలను తెప్పించాడని పేర్కొన్నారు.

1,205 జూ. కాలేజీలకు అఫిలియేషన్లు

- పారదర్శకత కోసం ఆన్‌లైన్‌లోనే అఫిలియేషన్ ప్రక్రియ
- ప్రభుత్వ కళాశాలల్లో పెరుగుతున్న ప్రవేశాలు



మన తెలంగాణ/హైదరాబాద్ : జూనియర్ కళాశాలల అనుబంధ గుర్తింపు ప్రక్రియలో పారదర్శకత కోసం ఆన్‌లైన్ అఫిలియేషన్ విధానాన్ని ప్రారం భించామని రాష్ట్ర ఇంటర్మీడియేట్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఎ.అశోక్ తెలి పారు. ఈ విద్యాసంవత్సరం కళాశాలల అఫిలియేషన్ కోసం 1,600 దర ఖాస్తులు అందాయని, అందులో 1,205 కళాశాలలకు అఫిలియేషన్ జారీ చేసినట్లు చెప్పారు. బుధవారం ఇంటర్ బోర్డ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ విధానంలో యా జమాన్యాలు అవసరమైన సర్టిఫికెట్లు వెబ్‌సైట్‌లోనే అప్‌లోడ్ చేయాల్సి ఉం టుందని, దాంతో వారు కార్యాలయాల చుట్టూ అవసరం ఉండదని అన్నా రు. ఈ నెల 10వ తేదీతో ప్రవేశాలతోపాటు, అఫిలియేషన్ ప్రక్రియ కూడా ముగుస్తుందని స్పష్టం చేశారు. గుర్తింపు లేకుండా కళాశాలలు నిర్వహించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బోర్డు విధించిన జరిమానాలు చెల్లించని కళాశాలలకు అఫిలియేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వలేదని అన్నారు.

కార్పొరేట్ కళాశాలలకు జరిమానా

తాము విజిలెన్స్ దాడులు నిర్వహించి సరైన వసతులు లేకుండా, ప్రమాణాలు పాటించకుండా నడుపుతున్న కళాశాలలకు జరిమానాలు విధించా మని పేర్కొన్నారు. 13 నారాయణ జూనియర్ కళాశాలలకు రూ.62.72 లక్షల జరిమానా, 16 శ్రీచైతన్య కళాశాలలకు రూ.1.04 కోట్లు జరిమానా విధించామని, ఈ యాజమాన్యాలు జరిమానా చెల్లించని కారణంగా అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించలే దని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచిత విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు అందించడం ద్వారా ప్రవేశాలు పెరుగుతున్నాయని అన్నారు. 404 ప్రభుత్వ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ఇప్పటివరకు 98 వేల ప్రవేశాలు జరిగాయని, ఈ ప్రవేశాలు మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. 390 కళాశాలలకు పక్కా భవనాలు ఉన్నాయని, మరో 14 కళాశాలలకు భవనాలు నిర్మించేందుకు స్థలం సేకరించాలని కలెక్టర్లకు లేఖలు రాసినట్లు చెప్పారు. లెక్చరర్లు లేని ప్రభుత్వ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లను నియమించుకోవాలని జూన్‌లోనే ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు ఇచ్చామని, కళాశాలల్లో వసతులు, ల్యాబ్ పరికరాలు సమకూర్చుతున్నామని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో 65 శాతం, ద్వితీయ సంవత్సరంలో 75 శాతం ఉత్తీర్ణత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు నియమిస్తున్నామని, ప్రైవేట్‌లో కూడా ఈ కమిటీలు నియమించుకోవాలని సూచించామని అశోక్ తెలిపారు.

మహిళను చితకబాదిన ఎస్‌ఐ!


మన తెలంగాణ/ నిజామాబాద్ బ్యూరో: కొడుకు దొంగ అనే ఆరోపణపై తల్లిని స్టేషన్‌కు పిలిపించిన ఎస్‌ఐ ఆమెను విచక్షణారహితంగా కొట్టడంతో ఆమె ఒంటినిండా తీవ్ర గాయాలైన సంఘటన నిజాంసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉత్కంఠకు దారితీసింది. నిజామాబాద్ జిల్లా నిజాంసాగర్ మండలంలోని తుంకిపల్లి తండాలో రామవత్ గోపిసింగ్ ఇంటిలో జూలై 31న దొంగతనం జరిగింది. బాధితులు అదే గ్రామంలో ఉంటున్న రాజశేఖర్‌పై అనుమానాలు వ్యక్తం చేశారు. ఫిర్యాదు మేరకు రాజశేఖర్‌ను నిజాంసాగర్ ఎస్‌ఐ అంతిరెడ్డి ఠాణాకు పిలిపించి విచారణ చేయగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దొంగిలించిన బంగారం, 30వేల రూపాయల నగదును తన తల్లికి ఇచ్చినట్లు చెప్పడంతో రాజశేఖర్ తల్లి బాలమణిని స్టేషన్‌కు రప్పించి విచక్షణారహితంగా కొట్టారు. దీంతో ఆమె ఒంటినిండా తీవ్ర గాయాలయ్యాయి. దొంగతనం జరిగిందని ఆరోపిస్తూ కుమారుడితో పాటు తన భార్యను కూడా విచారణ నేపంతో తీసుకుపోయి ఇష్టారీతిన లాఠీలతో చిత్రహింసలు పెట్టారని భర్త మల్లయ్య ఆరోపించారు. పోలీసు అధికారి, సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకోవాలని మల్లయ్య డిమాండ్ చేశారు. బాన్సువాడ రూరల్ సిఐ శ్రీనివాస్‌రావ్ మాట్లాడుతూ వాళ్లను విచారించామే తప్ప బాలమణి, తండ్రి మల్లయ్య జోలికి వెళ్లలేదన్నారు.

సిఎం వద్దకు 'ఉద్యాన' దస్త్రం

మన తెలంగాణ/హైదరాబాద్ : సిఎం చెప్పినా ఆర్థిక శాఖ నో అని బుధ వారం మన తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందిం చింది. ఉద్యాన శాఖలో హార్టికల్చర్ ఆఫీసర్ (హెచ్‌ఒ), హెచ్‌ఇఒ పోస్టులకు సంబం ధించిన ఫైల్‌ను ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యాన శాఖ నుంచి బుధవారం మళ్లీ తెప్పించుకుంది. ఉద్యాన పంటల సాగుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిం చిందని, సిఎం అనుమతితో పోస్టులను త్వరలోనే భర్తీకి త్వరగా అనుమతులు తెచ్చుకుంటామని వ్యవసాయ కార్యదర్శి సి. పార్థసారథి బుధవారం మన తెలంగాణకు తెలిపారు.

లాంగ్ మార్చ్‌కు ఘన స్వాగతం

- నల్లధనంపై మోడీ మాటలు నీటి మూటలే : చాడ



సిద్ధిపేటలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న ఢిల్లీ జెఎన్‌యు నాయకురాలు అపరాజిత


జిల్లాల నుంచి మన తెలంగాణ ప్రతినిధులు: మోడీ పాలన మూడు ఏండ్లు గడిచినా విదేశాల్లో మూలుగుతున్న నల్ల ధనం మునపటోల్నే అక్కడే ఉందని, బిజెపి మాత్రం ఎప్పటోల్నే అబద్దాలు చెపుతున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట రెడ్డి విమర్శించారు. ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లాంగ్‌మార్చ్ సిద్ధిపేటకు చేరుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మరిచిపోయాయన్నారు. మోడీ పాలనలో సంఘ్ పరివార్ శక్తుల ఆగడాలు పెరిగాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజల కష్టాలను తీర్చడంలో టిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. లక్షా ఏడువేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అసెంబ్లీలో గొప్పలు చెప్పిన కెసిఆర్ మూడేళ్ళలో కేవలం 20 వేల లోపు ఉద్యోగాలు భర్తీ చేశారని చెప్పారు. తెలంగాణలో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోనే అత్యధికంగా రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకుని తప్పులను సరిదిద్దుకోవాలన్నారు. నిరుద్యోగులకు అండగా ఎఐఎస్‌ఎఫ్,ఎఐవైఎఫ్‌లు మిలిటెంటు పోరాటాలు చేయాలని దానికి తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి విశ్వజిత్ మాట్లాడుతూ కన్యాకుమారి నుంచి జులై 16 న ప్రారంభమైన లాంగ్ మార్చ్ అరవై రోజులు కొనసాగుతుందని తెలిపారు.

ఉస్మానియా యూనివర్సిటీలో ఘనస్వాగతం


ఉస్మానియా యూనివర్శిటీలో లాంగ్‌మార్చ్ ర్యాలీ

అంతకుముందు హైదరాబాద్‌కు చేరుకున్న లాంగ్‌మార్చ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. యూనివర్సిటీ ఎన్‌సిసి గేటు వద్ద లాంగ్ మార్చ్ బృందానికి స్వాగతం పలికి, ఆర్ట్స్ కాలేజీ వరకు భారీ ర్యాలీగా తీసుకెళ్ళారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీలో రూమ్ నెంబర్ 57లో ఉస్మానియా యూనివర్సిటీ ఎఐఎస్‌ఎఫ్ శాఖ అధ్యక్షులు రెహమాన్ అధ్యక్షతన జరిగిన సభలో కేరళ మాజీ మంత్రి బినయ్ విశ్వం, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు ఆల్తాఫ్ ఆలంఖాన్, తిరుమలై, జెఎన్‌యు విద్యార్థి నాయకురాలు అపరాజిత, ఎఐఎస్‌ఎఫ్, వైఎఫ్ రాష్ట్ర నాయకులు శివరామకృష్ణ, వేణు, బి.రాములు యాదవ్‌లు ప్రసంగించారు. దేశంలో నిరుద్యోగులకు ఉదోయగ అవకాశాలు కల్పించాలని, దళితులపై, మైనారిటీలపై దాడులు అరికట్టాలని, యూనివర్సిటీ స్వయంప్రతిపత్తిని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు స్టాలిన్, లెనిన్, ఎఐఎస్‌ఎఫ్ ఓయు కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, జోగు లింగస్వామి, క్రాంతి, ప్రేమ్, వంశీ, నాగరాజు, రాజు, నర్సింహారాజు, మహేందర్, ఓయు జాయింట్ రిజిస్ట్రార్ ఎల్లేశ్ పాల్గొన్నారు.అనంతరం అక్కడి నుండి ఇసిఐఎల్ వరకు భారీ ర్యాలీగా వెళ్ళారు. అక్కడ లాంగ్ మార్చ్ బృంద సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. వీరికి ఆయా జిల్లాల్లో సంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శి మంద పవన్, మన్నె కుమార్, వెంకటరామిరెడ్డి,ఎఐఎస్‌ఎఫ్ మేడ్చల్ జిల్లా నాయకులు దుర్గాప్రసాద్, మహేశ్, నవీన్, నరేశ్, హరీశ్, లక్ష్మణ్, ఓంకార్, ఇసిఐల్ బాలికల కన్వీనర్ సుమతి, నాగజ్యోతితోపాటు మెడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి జి, ఐలయ్య,సహాయ కార్యదర్శి దశరథ్ తోపాటు నేతలు పాల్గొన్నారు.

" వైఫల్యం ఎదురవగానే నిరాశచెందకూడదు.
అది కొత్త ప్రేరణకు నాంది కావాలి.
-నెహ్రూ "



జనం నెత్తికి వంటగ్యాస్ భారం

సంపాదకీయం

రెండేళ్లలో వంటగ్యాస్ (ఎల్‌పిజి) ధరలపై నియంత్రణ ఎత్తివేయటం ఖాయం. పెట్రోలు, డీజిలు రిటైల్ విక్రయ ధరలను అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ మార్కెట్‌తో సంధానించినట్లే వంటగ్యాస్ ధరను కూడా సబ్సిడీ రహితం చేసే దిశగా కేంద్రప్రభుత్వం ప్రయాణిస్తుంది. క్రమంగా ధర పెంచుతూ ప్రభుత్వ సబ్సిడీని పూర్తిగా ఎత్తివేయటం ప్రభుత్వ లక్ష్యం. అప్పుడు సబ్సిడీ సిలెండర్లు, మార్కెట్ రేటు సిలెండర్లు అనే వ్యత్యాసం అంతరిస్తుంది. అందరికీ ఒకే రేటు. పేదలకు సబ్సిడీ ధరకు వంట గ్యాస్ సరఫరా చేసే విధానం నుంచి ప్రభుత్వం వైదొలిగి ధర నిర్ణయాన్ని మార్కెటింగ్ కంపెనీలకు విడిచిపెడుతుంది. వచ్చే సంవత్సరం మార్చి నాటికి సబ్సిడీలను రూపుమాపే విధంగా 14.2 కిలోల సిలెండర్ ధరను ప్రతినెల రూ.4చొప్పున పెంచాల్సిందిగా ప్రభుత్వరంగ ఆయిల్ కంపెనీలను ఆదేశించినట్లు పెట్రోలియం, గ్యాస్ శాఖామంత్రి ధరేంద్ర ప్రధాన్ సోమవారంనాడు లిఖితపూర్వక సమాధానంలో పార్లమెంటుకు తెలియ చేశారు. 2016 జులై నుంచి సిలెండర్‌కు రూ.2 చొప్పున పెంపుదలను ప్రభుత్వం అనుమతించింది. 2017 మే 30న ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు జారీచేసిన ఆదేశంలో 'ప్రభుత్వ సబ్సిడీ సున్నకు చేరేవరకు, లేదా 2018 మార్చి నెల వరకు లేదా తదుపరి ఉత్తర్వుల వరకు – వాటిలో ఏది ముందు అయితే అప్పటివరకు వంట గ్యాస్ సిలెండర్ ధర పెంపుదలను జూన్ 1నుండి రూ.4చొప్పున కొనసాగించాలి'' అని ప్రభుత్వం తెలిపింది.

పెట్రోలు, డీజిల్ ధరలవలె వంటగ్యాస్ ధర పెంపుదలకు హేతుబద్ధత లేదు. క్రూడ్ ధర అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారల్ ఒకటికి 111 నుంచి 48 డాలర్లకు పడిపోయినందున పెట్రోలు ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గాలి. కాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు పెంచి ఆ తగ్గుదల ఫలితాన్ని తమ ఖాతాకు జమచేసుకుంటూ అధిక ధరాభారాన్ని ప్రజలనెత్తికి బదలాయిస్తున్నాయి. గత రెండేళ్లుగా క్రూడ్ ధర గణనీయంగా తగ్గిపోయింది. మోడీ ప్రభుత్వానికి కలిసొచ్చిన అంశాల్లో ఇదొకటి. పేద గృహిణుల కన్నీరు తుడవటానికై సంపన్న తరగతులు తమ గ్యాస్ సబ్సిడీ వదులుకోవాలని ప్రధానమంత్రి విజ్ఞప్తి చేస్తే, మానవతా దృక్పథంతో కోటిమందికి పైగా స్వచ్ఛందంగా సబ్సిడీ వదులుకున్నారు. 2.5 కోట్లమంది మహిళలకు ఉచితంగా గ్యాస్‌కనెక్షన్ ఇవ్వటాన్ని పెద్ద సంక్షేమ చర్యగా ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం అదే మహిళలపై ధరాభారం మోపనుంది. ఆయిలు కంపెనీలు జిఎస్‌టికి అనుగుణంగా జులై 1న ఒకేసారి సిలెండర్‌కు రూ.32 పెంచాయి. గత మూడు సంవత్సరాలుగా వంటగ్యాస్ ధరను ఎన్నోసార్లు పెంచారు. నెలవారీ పెంపుదల వినియోగదారులపై అంచెలంచెలుగా భారం మోపుతున్నది. దేశం మొత్తంమీద 2017 ఏప్రిల్ 1నాటికి 19 కోట్ల 88లక్షల ఎల్‌పిజి కనెక్షన్‌లుండగా, వాటిలో 87.2 శాతం సబ్సిడీ సిలెండర్లు. నెలవారీ ధర పెంపుదల నిర్ణయం వల్ల వచ్చే మార్చినాటికి గ్యాస్ బండ ధర మరో రూ.40 పెరుగుతుంది. ఈ నిర్ణయం ఎన్ని కోట్ల కుటుంబాలపై భారం మోపుతుందో గ్రహించి, దీన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. లేనట్లయితే ప్రధాని మోడీ వాగ్దానం చేసిన ''మంచిరోజులు'' రాకపోగా చెడ్డరోజులు తిష్టవేస్తాయి.

సబ్సిడీ క్రమంగా ఎత్తివేసే నిర్ణయాన్ని 2010లో యుపిఎ ప్రభుత్వం తీసుకుందని, దాన్ని తాము అమలు చేస్తున్నామని మంత్రి సమర్థించుకోవటం అవమానకరం. ఆనాడున్న అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితి, ఈనాటి పరిస్థితి ఒకటేనా? కుటుంబానికి సంవత్సరానికి గ్యాస్ సిలెండర్లను ఆరుకు తగ్గించాలనే నిర్ణయం ఆనాటి గడ్డు పరిస్థితికి నిదర్శనం. ప్రతిపక్షాలు, ప్రజలు గగ్గోలు పెట్టటంతో 12 సిలెండర్లకు పెంచారు. ఇప్పుడు సబ్సిడీ ఎత్తివేత దిశగా ప్రభుత్వ ప్రయాణాన్ని పార్లమెంటులో ప్రతిపక్షాలన్నీ ఖండించినా ప్రభుత్వంనుంచి సమర్థనే సమాధానం. విశాల ప్రజానీకంలో అసంతృప్తి కలిగించే ఈ నిర్ణయాన్ని మార్చుకోకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది.

అభాసుపాలైన డిజిటల్ విద్య


చూపు

దేశంలో ప్రధాని పేరిటగల 'డిజిటల్ అక్షరాస్యత' కార్యక్రమం ఇతర అక్షరాస్యత కార్యక్రమాలవలెనే కేవలం పేరు రాయగలిగితే చాలు ఆ వ్యక్తికి సర్టిఫికెట్ ఇచ్చేట్లుగా తయారయింది. ఈ పథకం పేరు ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ (పిఎంజిడిఐఎస్‌హెచ్‌ఎ) నాసిరకం 'అక్షరాస్యుల' సంఖ్య పెంచేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని అనిపించక మానదు. రాజస్థాన్‌లో ప్రభుత్వ ఉద్యోగాలకు సమాచార టెక్నాలజీలో సర్టిఫికెట్ (ఆర్‌ఎస్‌సిఐటి) తప్పనిసరి. ఇది 20 గంటల ఉచిత సర్టిఫికెట్ కోర్సు. ఇది ఆధార్‌కు అనుసంధానమయిన కోర్సు. ఇది ప్రపంచంలో అతిపెద్ద డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమం. 2019 మార్చి నాటికి దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో 6 కోట్ల కుటుంబాలను డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం దీని లక్ష్యం. ఇందుకు రూ.2,351 కోట్లు కేటాయించాలని సంకల్పించారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి దేశంలోని రెండున్నర లక్షల గ్రామ పంచాయతీలను ఈ పథకం కిందకు చేర్చారు. ఒక్కో పంచాయతీలో 200–300 మంది అభ్యర్థులు రిజిస్టర్ అవుతారని భావిస్తున్నారు. ఈ పథకం అమలు పర్యవేక్షణకు 1956 కంపెనీల చట్టం ఇ–గవర్నెన్స్ సర్వీసుల కింద కేంద్రప్రభుత్వ ఐటి మంత్రిత్వ శాఖ ప్రత్యేక కేంద్రాలను నెలకొల్పింది. వాటిని కామన్ సర్వీస్ సెంటర్లు (సిఎస్‌సి)అని పిలుస్తారు. సిఎస్‌సిలు ఆయా పంచాయతీల్లో పిఎంజిడిఐ, ఎస్‌హెచ్‌ఎ శిక్షణను ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం కింద అందిస్తాయి.

గ్రామాలకు దూరంగా కేంద్రాలు

శిక్షణ భాగస్వాముల కింద వివిధ ఏజెన్సీలు సహకరిస్తాయి. ప్రతి గ్రామ పంచాయతీలో శిక్షణ కేంద్రం గ్రామాలకు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ శిక్షణ కేంద్రాలు ఆ గ్రామాలకు చాలా దూరంగా ఉండడం అభ్యర్థులకు సమస్యగా మారింది. ఈ సరికే పనిచేస్తున్న ప్రయివేట్ కంప్యూటర్ శిక్షణ సంస్థలను ఈ కేంద్రాలుగా మార్చారు. గంటపాటు ఆన్‌లైన్‌లో 'ఆబ్జెక్టివ్ పరీక్ష' ఉత్తీర్ణులయిన ఒకో రిజిస్టర్డ్ అభ్యర్థికి రూ. 300 చొప్పున ఈ కేంద్రాలకు చెల్లిస్తారు. ప్రతి కేంద్రానికి వెబ్ క్యామ్, బయోమెట్రిక్ ఫింగర్ ప్రింట్ స్కానర్ లేదా ఐరిస్ స్కానర్ ఉన్న కనీసం మూడు కంప్యూటర్లను ఇస్తారు. వాటికి ఇంటర్నెట్ కనెక్టివిటీ, పవర్ బ్యాకప్ కూడా ఉంటుంది. ఒక్కో అభ్యర్థి నుంచి ఆధార్‌నెంబర్, బ్యాంక్ వివరాలను శిక్షకుడు తీసుకుంటాడు. పంచాయతీ సర్పంచ్ నుంచి వాటికి ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలి. అలాగే ఇ మెయిల్ అడ్రస్‌ను డిజిటల్ లాకర్స్ నుంచి సరి చూసుకోవాలి.

ప్రతిరోజు 2 గంటల శిక్షణతోపాటు పురోగతి తెలిపే పత్రాలను శిక్షకుడు పూరించాలి. ఇటువంటి లాంఛనాల భారం వల్ల శిక్షణ కుంటుపడి డిజిటల్ అక్షరాస్యత తగినంతగా సమకూర్చలేక పోతున్నారు. ఈ లాంఛనాల సంఖ్య ఎంత పెద్దదంటే వాటిని పూరించడానికే సమయం సరిపోతోందని, దానితో గ్రామీణులకు డిజిటల్ అక్షరాస్యతలో తగినంత శిక్షణ ఇవ్వలేకపోతున్నామని ఒక శిక్షకుడు తెలిపాడు. ఒక్కో అభ్యర్థికి ఇచ్చే రూ. 300లో చేతికి అందేది రూ. 225 మాత్రమేనని, ట్రయినింగ్ భాగస్వాములు తమ కమీషన్ మినహాయించుకుని ఇస్తారని కూడా ఆయన తెలిపారు. సర్పంచ్ కూడా వాటా అడుగుతాడని, ఇవన్నీపోను ఒక్కోసారి తమ చేతిలోకి చాలా తక్కువ మొత్తం చేరుతుందని చెప్పారు. అంతతక్కువ డబ్బు కోసం ఎవరైనా ఎందుకు శ్రమపడతారు అని ఆయన అడుగుతున్నారు. చాలా మంది శిక్షకులు అభ్యర్థుల నుంచి కూడా రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. అసలు ఈ కార్యక్రమం ఉచితంగా సాగాలి. ఆ లక్ష్యానికే తూట్లుపడుతున్న పరిస్థితి ఉంది.



ఎవరూ ఫెయిల్ కాని విచిత్ర పరీక్ష

ఈ కార్యక్రమం కింద 250 మంది అభ్యర్థులు నమోదు కాగానే అడ్మిషన్లు నిలిపివేస్తారు. ఆ 250 మందిలో సాధారణంగా ఎవరూ ఫెయిల్ అవరు. కానీ ఎవరైనా కొద్దిమంది ఫెయిల్ అయిన పక్షంలో వారి స్థానంలో కొత్తగా అభ్యర్థులను నమోదు చేస్తారు. ఈ ఆన్‌లైన్ పరీక్షలో 25 ప్రశ్నలు వుంటాయి. వాటిలో ఏడింటికి సరిగా సమాధానం ఇస్తే అభ్యర్థి ఉత్తీర్ణుడు అవుతాడు. ఆ విధంగా ఎక్కువ మంది ఉత్తీర్ణులను చూపించి పథకం విజయవంతం అయినట్లు చెప్పడం ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. ఉత్తీర్ణులు కాని అభ్యర్థులకోసం కేంద్రానికి ఏమీ చెల్లించరని ఒక గ్రామ శిక్షకుడు తెలిపాడు.

జాతీయ డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని (ఎన్‌డిఎల్‌ఎం) ఇంతకు ముందు అమలు పరిచారు. 52.5 లక్షల మంది ప్రజలకు ఐటి శిక్షణ అందించడం దాని లక్ష్యం. ఈ పథకాన్ని మూసివేసి ప్రస్తుత ప్రధాని పథకాన్ని ఆరంభించారు. ఎన్‌డిఎల్‌ఎంను సరిగ్గా పర్యవేక్షించకపోవడం వల్ల ప్రజలు దానిని దుర్వినియోగపరిచారు. ఎన్‌డిఎల్‌ఎం కింద ఎన్‌రోల్‌మెంట్‌కు పరిమితి లేదు. శిక్షణ ఖర్చులు కూడా అధికం. ఎస్‌సి/ఎస్‌టి అభ్యర్థులు రూ.500 చొప్పున చెల్లించాలి. అయితే ఒబిసి కేటగిరి వారు కేవలం రూ.300 చెల్లిస్తే చాలునని నిబంధన విధించారు. ఇది విమర్శలకు గురి అయింది. ఈ పథకం ద్వారా శిక్షకులు భారీ మొత్తంలో సొమ్ము చేసుకున్నారు. వారిపై సరైన అదుపు కొరవడింది. అభ్యర్థుల నుంచి ఆధార్ కార్డులను సేకరించి శిక్షకులే స్వయంగా పరీక్షలు నిర్వహించడం అవినీతికి దారితీసింది.

పర్యవేక్షణ ఘనం – ఫలం శూన్యం

అయితే ప్రస్తుతం పిఎంజిడిఐఎస్‌హెచ్‌ఎ కింద పర్యవేక్షణను పెంచారు. అభ్యర్థులకు వారి రిజిస్ట్రేషన్ సరిచూడ్డం కోసం ముందు చెప్పకుండా ఫోన్ చేయడం వంటి కట్టుదిట్టాలు అమలవుతున్నాయి. అయితే ఆ కేంద్రాలు ఇచ్చే సర్టిఫికెట్లు గ్రామీణులకు సరియైన అర్హతను అందించడం లేదు. 'డిజిటల్ అక్షరాస్యులు' అని ఓ గుర్తింపును పొందడంతో ఆ సర్టిఫికెట్ల ప్రయోజనం అంతమవుతోంది. ప్రస్తుతం కూడా ఆధార్ కార్డు లింకు వల్ల రూ.100 అక్రమంగా వసూలు చేసే వ్యవహారం నడుస్తోంది. ఈ సర్టిఫికెట్లను రాజస్థాన్‌లో మాదిరిగా దేశమంతటా ఉద్యోగాలకు తప్పనిసరి చేస్తే ఎలా అన్న భయాలు వ్యాపిస్తున్నాయి. అయితే అధికారులు మాత్రం ఈ పథకం ఫలవంతం అవుతున్నట్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్టిఫికెట్లను ఉద్యోగాలకు తప్పనిసరి చేయరాదని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే అసలయిన డిజిటల్ అక్షరాస్యతను అందించడంలో పథకం విఫలం అయినట్లేనని చెబుతున్నారు.

– శృతి జైన్

2031 వరకు డీలిమిటేషన్ లేనట్లే!



టి.కె.విశ్వనాధన్

ప్రధానమంత్రి నరేంద్రమోడీ సోమవారం నాడు పార్లమెంటు భవనానికి అనుబంధంగా ఒక కొత్త భవనాన్ని ప్రారంభించారు. అది మన శాసనకర్తలకు మరింత జాగా ఇస్తుంది, మెరుగ్గా పనిచేసేందుకు వీలు కల్పిస్తుంది. అయితే మరికొద్ది సంవత్సరాల్లో మనకు వాస్తవంగా సరికొత్త పార్లమెంటు భవనం కావలసి వస్తుంది. ఎందుకంటే, ఉభయసభల సభ్యుల సంఖ్యపై విధించిన స్తంభన 2026లో ముగుస్తుంది. అప్పుడు సభ్యుల సంఖ్య పెరుగుతుంది. రాజ్యాంగ (42వ సవరణ) చట్టం, 1976 ద్వారా ఆ స్తంభన విధించబడింది. కొత్తభవనం అవసరం కన్నా, ఎంతో ప్రాముఖ్యతగల రాజ్యాంగ కోణాలపై చర్చను కేంద్రీకరించాలి. ఈ అదనపు సీట్లను రాష్ట్రాలకు ఎలా కేటాయిస్తారు? 1971 జనాభా లెక్కల ప్రాతిపదికపై సీట్లు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు సీట్లు పెరగటం అనే పరిస్థితి ఎదురైంది. ఈ భయాందోళనను తొలగించే నిమిత్తం రాజ్యాంగ (42 సవరణ) చట్టం, 1976లో సెక్షన్ 15 ద్వారా 1971 జనాభా లెక్కకు సంబంధించి జనాభా సంఖ్యను స్తంభింపచేయటం జరిగింది. దాని ప్రకారం, 2000 సంవత్సరం తదుపరి తొలి జనాభా లెక్కలు ప్రచురించేవరకు ఆర్టికల్ 81(3)(i) అవసరం నిమిత్తం సంబంధిత సంఖ్య 1971 జనాభా లెక్కల ప్రకారం జనాభా సంఖ్య 54.81కోట్లు, రిజిస్టర్డ్ ఓటర్లు 27.4కోట్లు. రాజ్యాంగ (84వ సవరణ) చట్టం, 2001లోని సెక్షన్ (3)ప్రకారం ఆ అంతిమ గడువును 2000 నుంచి 2026కు పొడిగించటం జరిగింది.

సీట్ల కేటాయింపుపై స్తంభన ఉన్న ఫలితంగా, 1971 జనాభా లెక్కలు ప్రాతిపదికగా చేసిన సీట్ల కేటాయింపు ప్రస్తుత జనాభా సంఖ్యలకు మంచిగానే ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశ జనాభా 121 కోట్లు, రిజిస్టర్డ్ ఓటర్లు 83.41 కోట్లు. ఈనాటి జనాభాకు ప్రాతినిధ్యంగా1971నాటి 54.81 కోట్లు జనసంఖ్యను ప్రాతిపదికగా తీసుకోవటం మన ప్రజాతంత్ర రాజకీయ వ్యవస్థకు వక్రీకరణం అవుతుంది, రాజ్యాంగ ఆర్టికల్ 81 ఆదేశానికి విరుద్ధమవుతుంది.

రెండు, అంతకన్నా ముఖ్యం కాకపోయినా అంతే సమాన ప్రాధాన్యతగల సమస్య – సభ్యుల సంఖ్య పెరిగి, సభలో సమస్యలు లేవనెత్తే నిమిత్తం స్పీకర్ దృష్టిని ఆకర్షించటానికై సభ్యులు పరస్పరం పోటీ పడుతుంటే, అంతపెద్ద సంఖ్య సభ్యులతో పార్లమెంటు ఉభయ సభలు/లెజిస్లేచర్ల సభాధ్యక్షులు వ్యవహరించటం ఎలాగో! సభా కార్యక్రమాలు నిర్వహించటం స్పీకర్‌కు మహాకష్టమవుతుంది. స్పీకర్ విజ్ఞప్తులను సభ్యులు చెవిన పెట్టనపుడు సభను సజావుగా నడపటం కష్టమైన వ్యవహారం అవుతుంది. స్పీకర్ ఆదేశాలు, రూలింగ్‌లకు తగిన గౌరవం ఇవ్వకపోతే, సభా కార్యక్రమాల నిర్వహణకు అడ్డుతగిలితే సమస్య తీవ్రమవుతుంది. సభ్యులసంఖ్య ఆకస్మికంగా పెరగటం స్పీకర్ కర్తవ్యనిర్వహణను మరింత కష్టభరితం చేస్తుంది.

మూడు, మన ప్రజాస్వామిక వ్యవస్థకు జవం–జీవం లాంటి జీరోఅవర్, ప్రశ్నోత్తరాలసమయం, అత్యవసర ప్రజాప్రాముఖ్యతగల సమస్యలను లేవనెత్తటం–ఉదయాన సభ ప్రారంభం కాగానే వాటికుండే 60 నిముషాల వ్యవధిలో చాలా కష్టతరమవుతుంది. అందువల్ల చట్టసభలు సమావేశాల కాలంలో ఎక్కువ గంటలు సమావేశం కావటం, సంవత్సరంలో ఇప్పటికన్నా ఎక్కువ రోజులు సమావేశం కావటం అవసరమవుతుంది.



2026కు ఇంకా కొన్ని సంవత్సరాల దూరం ఉన్నప్పటికీ, ఉత్పన్నంకాగల సమస్యలపై మనం ఇప్పటినుంచే చర్చ మొదలుపెట్టకపోతే, సీట్లసంఖ్యపై స్తంభన ఎత్తివేతను, 2001లో జరిగినట్లు మళ్లీ తప్పని సరిగా వాయిదా వేయవలసి వస్తుంది. ఇది సమస్యను వాయిదా వేస్తుంది. అందువల్ల కాస్త వెనకాముందుగా మనం పరిష్కారం కనుగొనాలి.

కేటాయింపును స్తంభింపచేయాల్సిన అవసరం ఏర్పడిన సమస్యలను ఎలా పరిష్కరిస్తారు?

రాజ్యాంగ 42వ సవరణ చట్టం, 1976కు ముందున్నట్లుగా, రాజ్యాంగం ఆర్టికల్ 81 ప్రకారం 550 మించని సంఖ్యతో లోక్‌సభ ఏర్పడాలి. ఆర్టికల్ 81 క్లాజు (2) ఇలా చెప్పింది : క్లాజు 1లోని సబ్ క్లాజు(ఎ) ప్రకారం, రాష్ట్ర సీట్ల సంఖ్య–జనాభా మధ్య దామాషా ఆచరణాత్మకత మేరకు అన్ని రాష్ట్రాలకు ఒకే రీతిగా ఉండే విధంగా లోక్‌సభలో ప్రతి రాష్టానికీ సీట్లు కేటాయించాలి. ''జనాభా'' అనే వ్యక్తీకరణను ఆర్టికల్ 81 ప్రయోజనం నిమిత్తం క్లాజు(3) ఇలా నిర్వచించింది: జనాభా అనగా అంతకు క్రితం జనాభా లెక్కల సేకరణ ప్రచురణ ద్వారా నిర్ధారితమైన సంఖ్య.

ఈ ఆదేశం పర్యవసానంగా, జనాభా పెరుగుదలను నియంత్రించటంలో ముందున్న రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్ల సంఖ్య తగ్గటం, జనాభా పెరుగుదల కరణం అవుతుంది, రాజ్యాంగ ఆర్టికల్ 81 ఆదేశానికి విరుద్ధమవుతుంది.

అందువల్ల 2026 జనాభా లెక్కలు లభ్యం కాగానే–అంటే 2031లో తాజాగా డీలిమిటేషన్ (నియోజక వర్గాల పునర్విభజన) చేబట్టాల్సి ఉంటుంది. అది పార్లమెంటులో రాష్ట్రాలకు సీట్ల కేటాయింపుకు ప్రస్తుతమున్న ఏర్పాటును నాటకీయంగా మార్పు చేస్తుంది.

సీట్ల సంఖ్యలో పెరుగుదలను ఇముడ్చుకునే సమస్యను చర్చించే ముందు, చర్చించి, సమాధానాలు కనుగొనాల్సిన అంతకన్నా ముఖ్యమైన సమస్యలున్నాయి. ఒకటి, 1971 జనాభా ప్రాతిపదికపై సీట్ల కేటాయింపును స్తంభింప చేయటాన్ని 1976లో తప్పనిసరి చేస్తూ వ్యక్తమైన ఆందోళనలు ఈనాటికీ అలాగే ఉన్నట్లు కనిపిస్తున్నది. సంబంధీకులందరి (అన్ని రాష్ట్రాలు అని అర్థం) సంతృప్తిమేరకు ఆ సమస్యను పరిష్కరించాలి.


2026కు ఇంకా కొన్ని సంవత్సరాల దూరం ఉన్నప్పటికీ, ఉత్పన్నంకాగల సమస్యలపై మనం ఇప్పటినుంచే చర్చ మొదలుపెట్టకపోతే, సీట్లసంఖ్యపై స్తంభన ఎత్తివేతను, 2001లో జరిగినట్లు మళ్లీ తప్పని సరిగా వాయిదా వేయవలసి వస్తుంది. ఇది సమస్యను వాయిదా వేస్తుంది. అందువల్ల కాస్త వెనకాముందుగా మనం పరిష్కారం కనుగొనాలి. ఎన్నికల సంస్కరణల నిమిత్తం వివిధ కమిషన్‌లు గత దశాబ్దంలో సమర్పించిన సిఫారసులు ఈ సమస్యల జోలికి వెళ్లలేదు. ఇవి మన రాజకీయ నాయకులు సమీప భవిష్యత్‌లో పరిష్కరించాల్సిన సవాళ్లు.

(రచయిత కేంద్ర న్యాయశాఖ కార్యదర్శిగా, లోక్‌సభ సెక్రటరీ జనరల్‌గా, రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి సలహాదారుగా పనిచేశారు.)

శాస్త్రీయ స్ఫూర్తి పి.ఎం. భార్గవ

అద్భుత మేధో సంపన్నులు మన మీద అలకబూని వరసకట్టి దూరమవుతున్న దుస్థితి ఇది. అంతరిక్ష ప్రయోగాల్లో దేశానికి కీర్తి పతాక నందించిన యు.ఆర్.రావు(ఉడిపి రామచంద్రరావు), అంతరిక్ష, విద్యారంగాల్లో దేశానికి దిశానిర్దేశం చేసిన ప్రొ.యశ్‌పాల్ శర్మ మరణ శోకం నుండి జాతి తేరుకోకముందే పి.ఎం.భార్గవ ఆగస్టు 1న సాయంత్రం హైదరాబాద్‌లో కన్నుమూశారు.

ప్రపంచస్థాయి జీవ సాంకేతిక శాస్త్రవేత్త, అగ్రగణ్య హేతువాది అయిన పుష్యమిత్ర భార్గవ దేశానికి, మానవాళికి చేసిన అలుపెరగని కృషికి షరా మామూలుగా మరణానంతరం ఆయన సేవలను వల్లించుకోవడమంటే మన కురుచ చూపుకు ఆయన కీర్తి ఆననట్లే.



ఏ వైపు నుంచి చూసినా అసమాన ప్రజ్ఞాపాటవ, జ్ఞానాంబుధిలా నిండైన ఆయన వ్యక్తిత్వాన్ని తాకడానికి పాలక వక్రబుద్ధులకు హక్కు లేదనిపిస్తుంది. నిరంతర శాస్త్ర పరిశోధనలో నిమగ్నమైనా, ప్రాథమి కంగా తాను దేశ పౌరుడినని, మనిషినని తలంచి అవసరాను గుణంగా ప్రయోగ శాల తలుపులు తెరుచుకుని ఎంతటి వారినైనా ప్రశ్నించిన ధీరగుణం ఆయనది.

22 ఫిబ్రవరి 1928న రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన పి.ఎం.భార్గవ చదువు వారణాసిలో సాగింది. వయసుకు మేధస్సుకు ఏ మాత్రం పొంతనలేనిరీతిలో భార్గవ తన పదవ ఏటనే సరాసరి తొమ్మిదవ తరగతిలో చేరారు. 16 ఏళ్లకే బి.ఎస్‌సి, 18ఏళ్లకు ఎం.ఎస్‌సి పూర్తిచేశారు. 21ఏళ్లు నిండ కుండానే లక్‌నవూ యూనివర్శిటీలో సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. శాస్త్ర పరిశోధన నిమిత్తం 1953లో అమెరికా వెళ్లిన ఆయన క్యాన్సర్‌కు మందు కనుగొనే ప్రాజెక్టులో భాగమైనారు.

అమెరికా, కెనడా, జర్మనీ ఇలా 50దేశాల్లో జీవశాస్త్ర సంబంధిత సెమినార్లలో పాల్గొన్నారు. జీవశాస్త్రంలో వచ్చిన అధునాతన పరిశోధనల్లో భాగంగా హైదరాబాద్‌లో 1977లో స్థాపించిన సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సిసిఎంబి)కి వ్యవస్థాపక అధ్యక్షుడుగా 1990 వరకు కొనసాగారు.

శాస్త్ర పరిశోధనల్లో ఆయన దృష్టి ఎప్పుడూ మానవీయ కోణంలోనే సాగేది. శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి పేరిట మానవాళికి కీడు తలపెట్టే అంశాన్ని ఆయన నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. అభివృద్ధిలో ఆరోగ్యం కూడా ప్రధాన విషయంగా భావించారాయన. బిటి విత్తనాలను, జన్యుమార్పిడి వంగడాలలో ఉన్న దుష్పరిణామాలను ఆయన ఎత్తి చూపారు.

శాస్త్రీయ పరిశోధనతోపాటు ఆయనలో ఉన్న హేతుబద్ధ స్పృహ ఆయనను విలక్షణ స్థానంలో నిలబెట్టింది. 1964లో భార్గవ అంతరిక్ష శాస్త్రవేత్త సతీష్‌ధావన్, విజ్ఞాన శాస్త్ర చరిత్రకారుడు అబ్దుల్ రహమాన్ తో కలిసి శాస్త్రీయ స్ఫూర్తి అభివృద్ధి సంఘం స్థాపించి హైదరాబాద్‌లో ఓ అంతర్జాతీయ సదస్సు నిర్వ హించారు.

అట్లే అక్టోబర్ 1980లో తమిళనాడులోని కూనూరులో శాస్త్ర పరిజ్ఞానం ద్వారా హేతుబద్ధ విస్తరణ అనే అంశంపై నాలుగు రోజులపాటు జరిగిన సెమినార్‌కు మూలస్తంభం భార్గవనే. భారతదేశంలో పాదుకొని పోతున్న సామాజిక దురాచారాలను, మూఢనమ్మకాలను రూపుమాపేందుకు శాస్త్ర ఉపయోగాన్ని అందులో లోతుగా చర్చించారు. ప్రొ.పిఎన్.హక్సర్, రాజారామన్నలు భార్గవకు తోడు నిలిచారు.

వీరి కృషి ఫలితంగా ఆర్టికల్ 51(హెచ్)లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా శాస్త్రీయ స్పృహ, భావనలు పౌరుడి ప్రాథమిక సూత్రాలలో భాగమయ్యాయి.

ఫిబ్రవరి 2001లో ఆనాటి ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ వేద, జ్యోతిష్యంలో కోర్సును ప్రవేశపెట్టేందుకు దేశంలో విశ్వవిద్యాలయాలనుండి అభిప్రాయాల్ని ఆహ్వానించింది. ఈ ప్రతిపాదనను పిఎం భార్గవతోపాటు ప్రొ. యశ్‌పాల్, జెవి.నార్లీకర్ వ్యతిరేకిం చారు. దీనిపై ప్రజాప్రాయోజిక వ్యాజ్యాన్ని భార్గవ ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టులో తిరిగి సుప్రీంకోర్టులో వేశారు. సుప్రీంభార్గవ పిటిషన్‌ను తిరస్క రించింది.

కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) లో జరుగుతున్న అక్రమాలపై, నిధుల దుర్వినియోగంపై శివ అయ్య దురి నివేదికకు మద్దతుగా ఆనాటి ప్రధాని మన్ మోహన్ సింగ్‌కు భార్గవ లేఖ ద్వారా తెలియ చేశారు. సామాజిక దురాచారాలనే కాకుండా దుర్వినియోగాలను, దుర్నీతిని ఎండగట్టడంలో ఆయన ముందున్నారు.

1986లో ఆయన శాస్త్ర పరిశోధనలకు గౌరవంగా భారత ప్రభుత్వం ఇచ్చిన పద్మ భూషణ్ పురస్కారాన్ని 2015 లో ప్రభుత్వానికి తిరిగి ఈయడం ద్వారా తన నిబద్ధతను నిలబెట్టుకున్నారు. 2015లో దేశంలో పెరిగిన మతపరశక్తుల అసహనానికి వ్యతిరేకం గా, కన్నడ రచయిత కల్‌బుర్గి కాల్చివేతకు నిరసనగా ఆయన తన పద్మభూషణ్ పురస్కారాన్ని వాపసు చేశారు. ఇలా మొదలైన పురస్కా రాల వాపసి కొంత విమర్శ లకు తావిచ్చినా ప్రభుత్వానికి మాత్రం షాక్ ట్రీట్‌మెంట్‌లా పని చేసింది. ఈ సందర్భంగా భార్గవ చర్యను టివిలో పదేపదే చూపించడం పట్ల కినుక వహించిన బిజెపి నాయకులు ఆయనను నక్సల్స్ అనుకూలుడని నోరు పారేసు కున్నారు.

శాస్త్రీయ, హేతుబద్ధ పరిశోధనలకు నిలయమైన సిఎస్ఐఆర్‌లోకి ఆర్‌ఎస్‌ఎస్ అనుకూలురు రావడాన్ని, శాస్త్రీయ స్ఫూర్తిని పెంపొందించే పరిశోధనలకు నిధుల కోత విధించడాన్ని భార్గవ వ్యతిరేకించారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికై పాలించవలసిన మంత్రులు ప్రమాణ స్వీకారం కోసం ముహూర్తాలు వెతుక్కోవడాన్ని బహిరంగంగా విమర్శించారు. పుష్పక విమానంగా విమానాల తయారీ మన పురాణాల్లో ఎన్నడో ఉన్నదని, శరీర అవయవాల మార్పిడి సైతం మన ప్రాచీన గ్రంథాల్లో కలదని ప్రధాని మోదీ అన్న మాటలను భార్గవ అంగీక రించలేదు.

తన హేతువాద శాస్త్రీయ జ్ఞానాన్ని పంచేదిశగా భార్గవ పలు పుస్తకాలు కూడా రాశారు. ఏంజిల్స్, డెవిల్స్ అండ్ సైన్స్ మరియు ది ఫేసెస్ ఆఫ్ బ్యూటీ, సైన్స్, ఆర్ట్ అనే పుస్తకాలు ఆయన ఆలోచనా సరళిని ప్రతిబింబిస్తాయి. వీటితోపాటు వేలాది వ్యాసాలు అన్ని రకాల పత్రికల కోసం రాశారు. తన తొంబై ఏళ్ల జీవితాన్ని తొమ్మిది దశాబ్దాలుగా విభజించి దశాబ్దానికొక సంపుటిగా తయారు చేశారు. ప్రతి సంపుటిలో ఆ పదేళ్లలో తన జీవితంలో సంభవించిన ఘటనలను, విశేషాలను గ్రంథస్తం చేశారు.

ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా కాకుండా మతవాద నియంతృత్వ ధోరణిలో సాగుతున్నదని, దేశాన్ని పాకిస్థాన్‌లా మతాధిపత్య దేశంగా మార్చేందుకు అంగీకరించేది లేదని నిరసించిన ధైర్యశాలి భార్గవ. శాస్త్రవేత్తగా ఉన్నత శిఖరాలధిరోహించినా సామాన్యుడి కోసం అన్నింటినీ దిగివచ్చిన నూరుపాళ్ల మానవత్వం మూర్తీభవించిన హేతువాది పి.ఎం.భార్గవ. ప్రభుత్వాల డైరీలో కాకుండా ప్రజల గుండెల్లో ఆయన స్థానం సుస్థిరం.

– బి.ఎస్, 9440128169

మన తెలంగాణ

అఖిల

5

హైదరాబాద్
గురువారం
3, ఆగస్టు, 2017
www.manatelangana.news



ఎర్ర గులాబి

ఎరుపు రంగు గులాబి ప్రేమకు చిహ్నం. విశ్వాసాన్ని, కోరికలను పెంచుతుంది. ఎర్ర గులాబి సూర్యుడికి చిహ్నం. భూమిపై అభిరుచిని తెలుపుతుంది. సంతానోత్పత్తికి సాయపడుతుంది. ఆకర్షణకు మూలం. ప్రేరణను కలిగిస్తుంది. వైద్యంలో పనికొస్తుంది.



పింక్

ఆత్మవిశ్వాసాన్ని కలుగజేస్తుంది. హృదయ సంబంధ సమస్యలను పోగొడుతుంది. ప్రేమకు చిహ్నం. కొత్త జీవితానికి నాంది పలికేది పింక్ గులాబి. ఇద్దరి మధ్య సత్సంబంధాన్ని కలిగించేది.


బ్లూ పర్పల్ (నీలం)

ప్రేరణ, సృజనాత్మకతకు చిహ్నం నీలం గులాబి. నావల్ల కాదు అనే భావనను పోగొట్టే అద్భుతమైన రంగు ఇది. సాహిత్యం కళలను ప్రతిబింబించే పుష్పాలివి.
ప్రేమ, సంపద, అమరత్వాలకు చిహ్నం. సంప్రదాయ హైబ్రిడేజేషన్ ద్వారా 2004లో నీలం రంగు గులాబీని సృష్టించారు.



నారింజ రంగు గులాబి

భావోద్వేగాలను తగ్గిస్తుంది. కోపాన్ని పోగొడటంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. సృజనాత్మకతను పెంచే గులాబీ ఇది. వంటరితనాన్ని, విచారాన్ని పోగొట్టే స్వభావంగల పుష్పం.



ఈ గుభాళింపు తెలంగాణ ఇంపు

పండగల సీజన్ మొదలైంది. పండగలు పబ్బాలనగానే అందరికీ గుర్తుకువచ్చేది, అవసరపడేది పువ్వులు. వ్రతాలు చేసుకునే వారికి, పెళ్లి చేసుకునే వారికి, అతిథి సత్కారాలు చేసే వారికి కావాల్సింది పూలదండలే! మార్కెట్లో ఎన్ని రకాల పూలున్నా ఆడవాళ్ళ మనసు దోచుకునేది గులాబీ! తలలో పెట్టుకోవాలన్నా, దేవుడికి మాలగా అందించాలన్నా, పెళ్లిలో వరమాలగా కాబోయే శ్రీవారికి వేయాలన్నా గులాబీ దండలనే కోరుకుంటారు. మల్లెలు , మొల్లలు, సన్నజాజులు, సంపెంగల వంటివి ఉన్నా వాటిని తలలో దండలా పెట్టుకోడానికి ఇష్టపడతారే తప్ప దండగా వేసుకోడానికి ప్రిఫర్ చేయరు. మాల అనగానే అందరూ కోరుకునేది, బొకేలా ఇవ్వాలనుకున్నా ఏరుకునేది, ఎంచుకునేది గులాబీనే! అంతెందుకు తిరుమలలో వేంకటేశ్వర స్వామి కూడా మోజుపడి ఒక రోజ్ గార్డెన్ పెంచుకుంటున్నాడంటే ఈ పువ్వుకున్న విలువ యేమిటో ఎంతో అర్థం చేసుకోవచ్చు. ప్రేమకు ఉత్తమ అభిరుచికి సంకేతం గులాబీ!

గులాబీ చాలాకాలం వరకు పెరటి మొక్కగానే ఉంది. ఆ తర్వాత అది కమర్షియల్ క్రాప్‌గా మారి రైతుకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఆడవాళ్ల జడలోకి, సిగలోకి, దేవుడి పూజలోకి, గౌరవ అతిథులు మెడలోకి, పుష్ప గుచ్ఛాలలోకి ఇది ప్రస్తానం చేస్తూ అడుగుపెట్టిన ప్రతీచోట తన మార్కు అందాన్ని పరుస్తూ అన్ని తరగతుల వారి ఆదరణ పొందుతోంది. రోజ్ సాగు తెలంగాణాలో కూడా ఈ మధ్య కాలంలో ఊపందుకుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రోజ్ సాగును ప్రోత్సహించడానికి సంకల్పించడంతో దీని సాగు మరింతగా విస్తరించింది. వెయ్యి ఎకరాలలో పాలిహౌస్‌లు ఏర్పాటుచేసి కట్ ఫ్లవర్ సాగుచేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పెళ్ళిళ్ళు పేరంటాలు, సకల శుభకార్యాలలో గులాబీ మాలలు, బొకేల కోసం విపరీతమైన డిమాండ్ ఉంటోంది. ఈ డిమాండ్‌ను తట్టుకోలేక వ్యాపారాలు ఇతర రాష్ట్రాల నుంచి రోజాలను తెప్పిస్తున్నారు. స్థానికంగా పూస్తున్న రోజాలు ఉన్న డిమాండ్‌లో సగాన్ని కూడా అందుకోలేకపోతున్నాయి. అందుకే దీన్ని భారీగా పెంచేందుకు, స్థానిక మార్కెట్‌ను పూర్తిగా అందుకుని ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేసే స్థాయికి దీన్ని తీసుకువెళ్ళేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలో గ్రీన్‌హౌస్‌లు ఏర్పాటుచేసి రోజాలను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా చేవెళ్ళ, శంషాబాద్‌లలో ఈ రోజ్ హౌస్‌లు కనిపిస్తాయి. పాలీహౌస్‌లు ఏర్పాటుచేసి రోజాలను సాగుచేసేవారికి 75 శాతం సబ్సిడీ అందుబాటులో ఉంది. మంచి ధర కూడా పలికే గులాబీలను చీడపీడల నుంచి ఫంగస్ నుంచి జాగ్రత్తగా కాపాడుకోవాలి. అందుకు అవసరమైన పురుగుమందులు, ఎరువులు మార్కెట్లో దొరుకుతున్నాయి. రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందించేందుకు ఉద్యానవన అధికారులు అందుబాటులో ఉంటారు. వారిని రోజా సాగువిషయమై సంప్రదించడం మంచింది.

తెలంగాణా అంతటా లూజుపూల వ్యాపారం జోరుగా సాగుతోంది. దాదాపు 50వేల ఎకరాలలో లూజుపూలు సాగవుతున్నాయి. వీటిలో 2,960 హెక్టార్లలో మేరీగోల్డ్, 1,320 హెక్టార్లలో క్రిజెంట్ పూలు, 1,182 హెక్టార్లలో రోజాపూలు, 1,000 హెక్టార్లలో మల్లెపూలు పండిస్తున్నారు. ఇవి కూడా రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లలలో అధికంగా కనిపిస్తుంది. తక్కువ నీటితో పండించే పూలను, కూరగాయలను సాగుచేసేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జీడిమెట్లలోని సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఆవరణలో ఇజ్రాయెల్ శాస్త్రవేత్తల సాయంతో ఈ రకం పూలు, కూరల సాగు ప్రయత్నాలు చేస్తున్నారు. హర్యానాలో ఇప్పటికే ఈ తరహా సాగు చేస్తున్న నిపుణుల సహకారం కూడా తీసుకుని ఈ ప్రయోగాలు చేస్తున్నారు.



పసుపు

18వ శతాబ్దంలో కనుగొన్న పసుపు గులాబీలు ఎంతో ప్రాధాన్యత కలవి. ఉత్సాహానికి, స్నేహానికి, ప్రేమకు సంకేతం. వ్యక్తుల మధ్య సంబంధాలను బలపరుస్తుంది. స్నేహన్ని సూచించేది పసుపు రంగు గులాబి. ప్రశాంతతకు , సంతోషానికి ప్రతీక. ఏకాగ్రత కలగాలంటే వీటి సావాసం చేయాల్సిందే.

తెలుపు

ఆధ్యాత్మిక దృష్టిని, అంతర్శుద్ధిని విస్తృతపరుస్తుంది. చంద్రుడికి గుర్తుగా వాడతారు. శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీక. గతం నుంచి విముక్తి కలిగిస్తుంది. స్వచ్ఛతకు చిహ్నం. అమాయకత్వానికి నిదర్శనం తెల్లగులాబి. దంపతుల మధ్య స్నేహన్ని, గౌరవాన్ని రెట్టింపు చేస్తుంది. జీవితాంతం ప్రేమను నిలుపుతోంది. ఇంటి అలంకరణలో ప్రముఖ పాత్ర దీనిదే.



మా మంచి పిచ్చమ్మ



తనలాంటి కన్నీళ్లు మరెవరికీ రావొద్దని కోరుకునేవాళ్లు చాలా అరుదుగా వుంటారు. అలాంటి పెద్ద మనసే పిచ్చమ్మది. జగమంత కుటుంబం ఉన్నా ఏకాకి జీవితం గడిపే ఒంటరి మహిళకు ఆమె ఆత్మబంధువైంది. వికలాంగులను చేరదీసి నేనున్నానంటూ ఆపన్న హస్తం అందిస్తోంది. శాంతి మహిళా మండలి పేరుతో అభాగ్యులకు నిస్వార్థ సేవ చేస్తున్న మా మంచి అమ్మ పిచ్చమ్మ.

పెళ్లంటే నూరేళ్ల పంట అంటారు. కానీ పిచ్చమ్మ జీవితంలో అది మూణ్నాళ్ల ముచ్చటే అయింది. ఊహ తెలియని వయసులోనే పెళ్లి చేసారు. చేసుకున్నవాడు మధ్యలోనే కాలం చేశాడు. సంతానం లేదు. భర్త హఠాన్మరణంతో పిచ్చమ్మ ఒంటరైపోయింది. ఏడ్చీ ఏడ్చీ కన్నీళ్లు ఇంకిపోయాయి. చీకటిల్లు ఇంకెన్నాళ్లు..? చుట్టుపక్కల వాళ్ల మాటలు ఆలోచింపజేశాయి. మనిషి ఒంటరే కావొచ్చు. కానీ సమాజం ఒంటరి కాదు. తనలాంటి వాళ్లు ఎందరో ఇంకా లోకంలో దిక్కూమొక్కూ లేక పడివున్నారు. వాళ్లకోసం ఏమైనా చేయలేమా అని ఆలోచించింది.

కన్నవారికి భారం కాకూడదని పుట్టిన ఊరు పెద్ద సూరారం నుంచి నల్లగొండ జిల్లా కేంద్రానికి వచ్చింది. చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని 1990లో మహిళల కోసం టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించింది. కొంత మంది మహిళల్ని చేరదీసి టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చింది. వాళ్లను సొంత కాళ్ల మీద నిలబడేందుకు ప్రోత్సహించింది. అందరి నుంచి ప్రశంసలు వెల్లువలా వచ్చాయి. అధికారులు కూడా పిచ్చమ్మ మంచితనాన్ని ప్రోత్సహించారు. రెండేళ్ల తర్వాత శాంతి మహిళా మండలి పేరుతో మహిళల వృద్ధాశ్రమాన్ని నెలకొల్పింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు వందల మంది ఒంటరి, వృద్ధ మహిళలు పిచ్చమ్మ ఆశ్రమంలో చేరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో శాంతి మహిళా మండలి అంటే తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారు లేరు.

25 ఏళ్లుగా ఒంటరి మహిళలు, అనాథలు, శారీరక వికలాంగులు, మానసిక వికలాంగులు, ఎందరో పిచ్చమ్మ ఇంట్లో తలదాచుకున్నారు. వారికి భోజన వసతి కల్పించడం, అవసరమైన వైద్య సేవలందించడం, తోడబుట్టిన వాళ్లు కూడా అలాంటి చేయరు. మాటలకందని సేవ చేస్తోంది పిచ్చమ్మ.

మహిళల అభ్యున్నతి కోసం పాటు పడే ఉక్కు మహిళగా పేరు తెచ్చుకున్న పిచ్చమ్మను సాక్షాత్తూ కలెక్టర్లే సన్మానం చేశారు. ప్రజాప్రతినిధులు ఎన్నో అవార్డులు అందజేశారు. ఆర్థికంగా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా వెరవకుండా ధైర్యంగా ముందుకు సాగింది. ప్రస్తుతం పిచ్చమ్మ వృద్ధాశ్రమంలో 46 మంది ఆశ్రయం పొందుతున్నారు. అంత్యక్రియలు చేసేందుకు డబ్బుల్లేని పేదవారికి తనవంతు సాయం చేస్తుంది. నలుగురు మహిళలను వెంటతీసుకెళ్లి వారి పాడె మోసి, అంతిమ సంస్కారాలు చేస్తుంది.

ఇంత చేస్తున్నా పిచ్చమ్మకు దాతల సాయం కూడా అంతంత మాత్రమే. కేవలం ప్రభుత్వం నుంచి డీఆర్డీఏ నుంచి వచ్చే డబ్బులతోనే పిచ్చమ్మ ఆశ్రమాన్ని నడుపుతోంది. కొన్నిసార్లు అప్పులు చేసి మరీ వారిని పోషిస్తోంది.

వృద్ధాశ్రమానికి సొంత భవనం లేకపోవడంతో ప్రభుత్వం స్థలం కేటాయించింది. కానీ భవనమే ఇంతవరకూ లేదు. ఎవరైనా దాతలు సాయం చేస్తే ఆశ్రమం నిలబడుతుంది. పండుటాకులకు ప్రభుత్వం ఆసరా పింఛన్లతో పాటు అంత్యోదయ కార్డుల ద్వారా రేషన్ బియ్యాన్ని అందిస్తున్నది. కానీ చాలా మంది వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. వారికి వైద్యం చేయించే స్థోమత లేదని పిచ్చమ్మ వాపోతున్నది. వైద్య పరంగా సాయంచేస్తే ఆ అభాగ్యులకు మరికొంత జీవితాన్నివ్వొచ్చని పిచ్చమ్మ అంటో ంది. 25 ఏళ్ల నిస్వార్థ సేవలో మంచి పేరు తప్ప ఏమీ సంపాదించుకోలేదు. తనకంటూ ఒక కుటుంబం లేదు.. భర్త లేడు.. పిల్లలు లేరు.. అయిన వాళ్లు, ఆత్మీయులు లేరు. ఉన్నదల్లా నలభై మంది అనాథలు, ఒక రేకుల షెడ్డు. సంతోషమైనా, బాధొచ్చినా తన చుట్టూ వారితోనే పంచుకుంటుంది.

జన్మనిచ్చిన తల్లిదండ్రులను కూడా పట్టించుకోని ప్రస్తుత సమాజంలో.. పిచ్చమ్మ దాతృత్వం యావత్ ప్రపంచానికి ఆదర్శం. తను పడ్డ బాధను మరెవరూ అనుభవించొద్దని నిస్వార్థ సేవా మార్గాన్ని ఎంచుకున్న పిచ్చమ్మ ఎంతో మందికి స్ఫూర్తిదాయకం.

ఆత్మవిశ్వాసంతో గెలుపు సొంతం

పేపర్లు అమ్ముకునే స్థాయి నుంచి ఇంజినీర్‌గా మంచి ఉద్యోగం సాధించిన శివంగి విజయగాథ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది. చదువుకోవడానికి పేదరికం అడ్డుకాదని నిరూపించింది కాన్పూర్‌కు చెందిన శివంగి. నిరుపేద కుటుంబంలో జన్మించింది. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. కుటుంబానికి ఆసరాగా నిలవాలనుకుంది. ఇల్లిల్లూ తిరిగి వార్తాపత్రికలు, మేగజైన్లు వేయడం మొదలుపెట్టింది. ఇంటి ఖర్చులకు పోగా మిగిలినవాటితో పుస్తకాలు నోట్ బుక్కులు కొనుక్కునేది. అలా ఇంటర్ వరకు ప్రభుత్వ కళాశాలలో చదువుకొంది. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవడం నేర్చుకుంది. చదువును మాత్రం ఆపలేదు. ఒకరోజు పేపర్లో పడిన ఓ ప్రకటన ఆమె జీవితాన్నే మార్చేసింది. సూపర్ 30 అనే సంస్థ పేద పిల్లలకు ఐఐటి కోచింగ్ ఇస్తున్నట్లు తెలుసుకుంది. ఐఐటి జేఈఈ ప్రిపరేషన్ అంత సులభం కాదనే విషయం తెలిసినా, కోచింగ్ యాజమాన్యాన్ని కలిసి తన ఆకాంక్షను తెలిపింది. చదువుకోవాలనే ఆమె తపనకు ముచ్చటపడిన సెంటర్ వాళ్లు ఆమెను అనుమతించారు. అంతే కోచింగ్ సెంటర్ య జమాని ఆనంద్ తల్లికి మరింత దగ్గరైంది. ఆమె మంచాన పడితే మానవత్వంతో సేవ చేసింది. మొత్తానికి ఐఐటి రూర్కీలో సీటు సంపాదించింది. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో గెలుపును సొంతం చేసుకుంది. ఇప్పుడు తను మంచి ఉద్యోగంలో స్థిరపడి కుటుంబానికి గర్వకారణంగా నిలిచిన శివంగి అందరికీ ఆదర్శంగా నిలిచింది.




మారిషస్ ప్రభుత్వం నుంచి ఎల్ అండ్ టికి భారీ ఆర్డరు

న్యూఢిల్లీ: దేశీయ ఇంజనీరింగ్ దిగ్గజం లార్సన్ అండ్ టర్బో భారీ ఆర్డర్‌ను దక్కించుకుంది. మారిషస్ ప్రభుత్వం నుంచి రూ.3,375 కోట్ల విలువచేసే భారీ ఆర్డర్ కంపెనీ దక్కించుకుంది. ఆఫ్రికన్ ద్వీప దేశంలో రైలు ఆధారిత పట్టణ రవాణా వ్యవస్థ డిజైన్, నిర్మాణం కోసం మారిషస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోని మెట్రోఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ నుంచి ఈ భారీ ఆఫర్‌ను సొంతం చేసుకుంది. ఈ ప్రాజెక్టు విలువ రూ. 3,375 కోట్లు ఉంటుంది. ఇది తమకు చాలా కీలకమైన ఆర్డర్ అని ఎల్ అండ్ టి ప్రకటించింది. ఈ మెట్రో ప్రాజెక్టు 26 కిలోమీటర్ల మార్గంతో ఉంటుందని, క్యూరీపైప్‌తో పోర్ట్ లూయిస్లోని ఇమ్మిగ్రేషన్ స్క్వేర్ కు అనుసంధానిస్తారని, 19 స్టేషన్లను కలిగి ఉంటుందని సంస్థ తెలిపింది. మారిషస్ ప్రధాన మంత్రి ప్రవీంద్ కుమార్ జుగ్నౌత్ సమక్షంలో జూలై 31 న ఒప్పందంపై సంతకాలు జరిగాయని కంపెనీ ప్రకటించింది. 2017 జూన్ నాటికి రూ.2.63 లక్షల కోట్ల విలువచేసే ఆర్డర్లు కంపెనీ వచ్చాయి. ఎల్ అండ్ టి కంపెనీ తొలి త్రైమాసిక ఫలితాల్లో 46 శాతం వృద్ధిని నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే అత్యంత ఆర్డర్లతో లార్సెన్ అండ్ టర్బో సంస్థ చాలా కంపెనీల కంటే ముందు వరుసలో ఉంది.



వడ్డీరేటు పావు శాతం కోత

- రెపో రేటు 25 బేసిస్ పాయింట్లు తగ్గింపు ● మరింత చౌకగా రుణాలు ● ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్‌బిఐ ప్రకటన

న్యూఢిల్లీ : అందరూ ఊహించినట్టుగానే ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించింది. దీంతో ప్రస్తుతం 6.25 శాతం ఉన్న వడ్డీ రేట్లు ఇప్పుడు 6 శాతానికి తగ్గనున్నాయి. ద్రవ్యోల్బణం ఇప్పటికే అత్యంత కనిష్ఠానికి పడిపోవడంతో ఆర్‌బిఐ వడ్డీ రేట్ల తగ్గింపునకే మొగ్గుచూపింది. బుధవారం మూడో ద్వైమాసిక సమీక్షలో ఆర్‌బిఐ తీసుకున్న నిర్ణయంతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలకు నెలసరి వాయిదాలు తగ్గనున్నాయి. 2016 అక్టోబర్ నుంచి వడ్డీ రేటులో కోత విధించడం ఇదే తొలిసారి.. దీంతో ఆరు ఏళ్ల కనిష్టానికి వడ్డీ రేట్లు పడిపోయాయి. రికార్డు స్థాయి కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం పడిపోయిన నేపథ్యంలో ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలోని ఎంపిసి(ద్రవ్యపరపతి విధాన కమిటీ) రెపో రేటు 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. బ్యాంకులకు రుణాలపై ఆర్‌బిఐ ఇచ్చే వడ్డీరేటునే రెపో రేటు అంటారు. ఇక రివర్స్ రెపో రేటును కూడా పావు శాతం తగ్గించడంతో 5.75 శాతానికి తగ్గుతుంది. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంకు రేట్లపై కూడా కోత విధించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్థిక వృద్ధి అంచనా 7.3 శాతంగా సెంట్రల్ బ్యాంక్ ముందుకు సాగుతోందని ఉర్జిత్ పటేల్ అన్నారు. ఆర్‌బిఐ నిర్ణయంపై ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ స్పందిస్తూ, రెపో రేటు తగ్గింపును ప్రభుత్వం స్వాగతించిందని అన్నారు.



అనుసరించనున్న బ్యాంకులు

25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో బ్యాంకులు వడ్డీ రేట్ల తగ్గింపు దిశగా చర్యలు చేపట్టనున్నాయి. దీంతో బ్యాంక్ ఖాతాదారులకు మరింత చౌకగా రుణం లభించనుందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అన్నారు. ద్రవ్య విధాన కమిటీలో నలుగురు సభ్యులు 25 బేసిస్ పాయింట్లు రెపో రేటును తగ్గించటానికి ఓటు వేయగా, 50 పాయింట్ల కట్ కొరకు ఒక ఓటు పడిందని, రేటును యథాతథంగా ఉంచాలని ఒక ఓటు వచ్చిందని ఆర్‌బిఐ గవర్నర్ తెలిపారు. ద్రవ్యోల్బణం దిగి రావడంతో కేంద్రం బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. తద్వారా బ్యాంకులు కూడా తమ వడ్డీరేట్లను తగ్గించనున్నాయని ఉర్జిత్ పటేల్ చెప్పారు. ఆర్‌బిఐ తదుపరి సమీక్ష అక్టోబర్ 3 – 4న జరుగనుంది.



ఆర్‌బిఐ రెపో రేటును 25 బేసి పాయింట్లు తగ్గించడం స్వాగతించదగినది. దేశీయ స్థిరమైన వృద్ధి కోసం వాస్తవ ద్రవ్య పరిస్థితుల దిశగా ఈ నిర్ణయం దోహదం చేస్తుంది.

– ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్



ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సెంట్రల్ బ్యాంక్ నిర్ణయం తీసుకుంది, ఇది అంతర్జాతీయ ఇన్వెస్టర్లలో విశ్వాసం నింపనుంది. ఉన్నతస్థాయి కమిటీ క్రెడిట్ మార్కెట్ నుంచి సమాచారం సేకరించడం పారదర్శకతకు దోహదం చేసింది.

– ఐసిఐసిఐ బ్యాంక్ సిఎండి చందా కొచ్చర్



ఇది ఈక్విటీ అలాగే బాండ్ మార్కెట్లకు సానుకూలమైంది. ప్రత్యేకించి వ్యవస్థలో పుష్కలమైన ద్రవ్యలభ్యతను మనం చూస్తున్నాం.

– యాక్సిస్ బ్యాంక్ ఇడి రాజీవ్ ఆనంద్

ఆర్‌బిఐ సమీక్ష ముఖ్యాంశాలు


- కీలక వడ్డీ రేటు 0.25 శాతం తగ్గింపుతో 6 శాతానికి చేరుతుంది.
- రివర్స్ రెపో రేటును 0.25 శాతం తగ్గించగా, ఇది 5.75 శాతానికి దిగివస్తుంది.
- 4 శాతానికి దగ్గరగా ద్రవ్యోల్బణం చేరడంపై దృష్టిని కేంద్రీకరించిన ఆర్‌బిఐ.
- ద్రవ్యోల్బణ సమస్యలు కొన్ని తగ్గుముఖం పట్టాయి, ఫలవంతం కావాల్సి ఉంది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు అంచనా 7.3 శాతంలో ఎలాంటి మార్పు చేయలేదు.
- ప్రైవేటు పెట్టబడులకు మరింత ప్రోత్సహం, మౌలికసదుపాయ అడ్డంకులు తొలగింపు, ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు మరింతగా నిధులు
- జులై 28 నాటికి విదేశీ మారక నిల్వలు 392.9 బిలియన్ డాలర్లకు చేరాయి.
- ద్రవ్యపరపతి పాలసీ కమిటీ నలుగురు సభ్యులు 0.25 శాతం తగ్గింపునకు అనుకూలంగా ఓటు
- రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ రుణాల మాఫీతో ఆర్థిక సంక్షోభానికి దారితీయవచ్చు, ప్రజా వ్యయ నాణ్యత తగ్గొచ్చు.
- బ్యాంకుల్లో భారీగా పేరుకుపోయిన ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) సమస్య పరిష్కారానికి ప్రభుత్వం, ఆర్‌బిఐ పనిచేస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మూలధనం అందివ్వడం.
- మొండి బకాయిలతో కొత్త పెట్టుబడులు తగ్గే అవకాశముంది.
- వచ్చే ఎంపిసి సమావేశం అక్టోబర్ 3, 4 తేదీలలో జరగనుంది.



మార్కెట్‌ను నిరాశపర్చింది..

ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లను తగ్గించిన నేపథ్యంలో స్టాక్‌మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. బుధవారం ప్రారంభం నుంచి మార్కెట్ సూచీలు ఊగిసలాటల మధ్య కొనసాగాయి. ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లలో 0.25 శాతం తగ్గింపును ప్రకటించడంతో మార్కెట్లలో నష్టాలు పెరిగాయి. సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. సమీక్ష నేపథ్యంలో మదుపర్లు ఆచితూచి వ్యవహరించడంతో దేశీయ మా ర్కెట్లు నష్టాలను చవిచూశారు. ఒకదశలో సెన్సెక్స్ 100 పాయిం ట్లు క్షీణించగా, మరోవైపు నిఫ్టీ 31 పాయింట్ల నష్టంతో 10,083 స్థాయికి మళ్లాయి. అనంతరం పుంజుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ కూడా నష్టాలను తగ్గించుకుంది. అయితే మార్కెట్ పటిష్ఠంగానే ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ద్రవ్య విధాన సమీక్షలో అత్యధిక శాతం మంది ఆర్థికవేత్తలు అంచనా వేసినట్టుగా రిజర్వ్ బ్యాంక్ బుధవారం ప్రకటించిన పాలసీ రివ్యూలో కీలక వడ్డీ రేట్లలో పావు శాతం చొప్పున కోత పెట్టింది. రెపో రేటులో 25 బేసి స్ పాయింట్లు కోత పెట్టడంతో ప్రస్తుత రేటు 6 శాతానికి చేరింది. అలాగే ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేటు 6.5 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గింది. సెన్సెక్స్ చివరకు 98 పాయింట్ల నష్టానికి 32,477 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ 33 పాయింట్లు నష్టపోయి 10,081 వద్ద స్థిరపడింది. ఎన్‌టిపిసి, అంబుజా సిమెంట్, ఎసిసి లిమిటెడ్, హీరో మోటా కార్ప్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. డాక్టర్ రెడ్డీస్, ఇండియా బుల్స్ హౌసింగ్ ఫైనాన్స్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, టాటామోటార్స్, ఓఎన్‌జిసి షేర్లు నష్టాలను నమోదు చేశాయి.

2015 సంవత్సరం నుంచి వడ్డీ రేట్ల తగ్గింపు సూచీ





వచ్చే నెలల్లో మరికొంత 50-75 బేసిస్ పాయింట్లు వడ్డీ రేటు కోత ఉంటుందనే అంచనాకు ఇది బలం చేకూరుస్తుంది. బ్యాలెన్స్ షీట్ సమస్య, వృద్ధి పుంజుకోవడం రెండింటి సమన్వయం కోసం ఆర్‌బిఐ ప్రయత్నం చేస్తోంది.

– యస్ బ్యాంక్ సిఎండి రాణా కపూర్



మోటరోలా నుంచి ఎస్ సిరీస్ ఫోన్లు

న్యూఢిల్లీ: మోటరోలా మరో రెండు కొత్త మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేసింది. 'మోటో జి5 ఎస్' 'మోటో జీ5 ఎస్ ప్లస్' పేరుతో విడుదల చేసిన ఈ మొబైల్స్ గ్రే, బంగారు రంగుల్లో అందుబాటులోకి రానున్నాయి. తొలుత అమెరికా మార్కెట్లో విడుదల చేసిన ఈ ఫోన్లను ఈ నెలాఖరు నాటికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ వెల్లడించింది. మోటో జి5 ఎస్ ధర 259 యూరోలు రూ.18,900) కాగా మోటో జి5ఎస్ ప్లస్ రూ.22,700గా ఉంది.

1.3 మిలియన్ మైలురాయిని దాటిన హుందయ్

న్యూఢిల్లీ : దేశీయ రెండో అతిపెద్ద కారు తయారీ దిగ్గజం హుందయ్ సేల్స్ రికార్డును నెలకొల్పింది. కార్ల విక్రయాల్లో సంస్థ 1.3 మిలియన్ల మైలురాయిని చేరుకుంది. గ్రాండ్ ఐ10, ఎలైట్ ఐ20, క్రెటా కార్లు దేశీయంగా భారీ స్థాయిలో అమ్మకాలు జరిగాయి. ఇవి దాదాపు 1.01 మిలియన్ యూనిట్ల సేల్స్ ఉన్నాయి. ఎగుమతులు 0.29 మిలియన్ యూనిట్లు, 1.3 మిలియన్ యూనిట్లు క్యూములేటివ్ సేల్స్ ఉన్నాయి. హుందయ్ సూపర్ పర్‌ఫార్మర్ బ్రాండ్‌ను దక్కించుకుంది.

ఫెరారీ నుంచి రెండు కొత్త కార్లు

న్యూఢిల్లీ: ఇటాలియన్ వాహన తయారీ సంస్థ ఫెరారీ దేశీయ మార్కెట్లోకి రెండు కొత్త కార్లను విడుదల చేసింది. లగ్జరీ కార్ సెగ్మెంట్ లో ఫెరారీ జిటిసి4లుస్సో జిటిసి4 లుస్సో టీ పేరుతో రెండు మోడళ్లను ప్రవేశపెట్టింది. లుస్సో ఇటాలియన్ పదానికి అర్థం లగ్జరీ కావున లూసో పేరుతో ఈ సరికొత్త కార్లను విడుదల చేసినట్లు ఫెరారీ ప్రకటించింది. ఇజిటిసి 4లుస్సో ధర రూ. 5.20కోట్లు(ఎక్స్ షోరూం), కొంచెం తక్కువ ధరలో జిటిసి4 లుస్సో టి ధర రూ. 4.20కోట్లు(ఎక్స్ షోరూం)గా నిర్ణయించింది.




స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	32476.74	98.43	0.30%
నిఫ్టీ	10081.50	33.15	0.33%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27270	29165.78	0.33%
ముంబై	28120	30074.87	0.11%
ఢిల్లీ	27700	29625.67	0.18%
కోల్‌కతా	28110	30064.17	0%
కేరళ	26700	28556.15	0.37%
బెంగళూరు	26800	28663.10	0.26%
హైదరాబాద్	27350	29251.34	0.22%
గల్ఫ్	1346.4	1440.00	0.03%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	41700.00	41500.00	0.48
ముంబై	41700.00	41500.00	0.48
ఢిల్లీ	41700.00	41500.00	0.48
కోల్‌కత్తా	41700.00	41500.00	0.48
హైదరాబాద్	41700.00	41500.00	0.48



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	310	విశాఖపట్నం	318
వరంగల్	312	చిత్తూరు	365
విజయవాడ	308	చెన్నై	372
గోదావరి	308	బెంగళూరు	360

ఇండిగో ఆఫర్: రూ.1,111 ధరకే టికెట్



న్యూఢిల్లీ: బడ్జెట్ విమానయాన సంస్థ ఇండిగో 11వ వార్షికోత్సవం సందర్భంగా టికెట్లపై తగ్గింపు ధరలను ప్రకటించింది. రూ.1,111 ప్రారంభ చార్జీతో ఐదు రోజుల ప్రత్యేక సేల్ ఆఫర్ ఇస్తోంది. ఆగస్టు 2 నుంచి 6వ తేదీవరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఈ ఆఫర్ కింద టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులు ఆగస్టు 21వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 24 మధ్య ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అన్ని పన్నులతో కలిపి టిక్కెట్లను విక్రయించనున్నట్టు ఇండిగో వెల్లడించింది. తాజా ఆఫర్‌ను కొన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలకు కూడా వర్తింపచేసింది. దేశంలో మొత్తం 45 ప్రాంతాలకు ఈ ఆఫర్‌ను వర్తింపజేయగా, మొబీక్విక్ వ్యాలెట్ ద్వారా టిక్కెట్ బుక్ చేసుకున్నట్టయితే మరో 11 శాతం ఆఫర్ ఇస్తోంది. ఇండిగో మొబైల్ యాప్‌తో బుక్ చేసుకుంటే 11 శాతం సూపర్‌క్యాష్ బ్యాక్ ఆఫర్ అందిస్తోంది. అన్ని బుకింగ్ ఛానెళ్లలోనూ ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందనీ, అయితే నాన్ స్టాప్ విమానాలకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుందని కంపెనీ తెలిపింది. ఈ పథకం కింద శ్రీనగర్ నుంటి ఢిల్లీకి రూ.1,611, ఢిల్లీ నుంచి ఉదయ్‌పూర్‌కు రూ.1,411, ఢిల్లీ నుంచి ముంబయికి రూ.1,911, ముంబయి నుంచి మస్కట్‌కు రూ.5,711, ముంబయి నుంచి దోహకు రూ.7,011గా ఉన్నాయి. మొదటి బుకింగ్ చేసుకున్న ప్రాధాన్యతనివ్వనున్నామని కంపెనీ వెల్లడించింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, కోల్‌కత్తా లాంటి మెట్రో నగరాలతోపాటు చిన్న నగరాలు భువనేశ్వర్, చండీగఢ్, పుణె, అహ్మదాబాద్‌లు ఇండిగో విమానాల జాబితాలో ఉన్నాయి. షార్జా, సింగపూర్, మస్కట్, దుబాయ్, దోహా, పోర్ట్‌బ్లెయిర్ వంటి అంతర్జాతీయ విమానాశ్రయాలకు ఇండిగో తాజా పథకం కూడా వెల్తుంది.

మార్కెట్‌లోకి కొత్త నార్డ్ వాహనం

మన తెలంగాణ/ హైదరాబాద్ : డ్రైవ్ సిస్టమ్ లిమిటెడ్ వారి ఉత్పత్తి చేసిన ఎక్స్‌ట్రా మైల్ సర్వీస్ వాహనం కస్టమర్లకు అందించే లక్ష్యంతో వాహనాన్ని అందుబాటులోకి తెచ్చింది. బుధవారం నగరంలోని తాజ్ దక్కన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎఆర్. సుకుమార్, తెలంగాణ ఐటి శాఖ కార్యదర్శి జయేష్‌రంజన్, గ్లోబల్ ఎండి ఉల్‌రిచ్ కుచేన్ మిస్టర్‌లు ఈ వాహనాన్ని ప్రారంభించారు. నార్డ్ డేవి సిస్టమ్స్ ముతు సెక్కర్, నార్డ్ జీఎం అమిత్ మాట్లాడుతూ నార్డ్ కొత్తగా ప్రారంభించిన వ్యాన్ అత్యవసర పునఃరుద్ధరణ, ప్రత్యేక సేవల కోసం అందించే లక్ష్యంతో ఈ వాహనాన్ని ప్రారంభించామన్నారు. నార్డ్ ప్రపంచ వ్యాప్తంగా అందించే ఉత్పత్తులు ప్రస్తుతం భారతీయ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం నార్డ్ ఇండియా నుంచి 90 శాతం సర్వీస్ పునర్మించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఉక్కు నుంచి సిమెంట్ వరకు, ఆహార పానియాల నుంచి వస్త్రాల వరకు వివిధ పరిశ్రమల నుంచి నార్డ్ ఉత్పత్తుల నాణ్యతపై సేవ చేయడానికి పోటీ పడుతుందన్నారు. నాణ్యమైన యంత్రాలతో నార్డ్ ఉత్పత్తులను అందుబాటులోకి తెలుస్తుందని తెలిపారు. సరసమైన ధరలకుఅందిస్తూ పనితీరు ఆధారితంగా ఎక్స్‌ట్రా మైల్ సర్వీస్ సేవలు అందిస్తుందన్నారు.



పిఎన్‌బి లాభం 12 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ బుధవారం ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో 12 శాతం నికర లాభ వృద్ధిని నమోదు చేసింది. జూన్ 30 ముగింపునాటి క్యూ1(ఏప్రిల్..జూన్)) ఫలితాల్లో లాభం రూ.343.40 కోట్లు నమోదైంది. గత ఏడాది ఇదే సమయంలో బ్యాంక్ లాభం రూ.306.36 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం రూ.3855.13 కోట్లతో 4.22 శాతం వృద్ధిని నమోదు చేసింది. గతేడాది రూ.3,698.97క కోట్లు నమోదైంది. స్టాక్‌మార్కెట్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేరు 1.52 శాతం పెరిగి రూ.159.90 వద్ద ట్రేడ్ అయింది. ఆఖరికి 0.22 శాతం లాభపడి రూ.157.85 వద్ద ముగిసింది. ఆస్తుల నాణ్యత స్థిరంగా కొనసాగుతోంది. బ్యాంక్ స్థూల ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) 12.53 శాతం నుంచి 13.66 శాతానికి పెరిగాయి. త్రైమాసికం – త్రైమాసికం ఆధారంగా చూస్తే నికర ఎన్‌పిఎ 7.81 శాతం నుంచి 8.67 శాతానికి పెరిగింది. కేటాయింపులు రూ.5753.51 కోట్ల నుంచి రూ.2,608.71 కోట్లతో 54.66 శాతం తగ్గుముఖం పట్టాయి.



లుపిన్ లాభం 50 శాతం క్షీణత



తొలి త్రైమాసిక ఫలితాల్లో దేశీయ ఫార్మా దిగ్గజం లుపిన్ లాభాలు భారీగా క్షీణించాయి. రూ.358.కోట్లు నికరలాభాన్ని మాత్రమే సాధించి.. విశ్లేషకుల అంచనాలను కంపెనీ అందుకోలేకపోయింది. ఆదాయం 13.4శాతం క్షీణించి రూ. 3869 కోట్లుగా నమోదవగా, ఎబిటా మార్జిన్లు 19.8 శాతంగా నిలిచాయి. మరోవైపు లుపిన్ తయారీ లైడెక్స్ ఆయింట్‌మెంట్ జనరిక్ వెర్షన్‌కు అమెరికా ఎఫ్‌డిఎ అనుమతి లభించడంతో ఈ కౌంటర్ లాభాల్లో ట్రేడ్ అవుతోంది. అమెరికా మార్కెట్లలో ఫ్లోసినోనైడ్ టాపికల్ ఆయింట్‌మెంట్ విక్రయానికి అమెరికా ఎఫ్‌డిఎ నుంచి అనుమతి లభించినట్లు కంపెనీ పేర్కొంది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆశించిన మేరకు లాభాలను కంపెనీ పొందలేదు.

పోలీసుల పహారాలో ఎక్కువ రోజులు రాష్ట్రాన్ని నడపలేరు : రేవంత్‌రెడ్డి




మన తెలంగాణ/శంషాబాద్ : ముఖ్యమంత్రి కెసిఆర్ పోలీసుల పహారా మధ్య ఎక్కువ రోజులు రాష్ట్రాన్ని నడపలేరని టిడిఎల్‌పి నేత రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ హార్టికల్చర్ విశ్వవిద్యాలయంలో పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు చేస్తున్న నిరాహారదీక్షకు సంఘీభావం తెలపడానికి వెళ్లిన ఆయనను అరెస్టేచేసి శంషాబాద్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువత, విద్యార్థులు, రైతులు నిరాహారదీక్షలు చేస్తుంటే అక్రమ అరెస్టులు చేయిస్తుందని ఆరోపించారు. హార్టికల్చర్ విశ్వవిద్యాలయంలో 30 రోజుల నుంచి తమకు ఉద్యోగాలు ఇవ్వండంటూ ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నారు. వారికి టిడిపి తరపున సంఘీభావం తెలపడానికి వస్తున్నట్లు తెలవడంతో ఆడపిల్లల హాస్టల్‌లోకి సైతం అర్ధరాత్రి పోలీసులు వెళ్లి అక్రమ అరెస్టులుచేసి వారిని వివిధ పోలీసుస్టేషన్లకు తరలించినట్లు తెలిపారు. ఇప్పటికి ఏ పోలీసుస్టేషన్‌లో ఏ విద్యార్థి ఉన్నారో ఆచూకీలేదన్నారు. వారేమైనా రౌడీలా, స్మగ్లర్లా, మాదకద్రవ్యాలు అమ్మే వారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. డిప్లొమాలో చేరిన విద్యార్థులు 16సంవత్సరాల నుంచి ఉద్యోగం కోసం పోరాటం చేస్తుంటే రాత్రికి రాత్రే పోలీసులతో దాడిచేయిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సామ భూపాల్ రెడ్డి, బుక్క వేణు గోపాల్, గణేష్‌గుప్త, జ్ఞానేశ్వర్, రాజిరెడ్డి, సుభాష్‌గౌడ్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

కాలుజారి కాల్వలో పడి రైతు మృతి


పరామర్శిస్తున్న ఎంఎల్ఎ డా.జి.చిన్నారెడ్డి

మన తెలంగాణ/పెబ్బేరు : మహబూబ్‌నగర్ జిల్లా మండల పరిధిలోని తోమాల పల్లి గ్రామానికి చెందిన ముస్టి నాగేంద్రం ప్రమాదవశాత్తు కాలు జారి కాల్వలో పడి మృతి చెందాడు. బుధవారం ఉదయం పొలం వద్దకు నీళ్లు పారబెట్టేందుకు వెళ్లాడు. పొలం సమీపంలోని కాల్వ వద్ద కాలు జారి కాల్వలో పడిపోవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేంద్రానికి భార్యతో పాటు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఎంఎల్‌ఏ చిన్నారెడ్డి నాగేంద్రం కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు సర్పంచ్ సురగౌని అలివేల సురేందర్ గౌడ్ , ఎంపిటిసి మన్నెం, మాజీ సర్పంచ్ పద్మ వీరస్వామి, తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



మన తెలంగాణ/చిగురుమామిడి: కోళ్ల ఫాం నిర్మాణం కోసం ఇటుకలు తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తగిలి యువ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని రామంచ గ్రామ పరిధి నర్సింహులపల్లెలో బుధవారం తీవ్ర విషాదాన్ని నింపింది. రామంచ గ్రామా పరిధిలోని నర్సింహుల పల్లెకు చెందిన గాజ అనిల్ (26) సిఎ చదివి, గ్రామంలో పొలం పనులు చూసుకుంటున్నాడు. కోళ్ల ఫాం నిర్మాణం కోసం ఇటుకల తయారీకి సన్నద్ధమవుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి అక్కడికి అక్కడే మృతవాత పడ్డాడు. తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు చిగురుమామిడి ఎస్సై తనుగుల సత్యనారాయణ తెలిపారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్య

మన తెలంగాణ/చిన్నకోడూరు : కన్నబిడ్డలు కాదన్నారు. రోజు గడవడమే భారంగా మారింది. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు... ఆ వృద్ధ దంపతులు ఇక మరణమే శరణ్యమనుకున్నారు. చివరకు కుంకుడు కాయల రసం తాగి ఆత్మహత్య చేసు కున్నారు. మండల కేంద్రమైన చిన్న కోడూరుకు చెందిన కోనేటి వెంకటేశం(75), భార్య కోనేటి ఐలవ్వ(70) లకు నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు వున్నారు. కొడు కుల్లో ఒకరు చనిపోగా మిగిలిన ముగ్గురు కొడుకులు గ్రామంలోనే వేరు కాపురాలు పెట్టా రు. కొడుకులు సాకడానికి ఆసక్తి చూపక పోవడంతో వృద్ధాప్య పెన్షన్‌తో పాటు శక్తి మేరకు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంత కాలం క్రితం ఐలవ్వ పక్షవాతానికి గురవడంతో ఆమెకు వైద్య చికిత్సల కోసం ఉన్న డబ్బులు ఖర్చయ్యాయి. అయినా ఆమె ఆరోగ్యం మెరుగు పడక పోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో జీవితంపై విరక్తి చెందిన చివరకు ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని మంగళవారం రాత్రి ఇంట్లో కుంకుడు కాయల రసం సేవించారు. దీన్ని గమనించిన ఇరుగు పొరుగు వారు వెంటనే సిద్దిపేట జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మర ణించారు. బుధ వారం వారి శవాలను ఇంటికి తీసుకురాగానే కుమార్తెలు ఇద్దరు సోదరు లపై ఫిర్యాదు చేయడంతో చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లిని హతమార్చిన కొడుకు


మనతెలంగాణ/కరీంనగర్‌క్రైం : తల్లిని హతమార్చిన కొడుకు ఉదంతం ఇది... నగరంలోని కోతిరాంపూర్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగిన సంఘటన వివరాలు కరీంనగర్ వన్‌టౌన్ సిఐ తుల శ్రీనివాసరావు కథనం మేరకు ఈ విధంగా ఉన్నాయి. కోతిరాంపూర్‌కు చెందిన మొగిలి పోచమ్మ (60) అనే వృద్ధురాలు రోడ్డు పై పడిఉన్న చిత్తుకాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు సేకరిస్తూ వాటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తోంది. పోచమ్మకు మొగిలి ఎల్లయ్య అనే కుమారుడు ఉన్నాడు. తాగుడుకు బానిసైన అతడిని భార్య వదిలేసి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో మద్యం సేవించేందుకు డబ్బులు కావాలంటూ ఎల్లయ్య తన తల్లి పోచమ్మను ఒత్తిడి చేశాడు. వాగ్వాదంతో ఆవేశానికి గురైన ఎల్లయ్య తల్లిని హత్య చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు కరీంనగర్ వన్‌టౌన్ ఎస్‌ఐ తుల శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఏడుగురికి గాయాలు, హైదరాబాద్ -శ్రీశైలం ప్రధాన రహదారిపై ఘటన

మన తెలంగాణ/కందుకూర్/కడ్తాల్: హైదరాబాద్ శ్రీశైలం ప్రధాన రహదారిపై కందుకూర్ మండలం దెబ్బడగూడ గేట్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కందుకూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన కృష్ణారెడ్డి తన మిత్రుడు వెల్దండ మండలం పెద్దాపూర్‌కి చెందిన పర్వత్‌రెడ్డితో కలిసి స్విఫ్ట్ కారులో హైదరాబాద్ నుంచి కల్వకుర్తికి వస్తుండగా క్రూయిజర్ వాహనం ఢీ కొట్టింది. కృష్ణారెడ్డి అక్కడిక్కక్కడే మృతిచెందగా స్విఫ్ట్‌లో ఉన్న పర్వత్‌రెడ్డితోపాటు క్రూయిజర్ వాహనంలో ప్రయాణిస్తున్న రాంచందర్ (కడ్తాల్), కరీమా(అచ్చంపేట్), కిషన్(తలకొండపల్లి), శ్రీశైలం (కల్వకుర్తి మండలం తర్నికల్), కిషన్ (వెల్దండ మండలం పల్గు తండా), అందె రవిలకు గాయాలయ్యాయి. గాయపడ్డవారిని హైదరాబాద్ తరలిం చారు. కందుకూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసులపై అట్రాసిటీ కేసులు పెట్టాలి



మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్ : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండడం నేరెళ్ల గ్రామంలో దళితులపై దాడులకు పాల్పడుతున్న పోలీసు ఎస్పీ, సిఐ, ఎస్‌ఐలతో పాటు ఇసుక మాఫియా ముఠాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని తెలంగాణ దళిత ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్ కవాడిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ దళిత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కోక నర్సింహా, కార్యదర్శులు గండి కృష్ణ, పరిమల్‌కుమార్‌లతో కలిసి రాష్ట్ర అధ్యక్షులు ఇటిక్యాల లింగం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో దళితులపై రోజు రోజుకు దాడులు పెరుగుతున్నాయన్నారు. నేరెళ్ల గ్రామంలో ఈ మధ్యన ఇసుక లారీ ఢీకొట్టడంతో వ్యక్తి చనిపోయాడని, దానికి గ్రామస్తులు భావోద్వేగానికి గురై ఆ లారీకి నిప్పుపెట్టారన్నారు. అయితే లారీ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి చనిపోయినప్పుడు స్పందించని పోలీసులు, ప్రభుత్వం లారీకి నిప్పుపెట్టడంతో వచ్చి దళిత యువకులను అరెస్టు చేసి చిత్ర హింసలు పెడుతున్నారని మండి పడ్డారు. బాధితులపై అన్యాయంగా నమోదు చేసిన 307 కేసును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. నేరెళ్ల ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని అక్కడి కలెక్టర్‌ను కోరారు.

కొలువుకు వెళ్లి..మాల్దీవుల్లో బందీలై..

- నానా అవస్థలు పడుతున్న హైదరాబాద్ విద్యార్థులు
- విదేశీ ఉద్యోగాలంటూ మోసం చేసిన కాలేజీ యాజమాన్యం
- రూ.1.5 కోట్లు వసూలు చేసి చేతులు దులుపుకున్న ప్రిన్సిపాల్



కాలేజ్ ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు – దాడిలో ధ్వంసమైన కాలేజీ ఫర్నీచర్

మన తెలంగాణ/హైదరాబాద్/మాదన్నపేట్ : కొలువు కోసం కాసులు ఖర్చు పెట్టి మాల్దీవులకు వెళ్లిన హైదరాబాద్ విద్యార్థులు అక్కడ ఓ హోటల్‌లో బందీలుగా మారారు. కోర్సు పూర్తి కాగానే విదేశాల్లో ఉద్యోగం కల్పిస్తామని కోట్లు వసూలు చేసిన ఓ హోటల్ మేనేజ్ మెంట్ కాలేజీ వారిని మాల్దీవులకు పంపి చేతులుదులుపుకుంది. యాజమాన్యం మాటలు నమ్మి లక్షలు ఖర్చు పెట్టిన వెళ్లిన 30 మంది విద్యార్థుల్లో పది మంది నానా కష్టాలు పడి హైదరాబాద్ తిరిగొచ్చారు. మరో 20 మంది మాల్దీవుల్లోని ఓ హోటల్‌లో బందీలుగా కాలం గడుపుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లి దండ్రులు బుధవారం కాలేజీ ముందు ఆందోళనకు దిగారు. తమ పిల్లలను వెంటనే హైదరాబాద్‌కు రప్పించాలని, కాలేజీ ప్రిన్సిపల్‌పై కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.

మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దిల్‌సుఖ్ నగర్‌లో ఆర్యన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ మూడు సంవత్సరాల క్రితం ఏర్పాటైంది. కోర్సు పూర్తికాగానే విదేశాల్లో ఉద్యోగంతో పాటు మంచి జీతం ఉంటుందని కాలేజీ యాజమాన్యం ప్రకటనలు గుప్పించింది. దీంతో కొందరు విద్యార్థులు కాలేజీలో అడ్మిషన్‌లు తీసుకున్నారు. కొద్ది రోజులు తరువాత కోర్సు పూర్తయిన 30 మంది విద్యార్థులకు మాల్దీవుల్లోని ఫైవ్ స్టార్ హోటల్‌లో ఉద్యోగాలున్నాయని ప్రిన్సి పాల్ నారాయణరెడ్డి వారికి చెప్పారు. ఒక్కొక్కరికీ రూ.లక్షల్లో జీతంతో పాటు ఉచిత వసతి, భోజనమంటూ నమ్మబలికాడు. ఒక్కొక్క విద్యార్థి నుంచి మాల్దీవులకు వెళ్లడానికి వర్కింగ్ వీసా కోసం రూ.4.25 లక్షలు వసూలు చేశాడు. జూన్ 23న వారిని మాల్దీవులకు పంపారు. కొందరు వ్యక్తులు అక్కడ ఓ హోటల్‌లో 30 మంది విద్యార్థులను బస చేయించి పరారయ్యారు. దీంతో ఆ హోటల్ యాజమాన్యం డబ్బులు కట్టే వరకు వెళ్లనీయమని విద్యార్థులను గదిలో బంధించింది. తిండిలేక నానా అవస్థలు పడుతున్న 10 మంది విద్యార్థులు వారి వద్ద ఉన్న డబ్బుతో హైదరాబాద్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కాలేజీ ముందు ప్రిన్సిపాల్‌ని అరెస్ట్‌చేయాలని ధర్నా నిర్వహించారు. అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం చేశారు.

న్యాయం జరిగేలా చూస్తా

బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని మూసరాంబాగ్ కార్పొరేటర్ తీగల సునరితరెడ్డి తెలిపారు. విద్యార్థులను తిరిగి ఇండియాకు తీసుకువచ్చే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డిపై మలక్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, పోలీసులు అతని వెంటనే పట్టుకొని కేసు నమోదు చేసి జైలుకి పంపాలని కోరారు.

సేంద్రియ ధృవీకరణకు ఓకే !

త్వరలో అనుమతులు మంజూరు చేయనున్న అపెడా

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో సేంద్రియ సాగుకు ప్రోత్సహించే దిశగా చర్యలు మొదలయ్యాయి. సేంద్రియ ధృవీకరణకై వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి అథారిటీ (అపెడా) ఇచ్చే అనుమతి నిమిత్తమై ముగ్గురు సభ్యుల బృంతం బుధవారం తెలంగాణ విత్తన, సేంద్రియ ధృవీకరణ సంస్థ కార్యాలయాన్ని సందర్శించింది. వ్యవసాయ కార్యదర్శి పార్థసారధి, ధృవీకరణ సంస్థ సంచాలకులు కేశవులు వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సేంద్రియ ధృవీకరణపై చర్చించారు. రాష్ట్రంలో ఇప్పటికే సేంద్రియ రైతులు, ఉత్పత్తి తయారీదారుల నుంచి మంచి స్పందన వస్తోందని అపెడా సభ్యులకు వివరించారు. రాష్ట్రంలో సేంద్రియ సాగు 600 ఎకరాలకు పైగా నమోదు చేసినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి మంచి స్పందన వస్తోందని, అపెడా గుర్తింపు త్వరగా ఇవ్వాలని కోరారు. అపెడా గుర్తింపు యూరోపియన్ యూనియన్‌కు సమానం. దీంతో ఐరోపా తదితర దేశాలకు ఎగుమతులు చేసుకోవచ్చు. దీంతో దేశంలో ఎక్కడైనా పండించే, తయారు చేసే సేంద్రియ ఉత్పత్తులను ధృవీకరించే అధికారం ఉంటుంది.ఉ

ఇక్ఫాయ్ వర్సిటీకి గంజాయి రవాణా

ఆటో, 600 గ్రాముల గంజాయి స్వాధీనం

మన తెలంగాణ/శంకర్‌పల్లి : శంకర్‌పల్లి మండలంలో దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ యూనివర్సిటీలో బేకరీ వస్తువులు తీసుకెళ్ళే ఆటోలో సుమారు 600గ్రాముల గంజాయి సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు చేస్తుండగా బుధవారం పట్టుబడింది. దీంతో కళాశాల సెక్యూరిటీ సిబ్బంది శంకర్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే శంకర్‌పల్లి ఎస్‌ఐ క్రాంతి కుమార్ పోలీస్ సిబ్బందితో వెళ్ళి ఆటోలోని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో గంజాయి తరలిస్తున్నారని ముందుగానే కళాశాల సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం రావడంతో తనిఖీ చేయగా అందులో గంజాయి దొరికింది. ఎవరైనా కావాలనే ఆటోలో ఉంచారా లేక ఆటో సిబ్బందే సరఫరా చేస్తున్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని సమాచారం. సంపన్నవర్గాల పిల్లలు ఇక్ఫాయ్ యూనివర్సిటీలో చదువుకుంటున్నారు. అందులో కొందరు డ్రగ్స్‌కు బానిసైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆధునిక పేరుతో ఇక్కడ విద్యార్థులు పాశ్చాత్య పోకడలతో గ్రామ ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పోలీసులను వివరణ కోరగా గంజాయి తరలింపుపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గురువయ్య, ఎస్‌ఐ క్రాంతికుమార్‌లు తెలిపారు.

ఆత్మహత్యలొద్దు, పోరాడదాం


రంగాపూర్ వద్ద పాదయాత్రలో తెలంగాణ రైతు సంక్షేమ సమితి అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, తదితరులు

మన తెలంగాణ/మంచాల: రైతన్నలు ఆత్మహత్యలు చేసుకోవద్దని, ప్రభుత్వాలపై పోరాటం చేయాలని తెలంగాణ రైతు సంక్షేమ సమితి అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. బుధవారం అప్పుల బాధతో ఆత్మ హత్య చేసుకున్న రైతు దంపతులు పెండ్యాల సరిత, మోహనాచారి సొంత గ్రామమైన రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధిలోని రంగాపూర్ నుంచి జాపాల, మంచాల, నోముల మీదుగా ఇబ్రహీంపట్నం వరకు 18కిలో మీటర్ల మేర ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర చేపట్టారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి జాతీయ జెండాను ఊపి పాద యాత్రను ప్రారంభించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, అరుణోదయ కళామండలి అధ్యక్షురాలు విమలక్కతో పాటు వివిధ పార్టీల నాయకులు యాత్రకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లా డుతూ ఎన్నో మార్లు ప్రభుత్వానికి విన్నవించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. చివరికి 52 మంది రైతుల బాధిత కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయాన్ని తామే స్వయంగా అందచేశామని అన్నారు. రైతుల ఆత్మ హత్యలలో దేశంలో మహారాష్ట్ర రెండో స్థానంలో ఉంటే ఎన్నో ప్రాణ త్యాగాలు చేసి ఎంతోమంది అమరులుగా మారి సాధించుకున్న తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చాడ వెంకటరెడ్డి విమర్శించారు. ఇప్పటికి తెలంగాణాలో 5లక్షల మంది రైతులు ఆత్మ హత్యలు చేసుకున్నారని అన్నారు. కొంతమంది రైతు లకు కంటితుడుపు ఆర్థిక సాయం చేసి ప్రభుత్వం చేతు లు దులుపు కుందన్నారు. తెలంగాణాలో రైతన్నలను ఓ పక్క కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పండించిన పంట లకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అటు బ్యాం కులు అప్పులు ఇవ్వక వడ్డీ వ్యాపారులను ఆశ్ర యించి వారి వేధిం పులతో రైతన్నలు ఆత్మహత్య లు చేసుకుంటున్నా రన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించా లంటే ప్రభుత్వం మార్కెట్‌లో దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేయా లని, రైతు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. నిరం తరం రైతుల సమస్యల పై పోరాటానికి కలిసి వచ్చే పార్టీలతో కలిసి పోతామని రమణ అన్నారు. వచ్చే ఎన్నికలలో కలిసొచ్చే పార్టీలతో ముందు కుపోతామని అన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు తూళ్ల వీరేందర్ గౌడ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి చిలుక మధు, టిడిపి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, జిల్లా నాయకులు బీంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, సుభాష్ యాదవ్, సిపిఐ నాయ కులు కావలి నర్సింహ, మండల కార్యదర్శి నర్ల శ్రీశైలం పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటుపడే కిడ్నాప్ డ్రామా

చేవెళ్లలో దొరికిన ఉదయ్‌కుమార్ - మున్సిఫ్ కోర్టులో హాజరు పర్చిన పోలీసులు

మన తెలంగాణ/చేవెళ్ల : జల్సాలకు అలవాటు పడిన విద్యార్థే... డబ్బుల కోసం కిడ్నాపర్‌గా అవతారమెత్తాడు. గత నెల 31 న చేవెళ్లలో విద్యార్థి కిడ్నాప్ కలకలం గురించి తెలిసిందే. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని కందవాడ అనుబంధ గ్రామం మల్లారెడ్డిగూడకు చెందిన పడమటి నర్సింలు కొడుకు ఉదయ్ కుమార్ (18) కిడ్నాప్‌కు గురయ్యాడని... ఒక ఫోన్ నంబర్ నుంచి రూ. 5లక్షలు ఇవ్వాలని లేకుంటే నీ కొడుకును చంపేస్తామని పడమటి నర్సింలు ఫోన్‌కు మెసేజ్ రావడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ఉదయ్ కోసం గాలిస్తుండగా మండల కేంద్రంలోని మామ దాబ సమీపంలో ఉదయ్‌కుమార్ పోలీసులకు కనిపించాడు. ఉదయ్‌కుమార్‌ని పోలీసులు విచారించగా అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఉదయ్‌కుమార్ ఇటీవల జల్సాలకు బాగా అలవాటు పడ్డాడు. స్నేహితుల వద్ద సుమారు రూ.లక్ష వరకు అప్పులు చేశాడు. స్నేహితులు డబ్బులు అడుగుతారని... అవి తీర్చలేక... కళాశాలకు వెళ్లడం మానేశాడు. అవి ఎలా తీర్చాలో ఆలోచనలు చేశాడు. తానే కిడ్నాప్‌కు పథకాన్ని రచించాడు. తన తండ్రి ఇటీవలే గొర్రెలను అమ్మడంతో రూ. 5లక్షలు వచ్చాయి. అవి చూసినప్పటి నుంచి ఎలాగైనా డబ్బును రాబట్టుకోవాలని ఉదయ్ కుమార్ కిడ్నాప్ డ్రామాకు తెర లేపాడు. గత నెల 25న ఇంట్లో నుంచి స్కూటీపై బయటికి వచ్చాడు. షాబాద్ మండల పరిధిలోని నాగరగూడలోని హోటళ్లలో మధ్యా హ్నం తింటూ రాత్రివేళకు మామ దాబా వెనుక ఖాళీ స్థలంలో ఉండేవాడు. అలా రెండురోజులు గడి చాక మామ దాబ వద్ద పంచర్ షాపు లోని సితార్ ఖాన్‌తో స్నేహం పెంచుకున్నాడు. మా అమ్మ, నాన్న ఊళ్లో లేరు. వాళ్లు వచ్చేవరకు నీతో రెండు రోజులు ఉంటానని నమ్మించాడు. అతను సరే అనడంతో అక్కడే పడు కున్నాడు. సితార్‌ఖాన్ ఫోన్‌ను అతనికి తెలియకుండా ఉదయ్‌కుమార్ తీసుకుని అతని తండ్రి ఫోన్‌కు మెసేజ్ పెట్టాడు. ఏం తెలియనట్లుగా వ్యవహరిం చాడు. ఈ ఫోన్ నంబర్ ద్వారా పోలీసులు కేసును దర్యాప్తు చేపట్టగా అసలు విషయం బయటపడింది. తనను తానే కిడ్నాప్ చేసుకుని తండ్రిని భయభ్రాంతులకు గురి చేసి డబ్బులను లాగుదామని ఉదయ్‌కుమార్ కిడ్నాప్‌కు తెర లేపాడని పోలీసులు వెల్లడించారు. పోలీసులు ఉదయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని చేవెళ్ల మున్సిఫ్ కోర్టులో హాజరుపర్చారు.

వ్యవసాయ పథకాలపై డాక్యుమెంటరీ

మన తెలంగాణ/హైదరాబాద్ : వ్యవసాయాభివృద్ధికి, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలపై వ్యవసాయ శాఖ డాక్యుమెంటరీ తీయనుంది. ఇందులో ముఖ్యంగా వచ్చే ఏడాది నుంచి వానాకాలం నుంచి ఇవ్వనున్న ఎకరాకు రూ. 4 వేలు వ్యవసాయ పెట్టుబడి పథకాన్ని ఫోకస్ చేయనున్నట్టు కమిషనర్ జగన్‌మోహన్ బుధవారం 'మన తెలంగాణ'కు తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వము
కలెక్టర్ గారి కార్యాలయం, సిద్దిపేట జిల్లా

ఫారం- సి
(ప్రాథమిక నోటిఫికేషన్)

[illegible]

కలెక్టర్ ఫైల్ నం.G2/460/2017 తేది: 01.08.2017
రెవెన్యూ డివిజనల్ అధికారి ఫైల్ నం.D/171/2017 తేది: 31.07.2017
Gazette No. 83/2017 తేది: 01.08.2017

[illegible]

షెడ్యూలు

గ్రామము: మామిడ్యాల   మండలం: ములుగు   జిల్లా: సిద్దిపేట

1	2	3	4	5	6	7	8	9	10	11
1	1	పట్టా	ఖుష్కి	1.05	[illegible]	487	486	[illegible]	448, 447	[illegible]
2		పట్టా	ఖుష్కి		[illegible]					
3		పట్టా	ఖుష్కి		[illegible]					
4		పట్టా	ఖుష్కి		[illegible]					
5		పట్టా	ఖుష్కి		[illegible]					
6		పట్టా	ఖుష్కి		[illegible]					
7	245	పట్టా	ఖుష్కి	4.29	[illegible]	244	243	242	246	[illegible]
8		పట్టా	ఖుష్కి		[illegible]					
9		పట్టా	ఖుష్కి		[illegible]					
10		పట్టా	ఖుష్కి		[illegible]					
11		పట్టా	ఖుష్కి		[illegible]					
12		పట్టా	ఖుష్కి		[illegible]					
13		పట్టా	ఖుష్కి		[illegible]					
14		పట్టా	ఖుష్కి		[illegible]					
15		పట్టా	ఖుష్కి		[illegible]					
16		పట్టా	ఖుష్కి		[illegible]					
17	246	పట్టా	ఖుష్కి	12.29	[illegible]	230	245	248	247	[illegible]
18		పట్టా	ఖుష్కి		[illegible]					
19		పట్టా	ఖుష్కి		[illegible]					
20		పట్టా	ఖుష్కి		[illegible]					
21		పట్టా	ఖుష్కి		[illegible]					
22		పట్టా	ఖుష్కి		[illegible]					
23		పట్టా	ఖుష్కి		[illegible]					
24		పట్టా	ఖుష్కి		[illegible]					
25		పట్టా	ఖుష్కి		[illegible]					
26		పట్టా	ఖుష్కి		[illegible]					
27		పట్టా	ఖుష్కి		[illegible]					
28	248	పట్టా	ఖుష్కి	8.35	[illegible]	246	251	249	రోడ్డు	[illegible]
29		పట్టా	ఖుష్కి		[illegible]					
30		పట్టా	ఖుష్కి		[illegible]					
31		పట్టా	ఖుష్కి		[illegible]					
32		పట్టా	ఖుష్కి		[illegible]					
33		పట్టా	ఖుష్కి		[illegible]					
34		పట్టా	ఖుష్కి		[illegible]					
35		పట్టా	ఖుష్కి		[illegible]					
36		పట్టా	ఖుష్కి		[illegible]					
37		పట్టా	ఖుష్కి		[illegible]					
38		పట్టా	ఖుష్కి		[illegible]					
39		పట్టా	ఖుష్కి		[illegible]					
40	249	పట్టా	ఖుష్కి	7.29	[illegible]	248	250	259	రోడ్డు	[illegible]
41		పట్టా	ఖుష్కి		[illegible]					
42	250	పట్టా	ఖుష్కి	4.01	[illegible]	251, 252	254, 255	259	249	[illegible]
43		పట్టా	ఖుష్కి		[illegible]					
44		పట్టా	ఖుష్కి		[illegible]					
45		పట్టా	ఖుష్కి		[illegible]					
46		పట్టా	ఖుష్కి		[illegible]					
47	258	పట్టా	ఖుష్కి	5.09	[illegible]	259	256, 257	260	260	[illegible]
48		పట్టా	ఖుష్కి		[illegible]					
49	259	పట్టా	ఖుష్కి	5.09	[illegible]	250	255, 256	258	260	[illegible]
50		పట్టా	ఖుష్కి		[illegible]					
51		పట్టా	ఖుష్కి		[illegible]					
52		పట్టా	ఖుష్కి		[illegible]					
53		పట్టా	ఖుష్కి		[illegible]					
54	262	పట్టా	ఖుష్కి	0.23	[illegible]	260	261	[illegible]	263	[illegible]
55	263	పట్టా	ఖుష్కి	2.23	[illegible]	264	262	298	298	[illegible]
56	294	పట్టా	ఖుష్కి	0.3	[illegible]	295	298	298	[illegible]	[illegible]
57		పట్టా	ఖుష్కి		[illegible]					
58	295	పట్టా	ఖుష్కి	3.17	[illegible]	296	297	295	[illegible]	[illegible]
59		పట్టా	ఖుష్కి		[illegible]					
60	433	పట్టా	ఖుష్కి	3.18	[illegible]	437	439	432	434	[illegible]
61		పట్టా	ఖుష్కి		[illegible]					
62		పట్టా	ఖుష్కి		[illegible]					
63		పట్టా	ఖుష్కి		[illegible]					
మొత్తం				60.17						

[illegible]

సం/- తహశీల్దార్, ములుగు మండలము
సం/- రెవెన్యూ డివిజనల్ అధికారి, గజ్వేల్,సిద్దిపేట జిల్లా.
సం/- జాయింట్ కలెక్టర్, సిద్దిపేట జిల్లా.
సం/- జిల్లా కలెక్టర్, సిద్దిపేట జిల్లా.

భయపెడుతూ నవ్వించే 'లచ్చి'

ఓ ప్రముఖ ఛానల్‌లో వెన్నెల ప్రోగ్రామ్ ద్వారా బుల్లితెర ప్రేక్షకులకు దగ్గరైన జయతి తొలిసారిగా హీరోయిన్‌గా నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'లచ్చి'. జె9 4షోస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా ఈశ్వర్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. హారర్ కామెడీలో వైవిధ్యభరితంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. షూటింగ్ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ మొదటి వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత, కథానాయిక జయతి మాట్లాడుతూ ''ఈ చిత్రం కథ నచ్చి ఇందులో మెయిన్ లీడ్‌లో నటించాను. హారర్ కామెడీ చిత్రాలు చాలానే వచ్చాయి. కానీ లచ్చి చిత్రం కొత్త అనుభూతిని అందిస్తుంది. వైవిధ్యమైన కథ, కథనం ప్రేక్షకుల్ని థ్రిల్‌కు గురిచేస్తుంది. సినిమా అంతా లచ్చి పాత్ర చుట్టూనే తిరుగుతుంది. అనేక మలుపులు ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేస్తాయి. ప్రముఖ కమేడియన్స్ కడుపుబ్బా నవ్విస్తారు. అన్ని కార్యక్రమాల్ని పూర్తిచేసి మా చిత్రాన్ని సెప్టెంబర్ మొదటి వారంలో గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం''అని అన్నారు. చంద్రమోహన్, పూర్ణిమ, శివప్రసాద్, రఘుబాబు, తాగుబోతు రమేష్, ధనరాజ్, షేకింగ్ శేషు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరాః యం.వి.రఘు, మాటలుః మరుధూరి రాజా, సంగీతంః సురేష్ యువన్, పాల్ పవన్, ఎడిటర్ః ప్రభు, సాహిత్యంః కందికొండ.



జయతి

నా పేరు సూర్య.. షూటింగ్ షురూ



అల్లు అర్జున్

హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్స్‌తో టాప్ రేంజ్‌లో దూసుకెళ్తున్న అల్లు అర్జున్ హీరోగా, అను ఇమాన్యుయల్ హీరోయిన్‌గా వక్కంతం వంశీ దర్శకత్వంలో 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. యాక్షన్ కింగ్ అర్జున్ ముఖ్య పాత్రలో శరత్ కుమార్ ప్రతి నాయకుడి పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ శిరీష శ్రీధర్ నిర్మాతగా, బన్నీ వాసు సహ నిర్మాతగా రూపుదిద్దు కుంటోంది. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్‌శేఖర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి వచ్చే ఏడాది ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ ''అల్లుఅర్జున్ హీరోగా సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టాం. బన్నీ ఎనర్జీకి తగ్గట్టుగా చేసిన ఈ కథలో అన్ని కమర్షియల్ అంశాలు ఉంటాయి. టెంపర్, కిక్, రేసుగుర్రం వంటి సూపర్ హిట్ చిత్రాలకు కథ అందించి వరుస సక్సెస్‌లను అందుకున్న వక్కంతం వంశీ తొలిసారి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్‌శేఖర్ ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూరుస్తున్నారు'' అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః రాజీవ్ రవి, ఎడిటర్ః కోటగిరి వెంకటేశ్వర రావు, ఫైట్స్ః రామ్‌లక్ష్మ ణ్, సాహిత్యంః రామజోగయ్య శాస్త్రి.

షూటింగ్ అయ్యాక కూడా కళ్ల నుండి నీళ్లు వచ్చేవి



రకుల్‌ప్రీత్ సింగ్

టాలీవుడ్‌లో అతి తక్కువ కాలంలో స్టార్ హీరోయిన్‌గా రాణించిన బ్యూటీ రకుల్‌ప్రీత్ సింగ్. ఇటీవల 'రారండోయ్ వేడుక చూద్దాం' చిత్రంలో భ్రమరాంబగా తన పాత్రతో మెప్పించిన ఈ అమ్మడు ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు జోడీగా 'జయ జానకి నాయక' చిత్రంలో నటించింది. ఈ చిత్రం ఈనెల 11న విడుదలకానుంది. ఈ సందర్భంగా రకుల్‌ప్రీత్ సింగ్‌తో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు...

బోయపాటి మార్క్ యాక్షన్‌తో...

బోయపాటి శ్రీను అద్భుతంగా తెరకెక్కించిన డిఫరెంట్ సినిమా ఇది. మంచి ప్రేమ కథతో సినిమా రూపుదిద్దుకుంది. దాంతోపాటు బోయపాటి మార్క్ యాక్షన్ కూడా ఇందులో ఉంటుంది.

గాఢమైన ప్రేమ కథ...

ఈ ప్రేమ కథలో బలమైన ఎమోషన్స్ ఉంటాయి. ఎంత కష్టం వచ్చినా హీరో తన ప్రేమను వదులుకోడు. ఈమధ్య కాలంలో ఇలాంటి గాఢమైన ప్రేమ కథా చిత్రం రాలేదు. ఈరోజుల్లో ఇలాంటి మూవీ ఎవరూ చేయరు కూడా.

అనుకోని కష్టాలతో డిప్రెషన్‌లోకి...

సినిమాలో నా పేరు జానకి. చదువుకుంటూ సరదాగా, హాయిగా ఉండే నా జీవితంలో అకస్మాత్తుగా అనుకోని కష్టాలు ఎదురై అంతా తలకిందులైపోతుంది. చాలా కష్టాల్లోకి వెళ్లిపోతాను. డిప్రెషన్‌లోకి వెళ్లి బాధపడతాను.

బయటకు రావడానికి సమయం పట్టేది...

ఈ పాత్ర చేయడం నాకు కష్టంగా అనిపించింది. ఒకేసారి నా పాత్రలోకి వెళ్లాక బయటకు రావడానికి సమయం పట్టేది. షూటింగ్ సమయంలో మా అమ్మ ఫోన్ చేసినా మాట్లాడేదాన్ని కాదు. ఒకవేళ మాట్లాడితే మళ్లీ సాధారణ స్థితికి వచ్చేస్తానేమోనని అలా చేసేదాన్ని.

అలా రిలాక్స్ అయ్యేదాన్ని...

సినిమాలోని చాలా సన్నివేశాల్లో ఏడుస్తూ ఉండాలి. అందుకోసం కళ్లలో గ్లిజరిన్ వేసుకునే దాన్ని. షూటింగ్ అయ్యాక కూడా కళ్ల నుండి నీళ్లు వచ్చేవి. అప్పుడు ఐస్ బ్యాగ్స్ కళ్ల మీద పెట్టుకొని రిలాక్స్ అయ్యేదాన్ని. కొన్నిసార్లు బోయపాటి శ్రీనుతో... సార్ షూటింగ్ అయ్యేలోపు నా కళ్ల కింద లైన్స్ వస్తాయేమోనని అనేదాన్ని.

ఇంటెలిజెంట్ దర్శకుల్లో ఒకరు...

బోయపాటి శ్రీను స్టైల్ నాకు బాగా నచ్చుతుంది. ఆయనకు నటుల నుండి ఏం కావాలో... దాన్ని ఎలా రాబట్టుకోవాలో బాగా తెలుసు. అందుకే ఆయనతో కలిసి పనిచేయడం సులభంగా అనిపించేది. నేను పనిచేసిన ఇంటెలిజెంట్ దర్శకుల్లో ఆయన కూడా ఒకరు.

ఎనర్జీతో పనిచేశారు...

హీరో బెల్లంకొండ శ్రీనివాస్ షూటింగ్ మొదటి రోజు నుండి చివరి రోజు వరకు ఒకటే ఎనర్జీతో పనిచేసేవారు. సినిమా కోసం బాగా కష్టపడ్డారు. ఆయనతో కలిసి పనిచేయడం మంచి అనుభవాన్నిచ్చింది.

వాటిని పట్టించుకోను...

నేను నంబర్ గేమ్‌ను అస్సలు నమ్మను. ఒకరు ముందు, ఒకరు తర్వాత అనే దాన్ని పట్టించుకోను. రెండు సినిమాలు హిట్టయితే నెంబర్ వన్, ఫ్లాపైతే అవకాశాలు రావడం లేదు అనే మాటలు నిజం కాదు. అవకాశాలు ఉన్నంత వరకు సినిమాలు చేసుకుంటూ వెళ్లడమే నా పని.

మంచి సినిమాలు చేస్తా...

నాకు తెలుగు, తమిళం అనే తేడా లేదు. ఎక్కడ మంచి అవకాశాలు వచ్చినా ఆ సినిమాలు చేస్తాను. ప్రేక్షకులను అలరించే సినిమాలు చేస్తూ హీరోయిన్‌గా పేరుతెచ్చుకోవాలన్నదే నా కోరిక.

దేశభక్తి అనేది కిరీటం కాదు కృతజ్ఞత



సాయిధరమ్

సాయిధరమ్ తేజ్, మెహ్రీన్ ఫిర్జాదా జంటగా బివిఎస్ రవి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'జవాన్'. దిల్‌రాజు సమర్పణలో అరుణాచల్ క్రియేషన్స్ బ్యానర్‌పై కృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను చిత్ర బృందం రిలీజ్ చేసింది. 'కొంతమంది మనుషులు కలిస్తే కుటుంబం అవుతుంది. కొన్ని లక్షల కుటుంబాలు కలిస్తే దేశం అవుతుంది. దేశభక్తి అనేది కిరీటం కాదు కృతజ్ఞత' అంటూ దర్శకుడు బివిఎస్ రవి చెప్పిన వాయిస్‌ఓవర్ ఆలోచనాత్మకంగా, సందేశాత్మకంగా ఉంది. అతను సాయిధరమ్‌తేజ్‌ను కొత్తగా చూపించబోతున్నాడని స్పష్టమవుతోంది. దేశానికి జవాన్ ఎంత అవసరమో... ప్రతి ఇంటికి మా కథానాయకుడిలాంటి వాడు ఉండాలని చెప్పడమే మా ఉద్దేశమని దర్శకుడు బివిఎస్ రవి అంటున్నాడు. ఇందులో మధ్య తరగతి కుటుంబానికి చెందిన యువకుడి పాత్రలో సాయిధరమ్‌తేజ్ కనిపిస్తాడు. తన కుటుంబాన్ని మనోధైర్యంతో, బుద్ధిబలంతో ఎలా కాపాడుకున్నాడన్నదే జవాన్ కథ. అందుకే ఇంటికొక్కడు అనే క్యాప్షన్ పెట్టారు. ఇది పక్కా ఫ్యామిలీ ఎమోషన్స్‌తో కూడిన ఎంటర్‌టైనింగ్ కమర్షియల్ చిత్రం. తమన్ అద్భుతమైన ట్యూన్స్ ఇచ్చాడు. మెహ్రీన్ ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్. ప్రసన్న మెయిన్ విలన్‌గా నటించారు. సెప్టెంబర్‌లో జవాన్ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరామెన్ః కెవి గుహన్, మ్యూజిక్ః తమన్, ఆర్ట్ః బ్రహ్మ కడలి, ఎడిటింగ్ః ఎస్ఆర్ శేఖర్.



రాష్ట్ర ఎఫ్‌డిసి చైర్మన్ పుస్కూర్ రామ్‌మోహన్‌రావు కుమార్తె దేదీప్య వివాహ వేడుకలో సూపర్ స్టార్ కృష్ణ

ఘనంగా వివాహ వేడుక

తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డిసి) చైర్మన్ పుస్కూర్ రామ్‌మోహన్‌రావు కుమార్తె దేదీప్య వివాహం విష్ణుచరణ్‌తో గచ్చిబౌలిలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు రాష్ట్ర సిఎం కెసిఆర్, మహారాష్ట్ర గవర్నర్ సి.హెచ్.విద్యాసాగర్ రావు, రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, జగదీశ్వర్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరన్ రెడ్డి, డిప్యూటి స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, కె.కేశవరావు, జి.వివేక్, వినోద్, ఎర్రబెల్లి దయాకర్ రావు , సినీ ప్రముఖులు కృష్ణ, సురేష్‌బాబు, నితిన్, అల్లు అరవింద్, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, కె.మురళీమోహన్‌రావు, బివిఎస్ఎన్ ప్రసాద్, సి.కళ్యాణ్, ఆర్.నారాయణమూర్తి, వి.వి.వినాయక్, జెమిని కిరణ్, దశరథ్ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

వినోదాల 'లవర్స్ క్లబ్'



అనిష్ చంద్ర, పావని, ఆర్యన్, పూర్ణలు జంటగా ధ్రువశేఖర్ దర్శకత్వంలో భరత్ అవ్వారి నిర్మించిన చిత్రం 'లవర్స్ క్లబ్'. ప్రవీణ్ గాలిపల్లి సమర్పణలో ఈ ఎమోషనల్ లవ్‌స్టోరీ తెరకెక్కింది. ప్లాన్ 'బి' ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రేయ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌లపై సంయుక్తంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. ఈ సినిమా టీజర్, స్టిల్స్ ఇప్పటికే యువతను ఆకట్టుకోగా... ఇప్పుడు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇప్పటికే అన్ని కార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఈ చిత్రం ఈనెల 25న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్మాత భరత్ అవ్వారి మాట్లాడుతూ ''ఈ ఏడాది ఇప్పటివరకు పెద్ద సినిమాలు ఏ రేంజ్‌లో సూపర్ హిట్ అయ్యాయో చిన్న చిత్రాలు కూడా అదే స్థాయిలో విజయాలు సాధించాయి. కంటెంట్ ఈజ్ కింగ్ అని ప్రేక్షకులు నిరూపించారు. అదే ధైర్యంతో మా లవర్స్ క్లబ్‌ను విడుదల చేస్తున్నాం. మా కంటెంట్ పక్కా ఎమోషనల్‌గా అందరినీ ఆకట్టుకుంటుంది. కొత్త వారితో చేసినా కూడా మా దర్శకుడు శేఖర్ అందరి నుంచి మంచి నటనను రాబట్టుకున్నారు. మా చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందన్న నమ్మకముంది''అని అన్నారు. దర్శకుడు ధ్రువశేఖర్ మాట్లాడుతూ ''లవర్స్‌కు అండగా నిలబడే ఒక యువకుడి జీవితంలో కొన్ని అనుకోని సమస్యలు వస్తే వాటిని ఎలా ఎదుర్కొన్నాడన్నదే ఈ చిత్ర కథాంశం. యదార్థ సంఘటల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. తొలిసారి ఐ ఫోన్ టెక్నాలజిని ఉపయోగించి ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇంతవరకు ఎవరూ తీయని విధంగా ఈ టెక్నాలజతో సినిమా తీశాం. ఈ టెక్నిక్ ఇండస్ట్రీ వాళ్లని, యూత్‌ను ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాం. పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రం 'లవర్స్ క్లబ్'. మా ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నాం. ఈనెల 25న సినిమాను విడుదల చేస్తున్నాం''అని చెప్పారు. ధీరజ్, చిత్రం భాష, వైజాగ్ ప్రసాద్, అజయ్ రత్నం తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ః రవి నిడమర్తి, ఆర్ట్ః నాగేంద్ర, ఎడిటింగ్ః కిరణ్ కుమార్, మాటలుః ధ్రువ శేఖర్, ప్రదీప్ ఆచార్య, పాటలుః రాంబాబు గోపాల, ధ్రువ శేఖర్.



పూజా హెగ్డేకు లక్కీ ఆఫర్

ఇటీవల అల్లు అర్జున్‌తో చేసిన 'డిజె' సినిమాతో ప్రేక్షకులను అలరించిన బ్యూటీ పూజా హెగ్డే. ఈ సినిమాతో ఈ ముద్దుగుమ్మకు గ్లామరస్ తారగా మంచి క్రేజ్ వచ్చింది.

దీంతో తెలుగులో ఈ బ్యూటీకి మంచి అవకాశాలు వస్తున్నాయి. తాజాగా బెల్లంకొండ శ్రీనివాస్‌తో ఓ సినిమాకు ఓకే చెప్పిన ఈ భామ నాగచైతన్య సరసన కూడా నటించబోతున్నట్లు తెలిసింది. నాగచైతన్యచందు మొండేటి కాంబినేషన్‌లో తెరకెక్కే సినిమాలో పూజా హెగ్డేను హీరోయిన్‌గా ఖరారు చేసినట్లు తెలిసింది.

ఈ సినిమాను ఈ నెలలోనే పూజా కార్యక్రమాలతో ప్రారంభించి... సెప్టెంబర్ 11 నుంచి సెట్స్‌పైకి తీసుకెళ్తారని తెలిసింది. గోపీసుందర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తాడు. ఈ సినిమాకుగాను పూజా హెగ్డేకు భారీ పారితోషికాన్ని అందించనున్నట్లు తెలిసింది. అయితే గతంలో నాగచైతన్యతో 'ఒక లైలా కోసం' సినిమా చేసింది ఈ బ్యూటీ. ఆ సినిమా ఫ్లాప్ కావడంతో పూజను ఎవరూ పట్టించుకోలేదు. పైగా ఆ సినిమాలో హోమ్‌లీ లుక్‌లో ఈ భామ పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఇప్పుడు మాత్రం ఆమె నాగచైతన్య సినిమాలో ఒక మోడ్రన్ గ్లామరస్ క్యారెక్టర్‌లో కనిపించనుంది.

ప్రేమ మారదు... ప్రేమికులు మాత్రమే మారుతుంటారు



'బంగారి బాలరాజు' సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో సాగర్, సింధూరపువ్వు కృష్ణా రెడ్డి, నాగ అన్వేష్, కోటేంద్ర దుద్యాల, కెఎండి రఫీ తదితరులు

నంది, చల్లా క్రియేషన్స్ బ్యానర్‌లపై కెఎండి రఫీ నిర్మాతగా 'బంగారి బాలరాజు' మూవీని రూపొందిస్తున్నారు. ఈ మూవీకి లవ్ ఈజ్ బ్యాక్ అనేది ట్యాగ్ లైన్. కోటేంద్ర దుద్యాల ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు కథ, మాటలు, స్క్రీన్‌ప్లే బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో లాంఛనంగా ప్రారంభమైంది. నూతన నటీనటులతో రూపొందుతున్న ఈ మూవీకి క్లాప్‌ను సాగర ఇవ్వగా... యంగ్ హీరో నాగ అన్వేష్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ మూవీ స్క్రిప్ట్‌ను సింధూర పువ్వు కృష్ణారెడ్డి చేతుల మీదుగా నిర్మాత రఫీ, దర్శకుడు కోటేంద్ర స్వీకరించారు. అనంతరం కోటేంద్ర దుద్యాల మాట్లాడుతూ ''దర్శకుడిగా నా తొలి చిత్రమిది. చిత్ర కథ విషయానికొస్తే... దశాబ్దాలు మారినా, శతాబ్దాలు మారినా ప్రేమ మారదు. ప్రేమికులు మాత్రమే మారుతుంటారు. చరిత్రలో రోమియోజూలియట్, సలీంఅనార్కలి, దేవదాసుపార్వతి, లైలామజ్ను ప్రేమను త్యాగం చేసి చరిత్రలో నిలిచిపోయారు. బంగారిబాలరాజులు కూడా తమ ప్రేమను త్యాగం చేసి చరిత్రలో నిలిచిపోతారా లేదా ప్రేమను గెలిపించుకొని చరిత్ర సృష్టిస్తారా అనేదే ఈ చిత్ర కథాంశం''అని అన్నారు. నిర్మాత మహ్మద్ రఫీ మాట్లాడుతూ ''దర్శకుడు ఈ సినిమా కథలోని ఒక లైన్ వినిపించారు. అది నచ్చే ఈ చిత్రానికి నిర్మాణ బాధ్యతలు చేపట్టాను. ఇది మంచి లవ్ స్టోరీ''అని తెలిపారు. రోహిణి, అజయ్ ఘోష్, అప్పారావు, లేఖన, ఆర్‌పి, మహేంద్రనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతంః చిన్నికృష్ణచిట్టిబాబు ఎడ్డిపోగు, కెమెరాః బాబు.జి.ఎల్, ఆర్ట్ః కృష్ణమాయ, ఎడిటింగ్ః సాయిబాబుహరి.

ప్రేమ వ్యవహారాన్ని దాచిపెడుతోంది



శృతిహాసన్

సౌత్ బ్యూటీ శృతిహాసన్ ఏ విషయాన్ని అయినా ముక్కుసూటిగా చెబుతుంది. అయితే తన ప్రేమ వ్యవహారాన్ని మాత్రం దాచిపెడుతోంది. బ్రిటన్‌కు చెందిన మైఖేల్ కోర్సలేతో శృతి ప్రేమలో ఉందంటూ పలు కథనాలు చాలా కాలంగానే వినిపిస్తున్నాయి. అంతేకాదు వీరి ప్రేమకు తండ్రి కమల్‌హాసన్ కూడా ఓకె చెప్పినట్టు సమాచారం. ఇప్పటికే ఓసారి కమల్, మైఖేల్‌లు లండన్‌లో భేటీ అయ్యారనే టాక్ కూడా ఉంది. ఇన్ని కబుర్లు వినిపిస్తున్నా శృతిహాసన్ మాత్రం ఇప్పటి వరకు తన ప్రేమ వ్యవహారంపై ఏమాత్రం మాట్లాడడం లేదు. తనంతట తాను చెప్పకపోవడమే కాదు ఎవరైనా అడిగినా సరే మాట దాటేస్తోంది. ఈ బ్యూటీ నటించిన ఓ బాలీవుడ్ మూవీ ప్రచారంలో పాల్గొంటున్న ఆమెకు తన ప్రేమ గురించి ప్రశ్నలు ఎదురైతే... ''సారీ... దాని గురించి అయితే మాట్లాడదలచుకోలేదు''అని నిర్మొహమాటంగా చెప్పింది. అలాగని మైఖేల్ కోర్సలేకు దూరంగా ఉంటోందని అనుకుంటే పొరపాటే. ఇటు ముంబయి... అటు చెన్నైల మధ్య చక్కర్లు కొడుతున్న శృతిహాసన్ పలుమార్లు ముంబయ్ ఎయిర్‌పోర్టులో మైఖేల్‌తో దర్శనమిచ్చింది. ఆ సమయంలో ఫొటోగ్రాఫర్లు ఆమెను మైఖేల్‌తో కలిసి ఫొటోలు తీస్తున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదట ఈ భామ.



నితీశ్ దురహంకారం వినాశకరం : తేజస్వీ

పాట్నా: బీహార్ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జెడి(యు) అధినేత నితీశ్ దురహంకారం ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాన్ని త్వరలో నాశనం చేస్తుందని విమర్శించారు. బుధవారం తేజస్వీ విలేకరులతో మాట్లాడుతూ.. జనతా దళ్ యునైటెడ్ నేతగా నితీశ్ కుమార్ ద్వంద్వ ప్రమాణాలను అవలంభిస్తున్నారని ఆరోపించారు. 'పదవీకాలాన్ని పూర్తి చేయడంలో నితీశ్ విఫలమయ్యారు. నితీశ్ ఒకవేళ మాతో కలిసి పనిచేయాలనుకోనప్పుడు ఎందుకు ఇంతకాలం ఎదురు చూశారు. అలాగే బీహార్ నాలుగు సంవత్సరాలను ఎందుకు వ్యర్థం చేశారు?' అని తేజస్వీ ప్రశ్నించారు. 'నితీశ్ కుమార్, సుశీల్ మోడీల ఆరోపణలపై ప్రశ్నలన్నింటికీ బీహార్ ప్రజల డిమాండే సమాధానం. పనామా పత్రాలు లీకేజి కేసులో పేర్లు వచ్చిన వారిపై విచారణ జరపాలని ప్రధానిని నితీశ్ అడుగుతారా? ఆ రోజు ఎన్నటికీ రాదు. నిందితులందరూ ఏకమయ్యారు' అని తేజస్వీ దుయ్యబట్టారు. దాదాపు 75 శాతం మంది తన కళంకిత మంత్రుల విషయంలో నితీశ్ మౌనం వహించడం సరికాదన్నారు. బీహార్ ఉపముఖ్యమంత్రిగా తేజస్వీ మంచిపనులు చేశారని రాష్ట్ర ప్రజలు మాట్లాడుకోవడం చూసిన సిఎం నితీశ్ అప్రమత్తమయ్యారని లాలూ ప్రసాద్ యాదవ్ మంగళవారం విమర్శించిన సంగతి తెలిసిందే.


బస్సులు చూడని 1200 గ్రామాలు

● గ్రామాలకు బస్సులపై ప్రభుత్వ వాగ్దానాలు... నీటిమీది రాతలు... ● ఆర్‌టిసి బస్సులు రావు... గ్రామీణ ప్రజలకు తప్పని రవాణా తిప్పలు

మన తెలంగాణ /హైదరాబాద్ : ''రాష్ట్రంలో ప్రతి పల్లెకు రోడ్డు వేస్తాం. ప్రతి గ్రామానికి ఆర్‌టిసి బస్సు నడుపుతాం. ప్రజా రవాణాను మరింత పటిష్టం చేస్తాం'' అని రాష్ట్ర ప్రభుత్వం, రవాణ శాఖ, టిఎస్‌ఆర్‌టిసి చేస్తున్న ప్రకటనలు నీటి మీది రాతలుగానే మిగిలిపోతున్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి మూడేళ్లు దాటింది. గత రెండేళ్లుగా టిఎస్‌ఆర్‌టిసి స్వయం ప్రతిపత్తితో పనిచేస్తోంది. అయినా రాష్ట్రంలో సుమారు 1200 గ్రామాలు ఇప్పటికీ ఆర్‌టిసి బస్సును చూడలేదు. టిఎస్‌ఆర్‌టిసి అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణ ఏర్పడినప్పుడు రాష్ట్రంలోని 9265 గ్రామాలను అనుసంధానం చేస్తూ బస్సులు నడుస్తుండేవి. మూడేళ్ళైనా పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాలేదు. నేటికీ అదే సంఖ్యలో గ్రామాలకు బస్సులను నడుపుతున్నారు. ఇంకా 1341 గ్రామాలకు బస్సులను నడిపించలేకపోతున్నట్లు ఆర్‌టిసి అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ''రాష్ట్రంలో దాదాపు 1200 గ్రామాలకు రోడ్డు సదుపాయం లేకపోవడం వల్ల గ్రామాలకు ఆర్‌టిసి బస్సులను నడపలేకపోతున్నాం'' అని స్వయంగా రాష్ట్ర రవాణ శాఖ మంత్రి డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి ఇటీవల పలు సందర్భాల్లో ప్రకటించారు. ఎపిఎస్‌ఆర్‌టిసి విడిపోయి 2015 మే నుంచి టిఎస్‌ఎర్‌టిసిగా సేవలను ప్రారంభించినప్పుడు రాష్ట్రంలో మొత్తం 3638 రూట్లలో బస్సులు నడుస్తుండగా, రెండేళ్లలో 2017 మే నాటికి అవే గ్రామాలు, మండలాలు, జిల్లా కేంద్రాలు, రాష్ట్ర రాజధానికి అదనంగా 91 రూట్లను పెంచి 3729 రూట్లలో బస్సులను నడుపుతున్నది.

బస్సులు లేని గ్రామాలకు కొత్తగా బస్సులు నడిపే విషయాన్ని పక్కనబెడితే ఇప్పటివరకు గ్రామాలకు నడుస్తున్న బస్సులను కూడా రకరకాల సాకులతో రద్దు చేస్తున్నారని ఆర్‌టిసిపై తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. ఇందుకు గ్రామాలకు రోడ్లు సరిగ్గా లేవని, కొన్ని గ్రామాలలో ప్రయాణికులు బస్సులు ఎక్కే పరిస్థితి లేదని, మరి కొన్ని గ్రామాల్లో ఆక్యుపెన్సీ తగినంతగా లేదని తదితర కారణాలతో ఉన్న బస్ సర్వీసులను సైతం తొలగిస్తున్నారని ఆ గ్రామాల



ప్రజలు వాపోతున్నారు. భారీ వర్షాలు, వరదలు, ఇతర ప్రకృతి వైపరిత్యాల కారణంగా రోడ్డు పాడైతే ఆ గ్రామాల ప్రజల పరిస్థితి వర్ణనాతీతం. బస్సులు రాక, ప్రైవేటు ఆటోలు, జీపులలో అధిక ఛార్జీలు చెల్లించే పరిస్థితి లేక గ్రామీణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్లు పాడైనప్పుడు బస్సులు రాకుంటే సరే... రోడ్లు బాగుపడినా బస్సులు నడపడంలో పలు ఆర్‌టిసి డిపోల మేనేజర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు వేసినా బస్సు రాలేదు: వేలాది కోట్ల రూపాయాలతో కొత్తగా రోడ్లను వేస్తున్నామని, రాష్ట్ర రాజధాని నుంచి జిల్లా కేంద్రాలకు నాలుగు లేన్లు, జిల్లా కేంద్రాల నుంచి మండలాలకు 2 లైన్లు, మండలం నుంచి గ్రామాలకు ఒక లైన్ రోడ్లను దాదాపుగా నిర్మాణమయ్యాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రకటిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం, రోడ్లు భవనాల శాఖ చెబుతున్న ప్రకారం గత మూడేళ్లలో రోడ్లు ఎంతో అభివృద్ధి చెందితే తమ గ్రామాలకు బస్సులు ఎందుకు నడపడం లేదని బస్సులు రాని గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

''నాలుగేళ్ళ కిందట భారీ వర్షాలు, వరదల కారణంగా రోడ్లు తెగిపోవడంతో నల్లగొండ నుంచి కట్టంగూర్ మీదుగా అమ్మనబోలుకు వెళ్ళే ఆర్‌టిసి బస్ సర్వీసును నిలిపివేశారు. రెండేళ్ల తరువాత ఈ బస్ రూట్లో దాదాపు అన్ని గ్రామాలకు బ్రహ్మాండమైన రోడ్లు వేశారు. అయినా ఆర్‌టిసి ఆ బస్ సర్వీసును పునరుద్ధరించకపోవడంతో నకిరేకల్ మీదుగా పదుల కిలోమీటర్లు ప్రయాణించి వివిధ గ్రామాలకు వెళ్ళాల్సి వస్తుంది. పలు మార్లు విజ్ఞప్తులు చేసినా స్థానిక ఆర్‌టిసి అధికారులు పట్టించుకోవడం లేదు. నల్లగొండ నుంచి కొండకిందిగూడెంకు, అమ్మనబోలు నుంచి మోత్కూరుకు నడిపిన బస్సు సర్వీస్‌ను కూడా గత కొంత కాలంగా నిలిపివేశారు. బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం'' అని ఆయా గ్రామాల ప్రజలు 'మన తెలంగాణ' ప్రతినిధితో ఆవేదన వ్యక్తం చేశారు.

మరోవైపు రోడ్లు సక్రమంగా ఉన్న గ్రామాలకు, ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా బస్సులను నడుపుతున్నామని ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. ప్రయాణికుల అవసరాల మేరకు కొన్ని బస్సుల రూట్లను కూడా మార్చి నడుపుతున్నామంటున్నారు. ఇటీవల ఆటోలకు అలవాటు పడిన కొన్ని గ్రామాల ప్రజలు తమకు ఆర్‌టిసి బస్సు కావాలని అడిగే పరిస్థితి లేదని, అలాంటప్పుడు తామేమి చేయగలమని అధికారులు తమ వాదనను వినిపిస్తున్నారు. ఇక మంత్రులు, వివిధ పదవుల్లో ఉన్న రాజకీయ ప్రముఖులు తమ పలుకుబడిని చాటుకోవడానికి, ప్రతిష్టను పెంచుకోవడానికి ఆర్‌టిసిపై వత్తిడి తెచ్చి తమ సొంత ఊళ్లకు బస్సులు నడిపించుకుంటున్నారు. వాటిని చూపి రోడ్డున్న ప్రతి గ్రామానికి ఆర్‌టిసి బస్సులను నడుపుతున్నామని ప్రభుత్వం ప్రకటించుకుంటుండడం గమనార్హం.

క్రమబద్ధంపై స్టే

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియ కొలిక్కి వచ్చాకే విలీన నిర్ణయ ఫైల్‌ను బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ముందు ఉంచుతామని, బోర్డు ఆ నిర్ణయానికి ఆమోదం తెలిపిన తరువాతనే విలీన ప్రక్రియకు సంబంధించి తగిన చర్యలు ఉంటాయన్నారు. అయితే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేస్తూ విద్యుత్‌సంస్థలు నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అప్పుడు పిటిషనర్ల సీనియర్ న్యాయవాది సరసాని సత్యంరెడ్డి చెప్పగా... అలాంటి పరిణామాలు చోటు చేసుకుంటే తమ దృష్టికి తీసుకురావచ్చుననే వెసులుబాటును హైకోర్టు కల్పించింది. గత సోమవారం హైకోర్టు దృష్టికి తీసుకురాగా బుధవారం డివిజన్ బెంచ్ విచారణ జరిపి స్టే ఆదేశాలిచ్చింది. ఇలాంటిది ఏమైనా జరిగితే తమ దృష్టికి తేవాలని అప్పట్లో హైకోర్టు పిటిషనర్‌కు వెసులుబాటు ఇచ్చిందని గుర్తు చేశారు. ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగ నియామకాల కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ సంస్థలు సుమార్ 21 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్ని రెగ్యులరైజ్ చేయడం అన్యాయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేసే అధికారం విద్యుత్ సంస్థలకు ఉం దని, అంతా చట్ట నిబంధనలకు లోబడే జరిగిందన్నారు. వాదన ప్రతివాదనల అనంతరం హైకోర్టు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ ఉత్తర్వుల అమలుపై స్టే విధించింది. విచారణ నాలుగు వారాలు వాయిదా వేసింది. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కన్సాలిడేట్ ఎమౌంట్ చెల్లింపు మొత్తాల్ని యథాతథంగా కొనసాగించవచ్చునని, వారి సర్వీసుల్ని కొనసాగించవచ్చునని, వాళ్లందర్నీ బయటకు పంపి ఉపాధి లేకుండా చేయలేమని ఆదేశాల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వులు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హక్కు మాత్రం కాబోదని స్పష్టం చేసింది.

ఉద్యానం ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

ర్యాలీలు నిర్వహించారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా బుధవారం యూనివర్సిటీకి వెళ్లి టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. రేవంత్‌రెడ్డి, మాజీ హోంశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి సంఘీభావం ప్రకటించారు. రేవంత్ వచ్చిన సమయంలో విద్యార్థులు మరింత ఆందోళన చేయడంతో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకొని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గొప్పలు కాదు నియామకాలు చేపట్టండి : రేవంత్

పూలు, పండ్లసాగులో దేశంలోనే మూడో స్థానంలో ఉన్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఇప్పటిదాకా హార్టికల్చర్ ఆఫీసర్లు, విస్తారణాధికారుల నియామకాలను చేపట్టలేదని టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 578 మండలాలలో రాక్షసత్వంతో ప్రజలను అణచివేయాలనుకున్న నిజాం నవాబులు, రజకారులు, ఆంధ్రపాలకులే తెలంగాణ సమాజం ముందు నిలబడలేకపోయారని వారితో పోలిస్తే సిఎం కె. చంద్రశేఖర్‌రావు ఎంత అన్నారు.

పత్తి విలవిల

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ విడుదల చేసిన వారంతపు నివేదికలో స్పష్టమౌతోంది. జూన్ నుంచి వర్షాల నమోదును గమనిస్తే రాష్ట్రంలోని 584 మండలాల్లో మూడింటిలో అతి తక్కువగా, 195 మండలాల్లో లోటు,267 మండలాల్లో సాధారణ వర్షపాతం ఉంది. గత ఏడాది జూలైలో 176.1 మిల్లి మీటర్ల వర్షపాతం ఉంటే ఈసారి 146 మి.మీగా నమోదైంది. సాధారణంగా 242.7 మి.మీ వర్షం పడాల్సి ఉంది. మరో 15 రోజులు పరిస్థితి ఇలాగే కొనసాగితే వేసిన పంటలు చేతికి వచ్చేది కష్టమే. వరి నాట్లు వేసుకునేందుకు కూడా సమయం దగ్గరపడింది. ఇప్పటికే వేసిన వరినాట్లు ఎండిపోయి పొలాలు బీటలు వారుతున్నాయి. ఫలితంగా పంటల సాగు తగ్గుతోంది.

పత్తికి గండం : వ్యవసాయ శాఖ తాజా నివేదిక ప్రకారం ఇప్పటి వరకు 79.49 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో పత్తి సాధారణ సాగు అంచనా 41.41 లక్షల ఎకరాలు ఉండగా అంతకు మించి 43.16 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. జూన్‌లో వర్షాలు జోరుగా ఉండటంతో అన్నదాతలు పత్తిని ఆశతో సాగు చేయడంగా దాదాపు 104 శాతంగా నమోదైంది. అన్ని పంటల సాగుతో చూసే దాదాపు 50 శాతం వరకు పత్తినే ఉండటం గమనార్హం. ఇప్పుడిది పూత, కాయ దశకు చేరుకుంది. అయితే వర్షాలు లేకపోవడం, వాతావరణంలో వేడి పెరగడంతో గులాబీ పురుగు పంటను గులాబీ పురుగు తినేస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు నానాతంటాలు పడుతుండగా, ఆకులు కూడా వాడిపోయి నిర్జీవ దశకు చేరుకుంటుడంతో లక్షల మంది అన్నదాతలకు కంటి మీద కునుకు ఉండటం లేదు. ఇప్పటికే ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి, అప్పులు చేసి మరీ సాగు చేశామని ప్రకృతి సహకరించడం లేదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమైన సోయాబీన్, పసుపు, మొక్కజొన్న పంటల పరిస్థితి అలాగే ఉంది. పసుపునకు తక్కువ వర్షం పడినా, ఎక్కువ వర్షం పడినా నష్టమే. ఇప్పుడు వర్షాలు లేకపోవడం భూమితో తేమశాతం తగ్గి కొమ్ములు ఊరడం లేదు. వర్షాభావ పరిస్థితులకు తట్టుకునే సోయాబీన్‌కూ కూడా పురుగు పట్టింది. కొన్నిచోట్ల ఎండిపోతుంది. ఆహార ధాన్యాల సాగు 48.13 లక్షల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా 28.61 లక్షల ఎకరాల్లోనే సాగయ్యాయి. వరి 23.07 లక్షల ఎకరాలు అంచనా ఉండగా 8.52 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు.

పీక్ డిమాండ్@9,326 మెగావాట్లు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకు పెరుగుతోంది. కొన్ని జిల్లాల్లో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తుండడంతో డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. దీనికి తోడు గత నెల రోజులకు పైగా సరిగా వర్షాలు లేకపోవడంతో రైతులంతా పంపుసెట్లపైనే ఆధారపడుతున్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా పలు జిల్లాల్లో 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. తొలి దశలో ఉమ్మడి మెదక్, కరీంనగర్, నల్గొండ జిల్లాల్లో వ్యవసాయానికి నిరంతర సరఫరా చేశారు. సమయానుకూలంగా ఒక్కో జిల్లాకు విస్తరిస్తున్నారు. ఫలితంగా రాష్ట్ర చరిత్రలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైంది.

జూలై 31న పీక్ డిమాండ్ 9,326 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. ఆ రోజు 194.680 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా అయ్యింది. ఇదిలా ఉండగా ఆగస్టు 1వ తేదీన 9208 మెగావాట్ల డిమాండ్ నమోదైనా, యూనిట్ల వినియోగంలో కొత్త రికార్డు సృష్టిం చింది. 1వ తేదీన 194.680 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేశారు. అంతకు ముందు ఇదే ఏడాది మార్చి 31న 9191 మెగావాట్ల పీక్ డిమాండ్ రికార్డు కాగా, ఆ రికార్డును తిరగరాశాయి. ప్రస్తుతం ప్రయోగాత్మకంగానే 24 గంటల సరఫరా సాగుతున్నప్పటికీ, వచ్చే రబీ సీజన్ నుంచి అధికారికంగా అమలు చేయనున్నారు. రబీలో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. 10,500 మెగావాట్ల డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్ వ్యవస్థను సిద్ధం చేసారు.

రబీలో సామర్థ్యాన్ని మిం చిన డిమాండ్ నమోదయ్యే అవకాశం ఉంది. జూలై 30 న 187. 820 మిలియన్ యూనిట్లు, పీక్ డిమాండ్ 8809 మెగావాట్లు నమోదు కాగా, జూలై 31న ఏకంగా 500 మెగావాట్ల డిమాండ్ అధికంగా నమోదైంది. మరోవైపు వర్షాభావం, పెరుగుతున్న వ్యవసాయ డిమాం డ్‌ను అందు కోడానికి వీలుగా 500 మెగావాట్ల విద్యుత్‌ను రెండు పూ టలా డిస్కంలు కొనుగోలు చేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లోనే అధికంగా డిమాండ్ నమోదు కావడంతో ఆయా సమయాల్లోనే కొను గోళ్లు చేస్తున్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నీరు లేక జలవిద్యుత్ ఆశలు అడుగంటాయి. భారీ వర్షాలు వస్తే గానీ నీరొచ్చే అవకాశం లేదు.

కాల్పించుకున్న విక్రమ్

(మొదటిపేజీ తరువాయి)

కార్పెంటర్ షేక్ అహ్మద్ (30), కార్పెంటర్ కె.బాబుజాన్ (35), కిరాణా షాప్ యజమాని వెంకటరమణ (29), చాంద్రాయణగుట్టకు చెందిన గౌస్ (35), మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యాపారి రయీస్ ఖాన్ (35),వైఎస్‌ఆర్ జిల్లాకు చెందిన రైతు ఎ.గోవింద్‌రెడ్డి (29)లతో కలిసి తనపై కాల్పులకు ప్లాన్‌కు కు నాలుగు నెలల క్రితమే విక్రమ్‌గౌడ్ ఓ ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. ఎవరెవరు ఏం చేయాలనే విషయమాలపై కూడా పక్కాగా సిద్ధం చేసుకున్నాడు. మొత్తం రూ.50 లక్షలకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్రసాద్ అనే వ్యక్తి ద్వారా విక్రమ్‌గౌడ్‌కు నిందితుడు గోవిందరెడ్డి పరిచయ్యమయ్యాడు. సినిమా అవకాశాలు ఇస్తానని చెప్పి అతన్ని విక్రమ్‌గౌడ్ ప్రలోభపెట్టాడు. కాల్పుల డ్రామాలో భాగంగా గోవిందరెడ్డికి రూ.5లక్షలను విక్రమ్‌గౌడ్ ఇచ్చారు. మరో నిందితుడు నందకుమార్‌ను విక్రమ్‌గౌడ్‌కు పరిచయం చేసింది గోవింద్‌రెడ్డే. ఈ కేసులో నిందితులు జూలై 6న విమానంలో ఇండోర్ వెళ్లారు. రూ.30 వేలతో ఓ తుపాకీ, తూటాలు కొనుగోలుచేశారు.జూలై 8న విక్రమ్‌గౌడ్‌కు ఈ తుపాకీ అందింది. జూలై 17న నిందితులతో కలిసి పుట్టపర్తికి విక్రమ్‌గౌడ్ వెళ్లారు. జూలై 21న విక్రమగ్‌గౌడ్ ఇంట్లోనే ఆయన్ని మరోసారి నిందితులు కలిశారు. తనపై కాల్పులు ఏ విధంగా జరపాలనే ప్లాన్‌ను ఆ రోజే నిర్ణయించుకున్నారు. మూడు రౌండ్లు కాల్పులు జరపాలని విక్రమ్ సూచించాడు. ఒకవేళ తన భార్య కానీ, వాచ్‌మెన్ కానీ వస్తే వారిని బెదిరించేందుకు గాల్లోకి ఓ రౌండ్ కాల్చమని విక్రమ్ వారికి చెప్పాడు.నిందితుల కోసం రూ.30 వేలు ఖర్చు పెట్టి ఓ బైక్ కూడా కొనుగోలు చేశారు. ఆ బైక్ ఇంజిన్, ఛాసిస్ నెంబర్లను నిందితులు చెరిపివేవేశారు. జూలై 26వ తేదీన తనపై కాల్పులు జరిపించేందుకు విక్రమ్ ఆదేశించాడు.ఈ మేరకు ఆపోలో ఆసుపత్రి సమీపంలోని ఓ గెస్ట్‌హౌస్ లోనే నిందితులు బస చేశారు. అయితే కొందరు నిందితులు ఇక్కడి నుంచి వెనక్కి వెళ్లిపోయారు. ప్లాన్ అమలు చేసేందుకు షూటర్ రయీస్ ఖాన్‌ను షేక్ అహ్మద్ పిలిచించాడు. 28వ తేదీ తెల్లవారు జామున నిందితులతో విక్రమ్‌గౌడ్ భేటీ అయ్యాడు.ఘటనకు ముందు నిందితులకు విక్రమ్‌గౌడ్ తన కారులోనే ఇంటి వరకు తీసుకొచ్చారు. వాచ్‌మెన్ తన గదిలోకి వెళ్లిపోగానే వారిని ఇంట్లోకి తీసుకెళ్లారు. తనపై షూట్ చేసిన తర్వాత నిందితులు ఏ మార్గంలో పారిపోవాలో విక్రమ్ గౌడ్ వారికి చెప్పారు. ఆ మార్గాన్ని రెండు సార్లు వారికి చూపించాడు. కాల్పుల అనం తరం ఆతుపాకీని పారవేయదలచిన ప్రాంతాన్ని కూడా విక్రమ్‌గౌడ్ ముందుగానే వారికి చూపించాడు. ముందస్తు ప్లాన్ ప్రకారమే, విక్రమ్‌గౌడ్‌పై రయీస్‌ఖాన్‌రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. మూడో రౌండ్ కాల్చేటప్పుడు రయీస్‌ను పారిపోమ్మని విక్రమ్ ఆదేశించాడు. మొత్తం ఐదు రౌండ్లు బుల్లెట్లు లోడ్ చేశారని చెప్పారు. కాల్పుల అనంతరం నిందితులు రయీస్, షేక్ అహ్మద్‌లు పల్సర్ వాహనంపై పరారయ్యారు. వారు ధరించేందుకు హెల్మెట్లు కూడా విక్రమ్‌గౌడ్ అందజేశారని మహేందర్‌రెడ్డి చెప్పారు. నిందితులు నందకుమార్, షేక్ అహ్మద్, రయీస్ ఖాన్, కె.బాబుజాన్, గోవిందరెడ్డిలను అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో ఎ1 నిందితుడిగా ఉన్న వి క్రమ్ గౌడ్‌ని అదుపులో తీసుకున్నామన్నా రు.మరో ఇద్దరు నిందితులు రమణ, గౌస్‌లు పారారీలో ఉన్నారన్నారు. బుధవారం ఉద యం హకీంపేట చెరువు నుంచి విక్రమ్‌గౌడ్‌పై కాల్చిన తుపాకీని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. విక్రమ్‌గౌడ్ భార్య శిపా లీకి కూడా ఈ ప్లాన్ గురించి విక్రమ్ చెప్పలేదని, ప్రజల సానుభూతి కోసమే విక్రమ్‌గౌడ్ కాల్పుల డ్రామా ఆడారని అన్నారు. 20 19 ఎన్నికల్లో ప్రజాప్రతినిధిగా గెలవాలన్న కోరికతోనే విక్రమ్ తనపై కాల్పుల డ్రా మా ప్లాన్ చేశాడని, ఈ మేరకు ఆయన స్టే మెం ట్ రికార్డు చేశామని మహేందర్‌రెడ్డి చెప్పారు.

విలన్ కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)



మీరు చేయవద్దనే' రీతిలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందన్నారు. మేము ఏం చేసినా పిల్... పిల్లి కాంగ్రెస్ అంటూ.. ఇంత అసహనం ఏ రాష్ట్రంలో లేదని స్పష్టం చేశారు. నీటి పారుదల ప్రాజెక్టులపై 164, సుందిళ్ల బ్యారేజిపై 5 కేసులు, విద్యుత్ శాఖ ప్రాజెక్టులు, ఉద్యోగాలపై 5 కేసులు, హైదరాబాద్ నగరాభివృద్ధిపై 8 కేసులు, ఉద్యోగాల నోటిఫికేషన్లపై 16 కేసులు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్, సింగరేణి డిపెండెంట్, మిషన్ భగీరథపై ఒకటి చొప్పున మొత్తం 196 కేసులు వేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఖరిని మేధావులు, ప్రజలు, జర్నలిస్టులు కూడా నిరసించాలని సిఎం కోరారు. 20రోజుల వ్యవధిలో కాళేశ్వరం ప్రాజెక్టుపై 20 కేసులు వేయగా అన్నీ వీగిపోయాయన్నారు. చిల్లరమల్లర, పనికిమాలిన రాజకీయాల లబ్ధి తప్ప మరేమి లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని చూస్తే జాలి వేస్తోందని, రాజకీయాలు చేయడం రావడం లేదని, వారి వైఖరితో భూమ్‌రంగ్ అవుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో హోంగార్డులు రూ.3 వేల వేతనంతో అర్థాకలితో పనిచేశారని, మేము అధికారంలోకి వచ్చాక రూ.12వేలు ఇస్తున్నామని అన్నారు.

రెగ్యులరైజేషన్ కాదు, కాంట్రాక్టర్ పరిధి నుండి సంస్థల పరిధిలోకి తెచ్చాం : విద్యుత్ సంస్థల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టర్ పరిధి నుండి సంస్థలోకి విలీనం (అబ్జార్వషన్) చేశామే తప్ప అది రెగ్యులరైజేషన్ కాదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. కోర్టు నిర్దేశించిన వేతనం కంటే అన్ని కేటగిరీల ఉద్యోగులకు రూ.1000 ఎక్కువ ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. నిబంధనలకు లోబడి హైకోర్టు తీర్పు ఇచ్చిందని, సుప్రీంకోర్టు గతంలో అందరికీ అవకాశం కల్పించేందుకు రెగ్యులరైజేషన్ కరెక్ట్ కాదని ఇచ్చిన తీర్పును ఉటంకించిందన్నారు. న్యాయస్థానం మానవతా కోణంతో ఆలోచించి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కోర్టు కాంట్రాక్టర్ వ్యవస్థను తొలగించడం పట్ల సిఎం హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను కోర్టు పూర్తిగా సస్పెండ్ చేయలేదన్నారు.

నేరెళ్ల దళితులపై దాడి కాదు : నేరెళ్ల దళితులపై పోలీసులు దాడి చేయలేదని సిఎం అన్నారు. ఏ ప్రభుత్వం దళితులపై దాడి చేయాలని పోలీసులను ప్రోత్సహించదన్నారు. జరిగిన సంఘటనలో 10,11 మందిపై దాడి జరిగితే అందులో ముగ్గురు, నలుగురే దళితులు ఉన్నారని, అది దళితులపై దాడి అని ఎలా అంటారని ఆయన ప్రశ్నించారు. ఇది చాలా చిన్న విషయం.

సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తాం : రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తామని సిఎం తెలిపారు. ఈ మేరకు అన్ని విభాగాల నుండి కాంట్రాక్ట్ ఉద్యోగుల వివరాలు తెప్పిస్తామన్నారు. రెగ్యులరైజేషన్ సాధ్యం కాదని సుప్రీంకోర్టు గతంలో చెప్పిందన్నారు. భవిష్యత్తులో అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేస్తామని సిఎం స్పష్టం చేశారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల విషయంపై కేంద్రంతో సింగరేణి సిఎండి సంప్రదింపులు జరుపుతున్నారన్నారు.

బైసన్‌పోలో ఇస్తామని ప్రధాని హామీ : సచివాలయం, శాసనసభ, కళాభారతి తదితరాలతో పాటు పారడైజ్ నుండి రోడ్డు విస్తరణకు రక్షణ శాఖ నుండి కోరిన భూమిని ఇచ్చేందుకు ప్రధాన మంత్రి హామి ఇచ్చారని కెసిఆర్ తెలిపారు. నియోజకవర్గాలు పెంచినా, పెంచకపోయినా ఒక్కటే. మా పార్టీలో సీట్లకోసం పోటీ లేదని, ఇదే విషయాన్ని ప్రధానికి కూడా వివరించానన్నారు.

శృతిమించి విమర్శిస్తే పరువు నష్టం దావా వేస్తాం : రాజ్యసభ సభ్యుడు జైరాం రమేష్ శృతిమించి విమర్శిస్తే పరువునష్టం దావా వేస్తాం, జీవితంలో సర్పంచిగా గెలిచాడా, రాజ్యసభ బగ్, ప్రజా జీవితాన్ని విస్మరించినందుకు నాకు జాలేస్తుంది. లెఫ్ట్ పార్టీలు ఈ రాష్ట్రంలో ఉన్నాయి, ఏం లెక్క అన్నారు. 300 పార్టీలు, 600 సంఘాలు కలిసి పోటీ చేశాయి. 300 ప్రజా సంఘాలు బలపరిస్తే 350 ఓట్లే వచ్చాయి. డిపాజిట్ దక్కలేదు. రౌండ్ టేబుల్, స్క్వేర్ టేబుల్ సమావేశాలంట. అదో పార్టీ, అదో సంఘమా అన్నారు. సంవత్సరానికి 6 సమ్మెలు కావాలి, మా చర్యలతో అర సమ్మెలకు దిక్కు లేకుండా పోయింది. ఎపి, తెలంగాణలో అసెంబ్లీ సీట్ల పెంచకపోవడానికి ఆయన అజ్ఞానమే అని అన్నారు. నేరెళ్ల ఘటనపై మాజీ లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ వచ్చారని అడగ్గా, మీరా కుమారా, ఓరా కుమారా, ఆమెకు ఓట్లు వస్తే బంగారు తెలంగాణ, బూడిద తెలంగాణ అని అన్నారు. తెలంగాణ ఏర్పాటులో ఆమె కీలక పాత్ర ఉందని ఒక మీడియా ప్రతినిధి అనగా, ఏంది ఆమె చేసిందని పై విధంగా స్పందించారు. కమ్యూనిస్టులకు. జిహెచ్ఎంసి కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లను నేనే పిలిచి వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాం. దీంతో వాళ్ల దుకాణాలు బంద్ అయ్యాయి. సంఘాల ఉనికి పోయాయి. ఎన్నికలలో 0.2, 0.3 మాత్రమే ఓట్లు వస్తాయన్నారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి కూడా మొన్న కూడా ఒక అంశంలో ఏవేవో మాట్లాడారన్నారు. హిమాంశు మోటార్స్‌పై ప్రధాన ఎన్నికల కమిషనర్ భన్వర్‌లాల్‌కు ఫిర్యాదు చేశారని అడగ్గా, ఆ లాల్‌కు ఫిర్యాదు ఎందుకు, గుట్టు బయటపెట్టాలని సవాల్ చేశారు. మేము ఇటువంటి దందాలు చేయడం లేదన్నారు. ఎవరు ఎన్ని వెకిలి,మకిలి ప్రయత్నాలు చేసినా, ఆరు నూరైనా తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోలేరని సవాల్ చేశారు. ఉక్కు సంకల్పంతో, ప్రజల దీవెనలతో ముందుకు వెళ్తామన్నారు.

గూర్ఖాలాండ్‌కు మద్దతుపై పార్టీగా చెబుతాం : టిఆర్ఎస్ పార్టీ చిన్న రాష్ట్రాలకు అనుకూలమని, అయితే గూర్ఖాలాండ్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం సున్నితమైనదని సిఎం కెసిఆర్ అన్నారు. గూర్ఖాలాండ్ అంతర్జాతీయ సరిహద్దులో ఉందన్నారు. ఇప్పటికే చైనా దీని వెనుక ఉందనే వార్తలు వస్తున్నాయన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు తెలుస్తుందన్నారు. ఈ విషయంపై గూర్ఖాలాండ్‌కు మద్దతు ఇవ్వడమా, వ్యతిరేకించడమా వ్యక్తిగతం చెప్పనని, ఈ విషయంపై పార్టీలో చర్చించి పార్టీగా చెబుతామని సిఎం ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

జీవితాంతం లౌకికవాదిని : తాను జీవితాంతం లౌకికవాదినని సిఎం తెలిపారు. ఈ ప్రాంతం సెక్యులర్, దేశంలో ప్రతి ఒక్కరు సెక్యులర్‌గా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఎన్‌డిఎకు దగ్గరౌతున్నారా? బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బిజెపితో కలిసిన తర్వాత సెక్యులరిస్ట్ సిఎంలు ఎవరు?, బిజెపి దక్షిణాదిలో విస్తరించాలనుకుంటున్న క్రమంలో మీ వైఖరి తెలపాలని అడిగిన ప్రశ్నలకు సిఎం సమాధానమిస్తూ, ఎవరితో కలిసి పని చేస్తామనే దాన్ని బట్టి సెక్యులరిజం ఉండదని అన్నారు. ఎన్‌డిఎకు అంశాల వా రిగా మద్దతిస్తున్నామన్నారు. ఎన్‌డిఎ సమీపానికి వెళ్లాలనేది మా మెదడులో లేదని ఆయన అన్నారు.

ఐటి సోదాలు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు బసచేస్తున్న ఈగల్‌టన్ రిసార్టుకు చేరుకున్నారు. రిసార్టులో సోదాలు నిర్వహించలేదని, అందులోని మంత్రి గదిని మాత్రమే తనిఖీ చేశామని, గుజరాత్ నుండి తీసుకొచ్చిన ఎంఎల్‌ఎల గదుల్లో సోదా చేయలేదని అధికారులు తెలిపారు. గుజరాత్‌లో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అహ్మద్ పటేల్ ఈ దాడులను తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల్లో గెలవడానికే బిజెపి ఇలాంటి దుష్టపన్నాగాలు పన్నుతోందని ఆయన మండిపడ్డారు. కేంద్ర పారామిలిటరీ దళాల సాయంతో ఢిల్లీ, కర్నాటకల్లోని మంత్రి శివకుమార్ ఆయన కుటుంబానికి సంబంధించిన మొత్తం 39 ప్రాంగణాల్లో 120 మంది అధికారులు సోదాలు చేపట్టారని ఐటి శాఖ వెల్లడించింది. మరోవైపు రాజ్యసభ ఎన్నికల కోసం చట్ట విరుద్ధ మార్గాల్లో నిధులను సమకూర్చుకున్నారన్న ఆరోపణలపై కూడా అధికారులు విచారణ చేస్తున్నారు. దాడులకు తగిన సమయాన్ని ముందుగానే నిర్ణయించామని వారు చెప్పారు. ఆధారాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఐటి చట్టంలోని సెక్షన్ 132 కింద ఈ సోదాలు చేపట్టామని వారు తెలిపారు. రాజ్యసభ ఎన్నికల కోసం అధికార బిజెపి కుయుక్తులతో క్షుద్ర రాజకీయాలు చేస్తూ ఫిరాయింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ తన ఎంఎల్‌ఎలను గుజరాత్ నుండి ఇక్కడికి తరలించిన సంగతి తెలిసిందే.

సోదాలపై కర్నాటక సిఎం గరం: తమ మంత్రి శివకుమార్ ఇంట్లో ఐటి అధికారుల సోదాలపై కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రంగా మండిపడ్డారు. సోదాలను రాజకీయ ప్రేరేపితమైనవిగా ఆయన అభివర్ణించారు. బిజెపిని వ్యతిరేకించే వారి గొంతు నొక్కేందుకే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదని ఆయన తెగేసి చెప్పారు. మోడీ ప్రభుత్వం తన రాజకీయ కుట్రల కోసం ఐటి శాఖను వినియోగించుకుంటోందని సిద్ధరామయ్య ఆరోపించారు.

పార్లమెంటులో ఐటి సోదాల ప్రకంపనలు: కర్నాటక మంత్రి శివకుమార్ ఇంటిలో ఐటి శాఖ జరిపిన సోదాల అంశం బుధవారం పార్లమెంటులో ప్రకంపనలు సృష్టించాయి. ఉభయసభలూ అట్టుడికిపోయాయి. సోదాలపై విపక్ష కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికలతో సోదాలకు ఎలాంటి సంబంధం లేదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వివరణ ఇచ్చారు. విపక్ష సభ్యుల ఆందోళనలు, నిరసనలతో రాజ్యసభ నాలుగు పర్యాయాలు వాయిదాపడింది. సభా కార్యక్రమాలు సజావుగా ముందుకు సాగకపోవడంతో చివరగా మధ్యాహ్నం 2.45 గంటల ప్రాంతంలో సభను నేటికి వాయిదా వేస్తూ సభాపతి నిర్ణయం తీసుకున్నారు. సభ ప్రారంభంకాగానే తొలుత ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆనంద్ శర్మ లేవనెత్తారు. రాజ్యసభ ఎన్నికలను ప్రభావితం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. రాజ్యసభకు ఎన్నికలు నిర్భయంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరగాలని, అయితే గుజరాత్ ఎన్నికలు ఇలా జరగడం లేదంటూ విపక్ష నేత గులాం నబీ ఆజాద్ అసహనం వ్యక్తం చేశారు. కర్నాటక మంత్రి ఇంటిలో సోదాలను ఇప్పుడే ఎందుకు చేపట్టారు? నెల ముందో లేక నెల తర్వాతో చేపట్టి ఉండవచ్చు కదా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. దీనిపై జైట్లీ స్పందిస్తూ...కర్నాటకకు చెందిన ఒక మంత్రి ఆస్తులపై మాత్రమే దాడులు జరిగాయని, కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు బస చేస్తున్న రిసార్టులో సోదాలు జరగలేదని, ఏ ఒక్క ఎంఎల్‌ఎని కూడా తనిఖీ చేయలేదని ఆయన వివరించారు. అయితే ఆయన వ్యాఖ్యలపై అసంతృప్తితో కాంగ్రెస్ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి చొచ్చుకుపోయారు. దాంతో సభ పది నిమిషాల పాటు వాయిదా పడిన తర్వాత జీరో అవర్ ప్రారంభమయింది. తర్వాత ప్రశ్నోత్తరాల సమయంలోనూ కాంగ్రెస్ సభ్యులు మళ్లీ ఇదే అంశాన్ని లేవనెత్తడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రభుత్వం నియంతలాగా వ్యవహరిస్తోందని మరో కాంగ్రెస్ నేత కపిల్ సిబాల్ మండిపడ్డారు. కర్నాటకలో సోదాల కోసం ఐటి శాఖ అధికారులతో పాటు కేంద్ర బలగాలను పంపడం నిబంధనలను ఉల్లంఘించడమేనని మరో కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ స్పష్టం చేశారు. ఇంతటి గందరగోళం మధ్యే కంపెనీల (సవరణ) బిల్లు–2017ని ప్రవేశపెట్టాలని ఆర్థికశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్‌ని సభాపతి పిజె కురియన్ ఆదేశించారు. తమ వాదన వినకుండా బిల్లుపై చర్చను ఎలా అనుమతిస్తారని జైరాం రమేష్ (కాంగ్రెస్) ప్రశ్నించారు. దీంతో మధ్యాహ్నం 2.45 గంటల ప్రాంతంలో సభ గురువారానికి వాయిదా పడింది. మరోవైపు ఇదే అంశంపై లోక్‌సభ నుండి కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు.

కాంగ్రెస్ సభ్యుడు మల్లిఖార్జున్ ఖర్గే ఈ అంశాన్ని సభలో లేవనెత్తారు. గుజరాత్ కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు బసచేస్తోన్న కర్నాటకలోని రిసార్టులో ఐటి అధికారులు సోదాలు చేపట్టలేదని జైట్లీ అందుకు బదులిచ్చారు. తమ పార్టీని, నాయకులను లక్ష్యంగా చేసుకుని సిబి ఐ, ఇడి, ఐటి లాంటి దర్యాప్తు సంస్థలను ప్రభుత్వం వినియోగించుకుంటోందని కాంగ్రెస్ సభ్యులు చేసిన ఆరోపణలపై ఆయన స్పం ది స్తూ...ఇది వినియోగమా? లేక దుర్వినియోగమా? అనేది సోదాల ద్వారా స్వాధీనం చేసుకునే సొ త్తు, పత్రాలే స్పష్టం చేస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సభ్యులు ఆరోపిస్తున్నట్లుగా సోదాలకు గుజరాత్‌లో జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. అయితే ఆయన వివరణకు సంతృప్తిచెందని కాం గ్రెస్ సభ్యులు ఖర్గే నేతృత్వంలో సభ నుండి వాకౌట్ చేశారు.

తుది కౌన్సెలింగ్

(మొదటిపేజీ తరువాయి)

సీటు పొంది కళాశాలల్లో రిపోర్ట్ చేయనివారు, ధృవపత్రాల పరిశీలన పూర్తయి, ఆప్షన్లు నమోదు చేసుకున్నా సీట్లు లభించని అభ్యర్థులు తుది విడతలో ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. అలాగే తొలి విడతలో సీటు పొంది ఫీజు చెల్లించి, కళాశాలల్లో రిపోర్ట్ చేసి, మెరుగైన కళాశాల/కోర్సుకు మారాలనుకునే అభ్యర్థులు తుది విడత కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు.

నాకు నచ్చని పదాల్లో సమ్మె ఒకటి : రజనీకాంత్



చెన్నై : సమ్మె విరమించాలంటూ తమిళ చిత్ర పరిశ్రమ సిబ్బందికి సూపర్‌స్టార్ రజనీకాంత్ బుధవారం విజ్ఞప్తి చేశారు. వేతనాల విషయంలో నిర్మాతల మండలితో నెలకొన్న విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. దక్షిణ భారత చలనచిత్ర ఉద్యోగుల సమాఖ్య (ఎఫ్ఇఎఫ్ఎస్ఐ) ఇచ్చిన పిలుపు మేరకు సిబ్బంది చేస్తున్న సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో సమ్మె విరమించాలంటూ తలైవ విజ్ఞప్తి చేయడం గమనార్హం. మరోవైపు బేషరతు చర్చలకైతేనే తాము ఒప్పుకుంటామని ఎఫ్ఇఎఫ్ఎస్ఐ స్పష్టం చేస్తోంది. 'నాకు నచ్చని పదాల్లో సమ్మె ఒకటి. వ్యక్తిగత అహాలకు తావీయకుండా మంచిని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగితే ఎలాంటి సమస్యకైనా పరిష్కారం లభిస్తుంది' అంటూ ప్రస్తుతం 'కాలా' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న రజనీ తనదైన శైలిలో ఒక ప్రకటనను విడుదల చేశారు. ఆమోదయోగ్య పరిష్కారం లభించేలా త్వరగా చర్చలు జరపాలని ఎఫ్ఇఎఫ్ఎస్ఐ, తమిళ చలనచిత్ర నిర్మాతల మండలి (టిఎఫ్‌పిసి)లకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఒక సీనియర్‌ఆర్టిస్టుగా వినయపూర్వకంగా అభ్యర్థిస్తున్నానని ఆయన చెప్పారు. మరోవైపు బేషరతు చర్చలకు రావాలని టిఎఫ్‌పిసిని ఎఫ్ఇఎఫ్ఎస్ఐ అధ్యక్షుడు, దర్శకుడు ఆర్‌కె సెల్వమణి కోరారు.

వరంగల్‌లో 'స్పైస్' ఏజెన్సీ : కేంద్రం

మన తెలంగాణ/ న్యూఢిల్లీ: వరంగల్‌లో స్పైస్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బుధవారం రాజ్యజభలో కాంగ్రెస్ ఎంపి రేణుకాచౌదరి అడిగిన ప్రశ్నకు ఆమె లిఖితపూర్వ కంగా సమాధానం ఇచ్చారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్థలం ఇస్తే స్పైస్ పార్క్ ఏర్పాటు చేస్తామని తెలంగాణ ప్రభుత్వానికి సమాచారమిచ్చినట్లు వెల్లడించారు. మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాలపై పరిశోధన, ఉత్పత్తి, మార్కెటింగ్, నాణ్యత మెరుగుపర్చడం. ఎగుమతులు చేయడంపై వరంగల్ లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయదలచిన స్పైస్ డెవల్మెంట్ ఏజెన్సీ పనిచేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. తెలంగాణలో మిర్చి, పసుపు రైతులకు కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తోందని అన్నారు. మిర్చి, పసుపు పంటలు ఎగుమతి చేయడానికి కాలసిన నాణ్యతకు తగ్గట్టు ఉత్పత్తి, మార్కెటింగ్ కోసం పథకాలు రూపొందిం చామని కూడా వెల్లడించారు.అనేక ఏళ్లుగా అమలుకు నోచుకోని పసుపు బోర్డు ఏర్పాటుకు కేంద్రప్రభుత్వంచర్యలు చేపట్టాలని ఎంపీ కవిత పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్నికోరారు.

రేప్ చేయబోతే నాలుక కొరికేసింది

తిరువనంతపురం: లైంగిక దాడికి యత్నించిన ఓ వ్యక్తి నాలుకను ఓ మహిళ కొరికేసిన ఘటన కేరళలోని కోచిలో బుధవారం చోటుచేసుకుంది. అనంతరం ఆమె అతనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తాను కొరికేసిన దాదాపు రెండు సెంటీమీటర్ల నాలుక ముక్కను పోలీసులకు అందజేసింది. ఈ మేరకు పోలీసులు అతనిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కోచిలో ఓ మహిళ తన ఇంటి నుంచి బయటకు రాగా, పొరుగింటికి చెందిన వ్యక్తి ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. ఆమెను బలవంతంగా ముద్దు పెట్టుకునే క్రమంలో అతని నాలుకను ఆమె కొరికేసింది. ఆ వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్రమత్తమైన పోలీసులు నగరంలోని అన్ని ఆసుపత్రుల్లో తనిఖీలు చేశారు. చివరకు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సర్జరీ కోసం చేరిన అతడిని పట్టుకున్నారు. బైక్ ప్రమాదంలో తన నాలుక తెగిపోయిందని అబద్ధం చెప్పి చేరినట్టు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. సర్జరీ అనంతరం డిశ్చార్చ్ కాగానే అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

పార్టీలపై ఫిర్యాదుల విచారణకు బెంచ్

న్యూఢిల్లీ: ఆరు జాతీయ రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫిర్యాదులను విచారించేందుకు సమాచార శాఖ ప్రధాన కమిషనర్ (సిఐసి)ఆర్‌కె మాథుర్ విస్తృత బెంచ్ ఏర్పాటు చేశారు. శ్రీధర్ ఆచార్యులు నేతృత్వంలో జులై 22 వరకు పనిచేసిన త్రిసభ్య ప్యానెల్ స్థానంలో ఈ బెంచ్ పని చేస్తుంది. ఈ ప్యానెల్‌లోని ఒక సభ్యుడైన బిమల్ జుల్కా పని వత్తిడి కారణంగా ప్యానెల్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకోవడంతో తదుపరి ప్రకటన వచ్చే వరకు ప్యానెల్‌ను నిలుపుదల చేశారు. ఆశ్చర్యకరంగా ఈ ప్యానెల్‌లోని ఒక సభ్యుడు కూడా గత ఐదు మాసాల వ్యవధిలో ఎలాంటి విచారణ జరపలేదు. అంతకు ముందు ఆచార్యులు మావన వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖకు సంబంధించి కేసులను చేపట్టేవారు. నూతన బెంచ్‌లో మాథుర్‌తో పాటు సమాచార కమిషనర్లు శరత్ సబర్వాల్, మంజుల ప్రాసర్, దివ్య ప్రకాశ్ సిన్హాలు ఉన్నారు. కమిషన్ ఆదేశాల మేరకు ఈ బెంచ్ ఆగస్టు 16 నుంచి విచారణ ప్రారంభిస్తుంది. బెంచ్ ఇప్పటికే ఆరు జాతీయ పార్టీలకు నోటీసులు జారీ చేసింది.

మాజీమంత్రి మోహన్ దేవ్ కన్నుమూత

సిల్చార్: కేంద్ర మాజీమంత్రి, అలనాటి కాంగ్రెస్ దిగ్గజం సంతోష్ మోహన్ దేవ్(86) కన్నుమూశారు. దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతున్న దేవ్ బుధవారం ఉదయం సిల్చార్‌లోని ఓ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచినట్లు ఆయన కుటుంబీకులు తెలిపారు. ఆయనకు భార్య బితికా దేవ్, నలుగురు కుమార్తెలు ఉన్నారు. బితికా దేవ్ మాజీ ఎంఎల్ఎ కాగా, కుమార్తెల్లో ఒకరైన సుష్మితా దేవ్ ప్రస్తుతం కాంగ్రెస్ ఎంపిగా ఉన్నారు. సుదీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంతోష్ మోహన్ దేవ్‌కు న్యుమోనియా వ్యాధి తీవ్రతరం కావడంతో ఇటీవలే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 6.06 గంటలకు మృతి చెందారు. మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని మొదటి యుపిఎ ప్రభుత్వ హయాంలో దేవ్ భారీ పరిశ్రమలశాఖ మంత్రిగా పనిచేశారు. 1980 నుంచి ఏడుసార్లు ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు.

ఆర్‌టిఐ పరిధిలోకి సిజెఐ, గవర్నర్ ఆఫీసులు రావు : కేంద్రం

న్యూఢిల్లీ : భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ), గవర్నర్ కార్యాలయాలు సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కిందకు రావని బుధవారం కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వ సంస్థలు, ప్రజా ప్రాధికార సంస్థల నుంచి పాలనకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాన్ని రాబట్టేందుకు ఈ చట్టం ద్వారా పౌరులకు హక్కు లభించింది. అయితే కేంద్ర సమాచార కమిషన్‌లోని రికార్డుల్లో భారత ప్రధాన న్యాయమూర్తి, గవర్నర్ కార్యాలయాలను ప్రజాప్రాధికార సంస్థల కిందకు రావని లోక్‌సభలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

పన్సారే హంతకులపై భారీ రివార్డు

ముంబయి: కమ్యూనిస్టు నేత గోవింద్ పన్సారే హత్యకేసులో పరారీలో ఉన్న ఇద్దరు ప్రధాన నిందితులకు సంబంధించిన సమాచారాన్ని అందించినవారికి రూ. 10 లక్షల రివార్డును మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఓ సీనియర్ అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. 2015, ఫిబ్రవరి 16న కోల్హాపూర్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో పన్సారే దంపతులపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ కాల్పుల ఘటనలో గోవింద్ భార్య ప్రాణాలతో బయటపడగా, ప్రముఖ సిపిఐ నేత ముంబయి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాలుగు రోజుల తరువాత మృతిచెందారు. పన్సారే హత్య కేసులో ప్రధాన నిందితులైన సనాతన్ సంస్థ కార్యకర్తలు వినయ్ పవార్, సారంగ్ అకోల్కార్‌లకు సంబంధించి ప్రత్యేక సమాచారాన్ని ఎవరైతే అందిస్తారో వారికి రూ. 10 లక్షల రివార్డును ప్రభుత్వం ప్రకటించిందని కోల్హాపూర్ రేంజ్ ఐజి విశ్వాస్ నాంగ్రె పాటిల్ పేర్కొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

పాట్నా : బీహార్‌లో సరుకు రవాణా రైలు తపట్టాలు తప్పింది. తూర్పు మధ్య రైల్వే జోన్ (ఇసిఆర్) ముఘల్‌సరాయ్ డివిజన్ పరిధిలోని గయా సెక్షన్ కర్మనాస,ధనాయ్‌చా మధ్య గూడ్స్ రైలుకు చెందిన 20 బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో మా మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఘటన నేపథ్యంలో ఆ మార్గం గుండా వెళ్లే పలు రైళ్లను దారి మళ్లించినట్లు ఇసిఆర్ పౌర సంబంధాల ముఖ్య అధికారి (సిపిఆర్ఒ) రాజేశ్ కుమార్ తెలిపారు. కర్మనాస, ధనాయ్‌చా మార్గంలో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించేందుకు పట్టాలు తప్పిన గూడ్స్ రైలు బోగీలను తొలగించే పనిలో రైల్వే ఉద్యోగులు నిమగ్నమై ఉన్నట్లు ఆయన చెప్పారు. ముఘల్‌సరాయ్ డివిజన్ ఇసిఆర్‌లో భాగంగా ఉంది. దాని ప్రధాన కార్యాలయం వైశాలి జిల్లా హాజీపూర్‌లో ఉంది.

నితీశ్‌పై నిరసనాస్త్రం

- 5 నుంచి బీహార్ వ్యాప్తంగా శరద్ పర్యటన
- 27న జరిగే ఆర్‌జెడి ర్యాలీకి హాజరు



రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) ఈ నెల 27న నిర్వహిస్తున్న 'బిజెపి హటావ్ దేశ్ బచావ్' ర్యాలీకి జనతాదళ్ (యునైటెడ్) పార్లమెంటరీ పార్టీ నాయకుడు శరద్ యాదవ్ హాజరు కానున్నారు. తమ నాయకుడు నితీశ్ కుమార్ భారతీయ జనతా పార్టీ (బిజెపి) తో చేతులు కలపడంపట్ల ఆయన గుర్రుగా ఉన్నారు. గత నెల 26న బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అర్ధంతరంగా ఆర్‌జెడి, కాంగ్రెస్‌తో కలిసి ఏర్పడిన తమ కూటమి (మహాఘట్ బంధన్) ను చీల్చి మరునాడే బిజెపితో కలిసి కొత్త ప్రభుత్వానికి ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటి నుండి ఆర్‌జెడి నేత లాలూ ప్రసాద్ యాదవ్ తనకు సహాయ పడాల్సిందిగా సీనియర్ జెడియు నాయకులను కోరుతున్నారు. బీహార్‌లో, తక్కిన దేశంలోంచి మతతత్వ శక్తులను తరిమివేయడం తన లక్ష్యంగా లాలూ చెప్పుకుంటున్నారు. పాట్నాలో జరగనున్న జనతాదళ్ (యు) ర్యాలీకి హాజరయ్యే ముందు వరుసగా అనేక కార్యక్రమాలకు శరద్ యాదవ్ సంకల్పించారు. ఈ విషయాన్ని జెడి(యు) ప్రధాన కార్యదర్శి అరుణ్ శ్రీ వాస్తవ ఒక న్యూస్ పోర్టల్‌కు తెలిపారు. ఈ నెల 5 నుంచి నాలుగు లేదా ఐదు రోజులపాటు శరద్ యాదవ్ బీహార్ మొత్తంలో పర్యటిస్తారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను సాధారణ ప్రజలను కలుసుకొని చర్చిస్తారు. బిజెపితో జెడి (యు) చేతులు కలిపినందుకు ప్రజలు నిస్పృహతో ఉన్నారని శ్రీవాస్తవ తెలిపారు. పాట్నాలో జనతాదళ్ (యు) జాతీయ కార్యవర్గం సమావేశం కావడానికి రెండు రోజుల ముందు శరద్ యాదవ్ ప్రతిపక్షాల సమావేశంలో ప్రసంగిస్తారు. ఈ సమావేశం ఈ నెల 17న 'ఢిల్లీ రాజ్యాంగ క్లబ్' ఆధ్వర్యంలో జరుగుతుంది. ఆ ప్రసంగంలో ఆయన బీహార్ పరిణామాలు, తన కార్యాచరణ వివరాలను అందిస్తారు. ఈ సమావేశాన్ని 'సాఝి విరాసత్' గ పిలుస్తున్నారు. మత సామరస్యం, ప్రజాస్వామ్యాన్ని గట్టిగా సూచించే పదం అది. దాని అర్థం 'ఉమ్మడి వారసత్వం'. నితీష్ కుమార్ నిర్ణయం తర్వాత కొద్ది రోజులపాటు శరద్ యాదవ్ బీహార్ నాటకంపై వ్యాఖ్య చేయకుండా మౌనం పాటించారు. అయితే గత నెల 31న ఆయన గొంతు విప్పారు. 'ఇప్పుడు ఏర్పడిన పరిస్థితి సంతోషకరంగా లేదు' అన్నది విలేకరులతో ఆయన చేసిన వ్యాఖ్య. 'మా మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం మహాఘట్ బంధన్ కూటమికి 11 కోట్ల మంది బీహార్ ఓటర్లు అధికారం ఇచ్చారు. ఆ కూటమి ఇలా పతనం కావడంపట్ల నేను చాలా నిరాసలో మునిగిపోయాను. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటే అన్నిటికీ మించి కట్టుబడాల్సిన ముఖ్య విషయం. ఆ కూటమి పతనం అవ్వాల్సింది కాదు. ఆ పరిణామంపట్ల నేను చాలా విచారిస్తున్నాను. పార్టీ వారితో ఇంతకు మించి ప్రస్తుతం నేడు మాట్లాడలేను' అని శరద్ యాదవ్ అన్నారు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, గుజరాత్, మహారాష్ట్ర, హర్యానా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, నాగాలాండ్ రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు నితీష్ కుమార్‌కు తమ ఆవేదనను, బిజెపితో కత్తు కలిపినందుకు వినిపిస్తున్న ప్రజాగ్రహాన్ని తెలుపుతూ లేఖలు రాశారని శ్రీవాస్తవ వెల్లడించారు. త్వరలో మరింతగా రాష్ట్రాల పార్టీ శాఖలు నితీష్ కుమార్ నిర్ణయానికి వ్యతిరేకంగా వెల్లడవుతున్న ప్రజాగ్రహంతో గొంతు కలిపనున్నారని ఆయన చెప్పారు.

కొత్త పార్టీ?

పాట్నా: జెడి(యు) సీనియర్ నేత శరద్ యాదవ్ కొత్త పార్టీని స్థాపించవచ్చని ఆయన అత్యంత సన్నిహితుడొకరు బుధవారం సూచనగా వెల్లడించారు. యాదవ్ కొత్త పార్టీని ఏర్పాటు చేసినప్పటికీ, ఆయన బీహార్ మహాకూటమిలోనే కొనసాగుతారని అన్నారు. జెడి (యు) విశిష్ట ప్రధాన కార్యదర్శి, యాదవ్‌కి మరో విశ్వాసపాత్రుడైన కెసి త్యాగి మాట్లాడుతూ...కొత్త పార్టీ ప్రతిపాదనను ఒక వదంతిగా ఆయన కొట్టిపారేశారు. కాగా, మహాకూటమిలోని మిత్రపక్షాలు ఆర్‌జెడి, కాంగ్రెస్‌లను కాదని ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బిజెపితో చేతులుకలపడంతో ఆయనకి, యాదవ్‌కి మధ్య సంబంధాలు బెడిసికొట్టాయి. యాదవ్ నమ్మిన బంటు, జెడి (యు) మరో సీనియర్ నేత విజయ్ వర్మ మాట్లాడుతూ.... పాత మిత్రులతో శరద్‌జి సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితిని ఆయన క్షుణ్ణంగా తెలుసుకుంటున్నారు. కొత్త పార్టీ ఏర్పాటు అనేది ఒకానొక అవకాశం మాత్రమేనని ఆయన చెప్పారు. అయితే కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో యాదవ్ మంత్రిగా చేరే ప్రసక్తేలేదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు లౌకికవాద పార్టీలతో ఏర్పాటైన మహాకూటమిలోనే తాను కొనసాగుతానని యాదవ్ చెబుతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిలను కలిశానని మాధీపుర నుండి యాదవ్ ఫోన్‌లో పిటిఐ వార్తా సంస్థకు తెలిపారు.



పార్లమెంట్‌లో బుధవారంనాడు ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీకి వీడ్కోలు విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ సుమిత్రా మహాజన్, ప్రధాని మోడీ వారికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

ఎంపిలకు వెంకయ్య లేఖ



న్యూఢిల్లీ: కేంద్ర మాజీ మంత్రి, ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎం. వెంకయ్య నాయుడు ఎంపిలందరికీ లేఖ రాశారు. ఎన్‌డిఎ తరపున ఉపరాష్ట్రపతి ఎన్నికల బరిలో ఉన్న వెంకయ్య, తన అభ్యర్థిత్వానికి ఎంపిలందరూ మద్దతు ఇవ్వాలని లేఖలో కోరారు. ప్రజా జీవితంలో తన రాజకీయ ప్రస్థానాన్ని ఆయన ఈ లేఖలో పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే భారత రాజ్యాంగ సూత్రాల్లో న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సమాజం, జాతీయ ఐక్యత, ఏకీకరణ విలువలు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను ఇనుమడింపజేసేలా ప్రయత్నిస్తానని లేఖలో తెలిపారు. సహకార సమాఖ్య సిద్ధాంతాలపై తనకు ధృడమైన విశ్వాసం ఉందని అన్నారు. ముందు సంవత్సరాల్లో కొత్త ఆధునిక భారత్‌గా నిర్మించేందుకు రాజ్యసభ మరింత ముఖ్యమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. దేశంలో పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక, లింగ వివక్ష, అవినీతి, రాజకీయ ద్వేషాలను అధిగమించవల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. పార్లమెంటు బాధ్యత, పాత్రలపై తనకు పూర్తిగా అవగాహన ఉందని, తన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో హక్కులు, బాధ్యతలు, చట్టసభ సభ్యులు, ఎంపిల అధికారాలపై కూడా తనకు అవగాహన ఉందని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశాన్ని అభివృద్ధిపథంలో ముందుకు నడిపించడంలో పార్లమెంటు సహా అన్ని ప్రభుత్వాలు తమవంతు పాత్రను పోషించాయని, కానీ, అది ఇంకా పూర్తి చేయాల్సి ఉందన్నారు.

కిషన్‌గంగా, రాట్లే ప్రాజెక్టులకు ఓకే

వాషింగ్టన్: జీలం, చీనాబ్ ఉపనదులపై జలవిద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు భారత్‌కు అనుమతి లభించింది. కిషన్‌గంగా, రాట్లే ప్రాజెక్టుల నిర్మాణానికి భారత్‌కు అనుమతిని ఇస్తున్నట్లు ప్రపంచబ్యాంకు తెలిపింది. 1960 సింధు జలాల ఒప్పందం (ఐడబ్ల్యుటి) పరిధిలో కొన్ని నిర్దిష్ట ఆంక్షల మేరకు ఈ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు వీలేర్పడింది. ఒప్పందంపై భారత్, పాకిస్థాన్ మధ్య కార్యదర్శుల స్థాయి చర్చల తరువాత ప్రపంచ బ్యాంక్ నుంచి ప్రకటన వెలువడింది. ఇరు దేశాల మధ్య పలు అంశాలలో ఉద్రిక్తతలు, ఉగ్రవాదదాడులు, చొరబాట్లు సాగుతున్న సమయంలోనే జలవిద్యుత్ ప్రాజెక్టులపై సామరస్య పరిష్కారం కుదిరింది. జమ్మూ కశ్మీర్‌లో ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి పాకిస్థాన్ నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. 330 మెగావాట్ల కిషన్‌గంగా, 850 మెగావాట్ల రాట్లే ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని భారతదేశం తలపెట్టింది. దీనిపై పాకిస్థాన్ అభ్యంతరాలను వాస్తవ పరిస్థితుల నివేదికలో ప్రపంచబ్యాంక్ తెలిపింది.ఈ ప్రాజెక్టుల సాంకేతిక నమూనాలలో ఒప్పందం దెబ్బతింటుందనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఈ ఒప్పందం మేరకు ఈ రెండు ఉప నదులు , సింధునదితో పాటు పశ్చిమ నదులుఅని, జలాల వినియోగంపై పాకిస్థాన్‌కు ఆంక్షలు లేవని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. ఈ దశలో నిర్థిష్ట ఆంక్షలను పాటించి భారతదేశం ఈ జలవిద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసుకోవచ్చునని, ఒప్పందంలోని అనుబంధ నిబంధనలలోనే ఈ అంశాలు ఉన్నాయని ప్రపంచబ్యాంక్ తెలిపింది. ఈ వారంలో రెండు దేశాల మధ్య సృహద్భావ వాతావరణంలో సాంకేతిక అంశాలపై చర్చలు జరిగాయని, ఇందులో పరస్పర సహకార స్ఫూర్తి కనబడిందని ప్రపంబ్యాంక్ తెలిపింది.ఇరు పక్షాలూ ఇప్పటికీ ఓ అంగీకారానికి వచ్చాయని, పూర్తిస్థాయిలో చర్చలకు సెప్టెంబర్‌లో వాషింగ్టన్ డిసిలో మరో మారు సమావేశం ఉంటుందని ప్రకటనలో తెలిపారు. ఇరు పక్షా వాదనకు సంబంధించి మధ్యవర్తిగా ఉన్న ప్రపంచబ్యాంక్ సుదీర్ఘ నివేదికను వెలువరించింది. సాంకేతిక అంశాల పరిష్కారానికి మధ్యవర్తిత్వపు కోర్టు ఏర్పాటుకు పాకిస్థాన్ ప్రతిపాదించింది. తటస్థ నిపుణుడి ఏర్పాటుతో పాకిస్థాన్ వెలిబుచ్చిన సాంకేతిక అంశాల పరిష్కారానికి వీలవుతుందని భారత్ తెలిపింది.

ప్రపంచబ్యాంక్ కీలక పాత్ర

తొమ్మిది ఏళ్ల సుదీర్ఘ చర్చల తరువాత భారత్ పాకిస్థాన్ మధ్య 1660లో సింధు జలాల ఒప్పందం కుదిరింది. ప్రపంచబ్యాంక్ ఇందులో కీలక పాత్ర పోషించింది.ఒప్పందంపై సంతకాలు కూడా చేసింది. అయితే ఉపనదులపై ప్రాజెక్టుల ఏర్పాటు అంశం కీలకంగా మారింది. విభేదాలు, వివాదాలు కేవలం ఆయా దేశాల ప్రజల ప్రయోజనాల అంశాలపైనే నెలకొన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణ ప్రక్రియలో తమ నిష్పక్షపాత, తటస్థ సహకారం ఉంటుందని గత నెల 25న అమెరికాలో భారత రాయబారి నవ్‌తేజ్ సర్నాకు ప్రపంచబ్యాంక్ హామీ ఇచ్చింది.

గోప్యత హక్కుపై తీర్పును రిజర్వు చేసిన సుప్రీం బెంచ్

న్యూఢిల్లీ: వ్యక్తిగత గోప్యత హక్కు అనేది ప్రాథమిక హక్కా? కాదా? అనే అంశంపై విచారణ చేపడుతున్న 9 మంది న్యాయమూర్తుల సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం తీర్పును బుధవారం రిజర్వు చేసింది. ప్రస్తుత సాంకేతిక శకంలో పారదర్శకత అనేది కీలకమైన అంశమని, వ్యక్తిగత సమాచారాన్ని అందివ్వడం గోప్యత హక్కు పరిధిలోకి రాదని గుజరాత్ ప్రభుత్వం తొలుత సుప్రీంకోర్టుకు వివరించింది. ఈ నేపథ్యంలో ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహార్ నేతృత్వంలోని 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసులో తన తీర్పును రిజర్వు చేసింది. ఇదే కేసులో గుజరాత్ ప్రభుత్వం తరపున కోర్టుకు హాజరైన సీనియర్ అడ్వొకేట్ రాకేశ్ ద్వివేది మాట్లాడుతూ.. గోప్యతకు సంబంధించిన కొన్ని అంశాలు పలు ప్రాథమిక హక్కులతో సంబంధాన్ని కలిగి ఉండొచ్చు. కానీ, ప్రస్తుత సాంకేతిక శకంలో మరింత పారదర్శకతను తీసుకురావాల్సిన పరిస్థితి దృష్ట్యా కొన్ని నిర్దిష్టమైన సంస్థలకు వ్యక్తిగత సమాచారాన్ని అందివ్వడం అవసరమని ఆయన అన్నారు.
ఎవరైనా ఒక లిటిగెంట్ పిల్ వేయాలనుకున్నపుడు సుప్రీంకోర్టు సదరు వ్యక్తికి సం బంధించిన పేరు, చిరునామా, ఫోన్ నంబరు, వృత్తి, గుర్తింపు కార్డులు లాంటి వాటిని కోరుతుందన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే వ్యక్తిగత సమాచారాన్ని ఉద్దేశిత కార్యానికి మాత్రమే ఉపయోగిం చాలని చెబుతూ ఈ కేసులో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

నోటాపై కాంగ్రెస్ పిటిషన్ విచారణకు స్వీకరణ

న్యూఢిల్లీ: త్వరలో గుజరాత్ రాజ్యసభ సీట్లకు జరగనున్న ఎన్నికల్లో 'పైదేది కాదు'(నోటా) అన్న ఐచ్ఛికాన్ని ఉపయోగించనున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ గుజరాత్ కాంగ్రెస్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం విచారణకు స్వీకరించింది. దీనిని అత్యవసరంగా విచారించాలని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పెట్టుకున్న వినతిని న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం అంగీకరించింది. రాజ్యాంగంలో నోటాకు సంబంధించి చట్టబద్ధ అంశం ఏదిలేదని సిబల్ సుప్రీంకోర్టుకు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లలో(ఇవిఎమ్) నోటా ఐచ్ఛికాన్ని తప్పనిసరి పెట్టాలని 2013లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పడంతో రాజ్యసభ ఎన్నికల్లో నోటాను ఉపయోగించాలని 2014 జనవరిలోనే అమలు ఆదేశాలు జారీచేయడం చేయడం జరిగిందని ప్రభుత్వ అధికారులు చెప్పారు. ఇదిలా ఉండగా ఇదే అంశంపై బిజెపి కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాజ్యసభ ఎన్నికల్లో నోటాను తీసివేయాలని కోరింది.

ఎన్నికల కమిషనర్ల ఎంపికకు కొలీజియం యోచన లేదు

న్యూఢిల్లీ: ఎన్నికల సంస్కరణల నివేదికలో లా కమిషన్ చేసిన సిఫార్సులో భాగంగా ఎన్నికల కమిషనర్ల నియామకానికి 'కొలీజియం' విధానాన్ని ప్రవేశపెట్టే ప్రతిపాదన ఏది లేదని ప్రభుత్వం బుధవారం తెలిపింది. చీఫ్ ఎలెక్షన్ కమిషనర్, ఎలెక్షన్ కమిషనర్లను ఎంపిక చేసే ముసాయిదా చట్టాన్ని తెచ్చే యోచన కూడా ఇప్పుడేది లేదని ప్రభుత్వం పేర్కొంది. భవిష్యత్తులో ఎలెక్షన్ కమిషనర్లను నియమించేందుకు కొలీజియం విధానాన్ని ప్రవేశపెట్టే ప్రతిపాదన ఉందా? అని అడిగిన ప్రశ్నక న్యాయశాఖ సహాయ మంత్రి పి.పి.చౌదరి లోక్‌సభకు ఇచ్చిన తన లిఖితపూర్వక సమాధానంలో అలాంటిదేది లేదని అన్నారు. చీఫ్ ఎలెక్షన్ కమిషనర్, ఎలెక్షన్ కమిషనర్ల ఎంపిక ప్రక్రియలో ముసాయిదా చట్టాన్ని చేసే ముందు అన్ని పక్షల సలహాను కేంద్రం తీసుకుంటుందా? అన్న ప్రశ్నకు జవాబుగా ప్రభుత్వం అలాంటి ప్రతిపాదనేది పరిశీలించడం లేదని అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ల ఎంపికకు కొలీజియం పద్ధతిని ఇదివరకటి ఎన్నికల ప్రధానాధికారి నసీమ్ జైదీ కూడా సమర్థించారు.

తల్లిపాలు అందక ఏటా లక్ష మంది మృతి



న్యూయార్క్: శిశువుకు తల్లి స్థన్యం పాలు భారతదేశానికి చేసే మేలు ఇంతా అంతా కాదు. రేపటి పౌరుల భారత ప్రాణం నిలిపి, దేశ ఆర్థిక స్థితికి ఊతం అందిస్తుంది. ఈ కీలక అంశం ఐక్యరాజ్య సమితి నివేదికలోనే వెల్లడైంది. సరైన రీతిలో తల్లిపాలు అందకపోవడంతో భారతదేశంలో ఇప్పుడు ఏటా లక్ష మంది బాలలు అకాలమృత్యువు పాలవుతున్నారు. చిన్నతనంలో సరైన రీతి లో తల్లి పాలు లేక వ్యాధినిరోధక శక్తిలేక జవసత్వాలు ఉడిగిన పిల్లల వ్యాధుల నివారణ, శిశుమరణాల వంటి పరిణామాలతో భారతదేశ ఖజానాకు రూ 1400 కోట్ల మేర గండిపడుతోందని ఐరాస బాలల నిధి, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్త నివేదికలో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా స్తన్యపాల పోషణ తీరు తెన్నుల అంశంపై ఈ విశ్లేషణ వెలువడింది. యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థలకు గ్లోబల్ బ్రెస్ట్‌ఫీడింగ్ కలెక్టివ్ సంస్థ సహకారం అందించింది.శిశువుకు తల్లి స్థన్యం పాలతో వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ప్రత్యేకించి కలరా, న్యూమోనియా వంటి తీవ్రవ్యాధులు కబళించకుండా ఉంటాయి. పిల్లల చావులకు ఇవే ప్రధాన కారణం అవుతున్నాయి. ఇక తల్లి క్రమం తప్పకుండా పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల తల్లులకు కూడా గర్భాశయ వ్యాధులు రాకుండా ఉంటాయి. ప్రాణాంతక రొమ్ము క్యాన్సర్ నివారించవచ్చు. పేదల మహిళలు అత్యధికంగా ఈ రెండు వ్యాధులతోనే మృతి చెందుతున్నారు. పేదరికం తగ్గిందనే వాదనలు తప్ప వాస్తవం వేరే విధంగా ఉండే గ్రామీణ భారతంలో తల్లిపాల సేవనం తగ్గిపోవడం మరింత చేటును కల్గిస్తోంది. చైనా, నైజీరియా, మెక్సికో, ఇండోనేషియాతో పాటు ఎందరో కన్నతల్లులు గల మహా భారతదేశంలో స్థన్యం పాలు లేక ఏటా శిశువులు అసువులు బాస్తున్నారనేది దాచేస్తే దాగని సత్యంగా మారింది. ప్రతి ఏటా ఈ పరిణామంతో ఈ మొత్తం దేశాలలో కలిపితే మొత్తం 2,36,000 మంది పొత్తిళ్ల ప్రాయంలోనే కన్నుమూస్తున్నారు. ఇప్పటి శిశువులే రేపటి బాలలు తరువాతి పౌరులు కావడంతో ఈ దేశాలలో తల్లి పాల సరైన పోషణ లేకపోవడంతో సంక్రమించే వ్యాధులు అందుకు మూలమైన రోగ నిరోధక శక్తి క్షీణతతో మొత్తం మీద కలిపితే ప్రతి ఏటా ఖజానాకు అయ్యే వ్యయం 1190 కోట్ల రూపాయల వరకూ ఉంటుందని ఈ కరకు వాస్తవాల నివేదికలో వెల్లడైంది.

నటుడు దిలీప్‌కుమార్‌కు అస్వస్థత



ముంబై: వెనుకటితరం సూపర్‌స్టార్ దిలీప్‌కుమార్‌కు కిడ్నీ, ఇతరత్రా అనారోగ్య సమస్యలు తలెత్తడంతో బుధవారం ఇక్కడి లీలావతి హాస్పిటల్‌లో చేర్పించారు. కిడ్నీ సమస్యలు, డీహైడ్రేషన్‌తో ఆయన బాధపడుతు న్నారు. ఆసుపత్రిలో చేరిన దిలీప్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, సాధారణవార్డ్‌లోనే ఉం చామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యు లు తెలిపారు. శరీరం నిస్సారం కావడంతో కీలక అవయవాలపై ప్రభావం పడుతుందని, దీనిని గమనించి తగు విధంగా చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. 94 సంవత్సరాల దిలీప్ గత రెండు సంవత్సరాలుగా వయోభారంతో అనారోగ్యం పాలవుతూ వస్తున్నారు. గత ఏడాది ఆయన ఆసుపత్రిలో చేరారు. జ్వరం వస్తూ ఉండటంతో భార్య సైరాభానూ వెంటనే ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు.



ఇమ్రాన్‌ఖాన్‌పై మహిళా నేత సంచలన వ్యాఖ్యలు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ తెహ్రిక్ ఏ ఇన్సాఫ్ (పిటిఐ) అధినేత, మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్‌పై ఆ పార్టీ మహిళా నాయకురాలు ఎంఎన్ఎ ఆయేషా గులాలై తీవ్ర ఆరోపణలు చేశారు. తనకు అసభ్య, అశ్లీల సందేశాలను పంపించాడని ఆరోపిస్తూ, ఈ విషయంలో తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తాను ఎన్నికల్లో టికెట్ లేదా, ఎన్ఎ–1 సీటు కోరలేదని, తన రాజీనామాకు ఈ అంశానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ పరిస్థితితో తాను తీవ్ర మానసిక వేదనకు గురయ్యాయని చెప్పారు. తనకు ఇమ్రాన్‌ఖాన్ నుంచి మొదటి అశ్లీల సందేశం 2013 అక్టోబరులో వచ్చిందని, ఇమ్రాన్ బ్లాక్‌బెర్రీ ఫోన్‌లో దీన్ని పరిశీలించాలని కోరింది. ఆ సందేశాల్లో ఉన్న పదాలను గౌరవ ప్రదమైన మహిళలెవరూ చూసి ఊరుకోలేరన్నారు. పార్టీలో ఇతర మహిళా నాయకులు కూడా ఇలాంటి పరిస్థితుల్లే ఎదుర్కొంటున్నారని, ఇమ్రాన్‌కు మహిళలంటే గౌరవం లేదని ఆరోపించారు. ఇమ్రాన్ మానసిక సమస్యలతో వున్నారని, ప్రతిభ గల వారిని ఆయన ఇష్టపడరని చెప్పారు.

డోక్లామ్ నుంచి వెనక్కి వెళ్లండి : చైనా

బీజింగ్ : సిక్కింలోని డోక్లామ్ వద్ద బలగాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని చైనా బుధవారం భారత్‌ను హెచ్చరించింది. డోక్లామ్ ఉద్రిక్తత నేపథ్యంలో చైనా ఈ ప్రకటన చేసింది. ఎలాంటి షరతులు లేకుండా బలగాలను వెనుకను పిలిపించేందుకు స్పష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. జులై 28న చైనాలో బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారుల (ఎన్ఎస్ఎ) సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు కట్టుబడి ఉంటాలని కోరింది. ఈ సమావేశంలో బ్రిక్స్ సహకారం కోసం ద్వైపాక్షిక సంబంధాలు, ఇతర సమస్యలపై రెండు దేశాల ప్రతినిధులు చర్చించుకున్నారని చైనా విదేశాంగ శాఖ పిటిఐకు తెలిపింది. డాంగ్‌లాంగ్ ప్రాంతంలో తాము రోడ్డు ను నిర్మించేందుకు యత్నించగా, భారతీయ బలగాలు డోక్లామ్ వద్ద సరిహద్దును అతిక్రమిం చాయని విదేశాంగ శాఖ పేర్కొంది. సమస్యను సానుకూలంగా, శాంతియుతంగా పరిష్కరించుకోవాలంటే ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే బలగాలను ఉపసంహరించుకోవాలని చైనా కోరింది.

డొక్లామ్‌లో తగ్గేది లేదు : భారత్

న్యూఢిల్లీ: భారత్, భూటాన్, చైనాల మధ్య ట్రైజంక్షన్‌గా ఉన్న డొక్లామ్‌లో భారత భద్రతా సిబ్బంది తగ్గిందన్న చైనా వాదనను భారత్ బుధవారం ఖండించింది. డొక్లామ్‌లో భారత్ దళాలను ఏమాత్రం తగ్గించనే లేదని సీనియర్ ప్రభుత్వాధికారులు చెప్పారు. డొక్లామ్‌లో ఆరు వారాలుగా యథాతథ స్థితి కొనసాగుతున్నదని వారు స్పష్టం చేశారు. 'డొక్లామ్‌లో జూన్‌లో 400 భారత దళాలుండగా జులైకల్లా 40కి తగ్గిపోయింది, చైనా భూభాగంలో ఇప్పటికీ అక్రమంగా ఓ బుల్‌డోజర్ ఉంది' అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఓ దస్తావేజును జారీ చేసింది. అయితే దీనిని భారత తీవ్రంగా ఖండించింది. డొక్లామ్ ప్రాంతంలో చైనా రోడ్డు నిర్మించాలని యత్నించినప్పటి నుంచి అక్కడ దాదాపు 350 మంది భారత సైనిక సిబ్బంది ఉంటోంది. ఆరువారాలుగా అంతే సిబ్బంది అక్కడ ఉంటోంది. డొక్లామ్‌లో ప్రతిష్టంభన ఏమాత్రం సడలనే లేదని భారత్ స్పష్టం చేసింది. డొక్లామ్‌లో ప్రస్తుత ప్రతిష్టంభన పరిష్కారం కావాలంటే భారత్ వెంటనే బేషరతుగా బలగాలను ఉపసంహరించుకోవాలని చైనా అంటోంది. చైనా ఎన్ని మడత పేచీలు పెట్టినా భారత్ మాత్రం ఇప్పటికీ తన వైఖరిని సడలించలేదు. ఆరు వారాలుగా యథాతథ స్థితే డొక్లామ్‌లో కొనసాగుతోంది.

ఆగస్టు 23న భారత్‌కు నేపాల్ ప్రధాని

ఖట్మండు : ఆగస్టు 23 నుంచి నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా భారత్‌లో పర్యటించనున్నారు. మావోయిస్టు నేత ప్రచండ నుంచి అధికారం స్వీకరించిన అనంతరం దేవ్‌బా తొలి విదేశీ పర్యటన చేయనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు దేవ్‌బా ఐదు రోజుల పాటు భారత్‌లో పర్యటిస్తున్నారని నేపాల్‌కు చెందిన మీడియా సంస్థ ఖాట్మండు పోస్ట్ పేర్కొంది. గతంలో చేసుకున్న ఒప్పందాల అమలు, భారత్ ఆర్థిక సహాయంతో వివిధ దశల్లో ఉన్న ప్రాజెక్టులు, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేయడంపై దేవ్‌బా చర్చించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధాని పర్యటనతో దేశానికి స్పష్టమైన లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య రూ. 30 వేల కోట్లతో చేపట్టిన పంచేశ్వర ప్రాజెక్టు, ఇంధన, మౌలిక సౌకర్యాలకు సంబంధించిన అంశాలు ప్రధాన ఎజెండాగా ఉంటాయని సీనియర్ అధికారులు తెలిపారు. నేపాల్ ప్రధాని తన పర్యటనలో బోధ్‌గయ, తిరుపతిని సందర్శించనున్నారు.

ఢిల్లీలో మాదిగ జెఎసి ధర్నా

మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణలో ఎస్‌సిలను ఎబిసిడిలుగా వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మాదిగ జెఎసి, టీఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలోబుధవారం ధర్నా నిర్వహించారు. ఈధర్నాలో తెలంగాణ నుండి వచ్చిన మద్దతుదారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎస్‌సి కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి మాట్లాడుతూ.... వెంకయ్య నాయుడు మాదిగలను ఉపయోగించుకుని ఉప రాష్ట్రపతి అయ్యారు, బిజెపి మాదిగలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంటు సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎస్‌సి వర్గీకరణ విషయంలో ఇబ్బంది ఉంటే.... కనీసం తెలుగు రాష్ట్రాల వరకైనా వర్గీకరణకు అవకాశం కల్పించాలని కోరారు. ఎస్‌సి వర్గీకరణ చేపట్టకపోతే, బిజెపికి వ్యతిరేకంగా ఇంటింటికీ ప్రచారం చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రపతిని కలిసిన గవర్నర్ నరసింహన్

మన తెలంగాణ/న్యూఢిల్లీ: ఒక్కరోజు పర్యటనలో భాగంగా బుధవారం ఢిల్లీకి వచ్చిన గవర్నర్ నరసింహన్ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి గవర్నర్ అభినందనలు తెలియజేశారు. తర్వాత పార్లమెంటులో ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రధానమంత్రి మోడీతో పాటు, ప్రధాని కార్యాలయశాఖ మంత్రి జితేంద్రసింగ్‌ని గవర్నర్ నరసింహన్ కలిశారు. ఈ సందర్భంగా ప్రధానితో తెలుగు రాష్ట్రాలలోని పరిస్థితులను వివరించినట్లు సమాచారం. అనంతరం బయటకు వచ్చిన గవర్నర్ ను మీడియా ప్రతినిధులు సమావేశ వివరాలు కోరే ప్రయత్నం చేయగా ఆయన ఈ విధంగా స్పందించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు వేరు వేరు గవర్నర్లను నియమిసున్నారు అన్న ప్రశ్నకు అన్నీ మీడియానే చెప్తుంది అని గవర్నర్ వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం తరుపున కాశ్మీర్ వ్యవహారాలు చూసేందుకు జాతీయ భద్రత సలహాదారుడు అజిత్ దోవల్‌కి సహాయ పదవిలోమిమ్మల్ని నియమిస్తున్నారు అన్న ప్రశ్నకు నాకు ఎలాంటి సమాచారం లేదు అని గవర్నర్ నరసింహన్ సమాధానం ఇచ్చారు. కేవలం మర్యాద పూర్వకంగా రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, ప్రధాన మంత్రిలను కలిశాను అని తెలిపారు. అంతకముందు కేంద్ర హోం శాఖ అధికారులతో దాదాపు మూడుగంటల పాటు సుదీర్ఘంగా పలు విషయాలపై చర్చించినట్లు సమాచారం.

గురుకుల పోస్టుల్లో మహిళలతో భర్తీపై స్టే ఎత్తివేత

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లోని బోధన, బోధనేతర పోస్టులు మొత్తం మహిళలతో భర్తీపై సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. నియామకాలు కొనసాగించవచ్చునని, అయితే అవన్నీ తమ తీర్పునకు లోబడి ఉండాలని న్యాయమూర్తులు జస్టిస్ సివి నాగార్జునరెడ్డి, శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్‌బెంచ్ స్పష్టం చేసింది. 2016 జూన్ 4న వచ్చిన జీవో 1274 ప్రకారం ఖాళీ అయిన పోస్టులన్నీ మహిళలతో నియమించాలనే నిర్ణయాన్ని వరంగల్ జిల్లా నగరం గ్రామానికి చెందిన సత్యనారాయణ హైకోర్టులో ప్రశ్నించారు. జీవో ప్రకారం గురుకుల విద్యా సంస్థలు సిబ్బంది నియామక నిబంధనల్ని మార్పు చేయలేదన్న ఆయన వాదన తర్వాత సింగిల్ జడ్జి గత నెల 19న టీఎస్‌పీఎస్‌సీ చర్యలపై స్టే ఆదేశాలు జారీ చేశారు. దీనిపై సర్కార్ అప్పీల్ చేసిన వ్యాజ్యంపై వాదనలకు సమయం కావాలని పిటిషనర్ కోరగా అందుకు బెంచ్ అనుమతి ఇవ్వలేదు. డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్లు, ఇతర పోస్టుల భర్తీపై రెండు రోజుల క్రితం జారీ చేసిన మధ్యంతర ఆదేశాలే ఇక్కడా అమలులో ఉంటాయని బెంచ్ మధ్యంతర ఆదేశాల్లో స్పష్టం చేస్తూ విచారణ 9కి వాయిదా వేసింది.

మసీదులో ఆత్మాహుతి దాడి

29 మంది దుర్మరణం, హెరాత్‌లో ఘటన



హెరాత్: అఫ్ఘానిస్థాన్‌లోని షియా మసీదుపై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి పశ్చిమ ప్రాంత నగరమైన హెరాత్‌లోని జవద్యా మసీదులో ఆత్మాహుతి దాడి చేయడంతో 29 మంది మృతి చెందారు. 63 మంది గాయపడ్డారు. రక్తపు మడుగులో మృతదేహాలు పడి ఉన్నాయని, క్షతగాత్రులు ముందుకు కదల్లేక కేకలు వేసినట్లు ప్రత్యక్షసాక్ష్యులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని డాక్టర్లు తెలిపారు. దాడికి పాల్పడిన ఇద్దరు ఉగ్రవాదుల్లో ఒకరు ఆత్మాహుతి దాడికి పాల్పడగా, మరొకరు తుపాకులతో కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారని పేర్కొన్నారు. ఈ దాడితో తమకు సంబంధం లేదని ఇప్పటికే తాలిబాన్ తెలిపింది. ఉగ్రదాడికి ఎవరు కారణమనేది తెలియనప్పటికీ ఐసిస్ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. మైనార్టీ షియా ప్రజలు, షియా మసీదులపై ఐసిస్ ఉగ్రవాదులు తరచుగా దాడులకు పాల్పడుతున్నారు. కాబూల్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయంపై ఐసిస్ దాడి జరిగిన తర్వాత రోజు ఈ ఘటన చోటు చేసుకుంది. హెరాత్‌లో ఉగ్రదాడిని ప్రభుత్వం ఖండించింది. దేశ ప్రజలపై ఆటవిక దాడికి వ్యతిరేకంగా ముస్లిం ప్రజలు, మేధావులు ఐక్యం కావాలని ప్రభుత్వం పేర్కొంది. ప్రజల మధ్య ఉగ్రవాదులు విభేదాలు సృంచించొద్దని అఫ్ఘానిస్థాన్ అధ్యక్షుడు అష్రాప్ ఘని అన్నారు. దేశంలో తాలిబాన్ కన్నా ఐసిస్ ప్రాబల్యం పెరిగిపోతున్నట్లు పోలీసులు తెలిపారు. తాజా దాడితో దేశంలో శాంతి భద్రతల పరిస్థితి విషమించిందని తెలుస్తోంది.

నాటో దళాల కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడి

కాందహార్: అఫ్ఘానిస్థాన్‌లోని కాందహార్ ప్రావిన్స్‌లో బుధవారం నాటో దళాల కాన్వాయ్‌పై పేలుడు పదార్థాలతో వచ్చిన వాహనంతో ఆత్మాహుతి దాడికి తెగబడ్డాడు. ఆత్మాహుతి దాడిని ధ్రువీకరించిన నాటో అధికారులు ఎంత మంది మృతి చెందారనేది వెల్లడించలేదు. డామన్ ప్రాంతంలో మూడు వాహనాల్లో వెళ్తున్న నాటో దళాలే లక్ష్యంగా కారు బాంబుతో దాడికి పాల్పడ్డారని పోలీస్ అధికారి మీడియాకు తెలిపారు. ఓ వాహనంలో ముగ్గురి మృతదేహాలను తీసుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షి తెలిపారు. పేలుడు జరిగిన అనంతరం నాటో దళాల వాహనం మంటల్లో కాలిపోతున్నదని ప్రత్యక్ష సాక్షి తెలిపారు. హెలికాప్టర్‌లో మూడు మృతదేహాలను తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఉగ్రదాడికి తామే బాధ్యులమని ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ తాలిబాన్ ప్రకటించింది. అధిక సంఖ్యలో ఉండే తాలిబాన్లు కాందహార్‌లో తరచు దాడులకు పాల్పడుతున్నారు. ఈ దాడి నాటో దళాలకు ఎదురు దెబ్బగా భావిస్తున్నారు. అఫ్ఘానిస్థాన్‌లో తిరుగుబాటుదారులను అణిచి వేసేందుకు నాటో దళాలు దశాబ్దం పైగా పోరాడుతున్నప్పటికీ ఎలాంటి పురోగతి సాధించలేదు.

ఉత్తర కొరియాలో ప్రభుత్వం మార్పును అమెరికా కోరుకోవడం లేదు

అణ్వాస్త్రాలపైనే దృష్టి

వాషింగ్టన్: ఉత్తరకొరియాలో ప్రభుత్వ మార్పును అమెరికా కోరుకోవడం లేదు. కానీ ఉత్తరకొరియా అణ్వాయుధాలు అభివృద్ధి చేయకుండా ఉండేందుకు అన్ని మార్గాలను అన్వేసిస్తున్నది. ఈ విషయంలో చైనాతో కూడా కలసి పనిచేయాలనుకుంటోంది. ఈ వివరాలను అమెరికా ఉన్నతాధికారులు చెప్పారు. ఉత్తరకొరియా అణ్వాయుధాల అభివృద్ధిని ఆపేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరుకుంటున్నారు. ఉత్తరకొరియాకు పగ్గాలు వేయాలని ఆయన చైనాను కోరినప్పటికీ ఫలితం శూన్యం. దాంతో వేరే మార్గాలన్నింటినీ అమెరికా పరిశీలిస్తున్నదని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ సారా సాండర్స్ విలేకరులకు చెప్పారు. ఉత్తరకొరియాపై సైనికదాడి ఐచ్ఛికాన్ని కూడా పరిశీలిస్తున్నాం అని సెనెటర్ లిండ్సే గ్రాహం అన్న వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు సాండర్స్ ప్రతిస్పందిస్తూ ఈ వివరాలు తెలిపారు. ఉత్తర కొరియా దూకుడును, అణ్వాయుధాల అభివృద్ధిని ఆపాలన్నదే అమెరికా తపన అన్నారు. ఉత్తరకొరియాలో ప్రభుత్వ మార్పును అమెరికా కోరుకోవడంలేదని అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ మంగళవారం అన్నారు. అణ్వాయుధ అభివృద్ధి కార్యక్రమాలను ఉత్తర కొరియా వదులుకుంటే దానితో చర్చలు జరిపేందుకు అమెరికా సిద్ధమేనని కూడా ఆయన చెప్పారు. ఉభయ కొరియాల ఏకీకరణను కూడా అమెరికా కోరుకోవడంలేదన్నా రు. ఉత్తరకొరియాపై చైనా ద్వారా ఒత్తిడి పెంచి దారితీసుకురావాలని అమెరికా కోరుకుంటోంది.

కన్నతల్లినే హతమార్చిన తనయుడు

మన తెలంగాణ/తిరుమలాయపాలెం : మతి స్థిమితం లేని ఓ వ్యక్తి కన్నతల్లినే కడతేర్చాడు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల పరిధిలోని తెట్టెలపాడులో బుధవారం ఈ ఘటన జరిగింది. తెట్టెలపాడు గ్రామానికి చెందిన జాలా చంద్రమ్మ (75) కుమారుడు వీరన్న గత రెండు నెలల నుంచి మతి స్థిమితం కోల్పోయి ప్రవర్తిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి తన తల్లి నిద్రిస్తున్న సమయంలో గొంతు నులిమి, గొడ్డలితో తలపై నరికాడు. వెంటనే చంద్రమ్మ అక్కడిక్కడే మృతి చెందింది. సంఘ టన స్థలాన్ని ఖమ్మం రూరల్ ఏసిపి కొల్లు సురేష్ కుమార్, కూసుమంచి సిఐ కిరణ్ కుమార్, తిరుమలాయపాలెం ఎస్ఐ ఎం. నాగరాజు సందర్శించారు. నిందితున్ని అదుపులో తీసుకొని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కృష్ణా బోర్డు రహస్య నివేదిక?

మన తెలంగాణ/హైదరాబాద్: బజాజ్ కమిటీకి కృష్ణాబోర్డు రహస్య నివే దికను అందించింది. బుధవారం ఉదయమే కృష్ణా బోర్డు చైర్మన్ శ్రీవాస్తవ ఒక్కరే ఢిల్లీకి వెళ్లి బజాజ్ కమిటీని కలిసి, నివేదిక అందించారు. పట్టిసీమ, పురుషోత్తమపట్నం, పోలవరంల ద్వారా గోదావరి నుంచి కృష్ణా కు మళ్లిస్తున్న నీటిలో తెలంగాణ వాటాపైన, బోర్డుల వర్కింగ్ మాన్యు వల్‌పై బజాజ్ కమిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇటువంటి కీలక సమావే శానికి కృష్ణా బోర్డు చైర్మన్ శ్రీవాస్తవ ఒక్కరే వెళ్లి నివేదికను అందించడం గమనార్హం. విభజన చట్టంలో మళ్లింపు జలాల ప్రస్తావన లేదని, బజాజ్ కమిటీ నివేదిక ఇచ్చేస్తే చాలని సూచించినట్లు విశ్వసనీయ సమాచారం.

పిఎం భార్గవ సేవలు మరవలేనివి

మన తెలంగాణ/హైదరాబాద్: పద్మభూషణ్, డాక్టర్ పిఎం భార్గవ సేవలు మరువలేమని సిసిఎంబి డైరెక్టర్ డాక్టర్ రాకేష్ మిశ్రా అన్నారు. సిసిఎంబిలో బుధవారం నాడు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ మిశ్రా మాట్లాడుతూ భార్గవ, సీనియర్ శాస్త్రవేత్తలతో కలిసి సిసిఎంబిని ఉన్నతస్థాయిలో తీర్చిదిద్దారని అన్నారు. దేశంలో విజ్ఞాన పురోగతి కోసం భార్గవ ఆశయాలు, ఆదర్శాలకు అనుగుణంగా కృషి చేయాలని సూచించారు.

ఇసుక లారీ కిందపడి ఒకరు మృతి

సిరిసిల్లలో ఒకే రోజు నాలుగు చోట్ల ప్రమాదాలు



మన తెలంగాణ/సిరిసిల్ల/హైదరాబాద్ : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇసుక లారీల బీభత్సకాండ కొనసాగుతుంది. బుధవారం ఒక్కరోజే జిల్లాలోని నాలుగు ప్రదేశాల్లో లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పలువురు గాయాల పాలయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోత్గల్‌లో ఇసుక లారీ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శంకర్ అనే వ్యక్తిని హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మరోవైపు వెంకట్రావుపల్లె వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో కరీంనగర్‌కు చెందిన చిందెం రమేశ్, అతని భార్య ఎల్లమ్మకు కాళ్లు విరిగాయి. వారి పై నుండి లారీ వెనక టైర్లు వెళ్లడంతో కాళ్లు నుజ్జునుజ్జయి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. మరోవైపు సిరిసిల్ల మండలం చంద్రంపేట వద్ద ఇసుక లారీ ఆర్టీసీ బస్సును ఢీ కొట్టగా ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. మరో వైపు నేరెళ్ల సమీపంలో లారీ ఒకటి ఇండ్లల్లోకి దూసుకెళ్లగా ఇంటి ముందటి బాత్రూం కూలిపోయింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇసుక లారీలు తీవ్ర భీభత్స కాండను సృష్టిస్తున్నాయని, నెలరోజులుగా తీవ్ర ఆందోళన సాగుతూ దేశవ్యాప్తంగా చర్చనీయమైన అంశం తెలిసిందే. గత నెల 2న నేరెళ్లలో ఇసుక లారీ ఢీకొన్న ప్రమాదంలో భూమయ్య అనే రైతు మృతి చెందడం, లారీలను దగ్ధం చేయడం, ఈ ఘటనలో 12 మందిపై కేసులు నమోదు చేసి 8 మందిని అరెస్ట్ చేయడం, జైలుకు పంపడంతో 8 మందిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, గ్రామస్థాయి నుండి జాతీయస్థాయి వరకు ప్రతిపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ మొదలుకుని అన్ని పార్టీల నాయకులు, మాజీ మంత్రులు, వివిధ స్థాయిల ప్రజాప్రతినిధులు నేరెళ్లను సందర్శించి బాధితులకు పరామర్శలు తెలిపిన నేపథ్యంలో బుధవారం ఒక్క రోజే పలు చోట్ల జిల్లాలో లారీలు భీభత్సకాండను సృష్టించడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లారీలు వేగాన్ని నియంత్రించాలని లారీలను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు. అయినా లారీల దూకుడు ఆగకపోవడం గమనార్హం. ప్రభుత్వ అండదండలతోనే ఇసుక లారీలు కొనసాగుతున్నాయని ప్రతిపక్షాలు తీవ్రంగా ఆరోపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా ఇసుకలారీల దూకుడుకు కళ్లెం వేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇసుక లారీ ఘటనపై ఉత్తమ్ దిగ్భ్రాంతి : సిరిసిల్ల జిల్లాలో ఇసుక మాఫియాకు ఇంకా ఎంత మంది బలి కావాలని పిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. తాజాగా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో పొలం వద్దకు పోతున్న దళిత రైతు గిన్నె శంకర్‌ను ఇసుక లారీ ఢీకొట్టడంతో మరణించడం పట్ల ఆయన ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా సిరిసిల్ల ఇసుక మాఫియా ఆగడాలు, వారికి సిఎం, మంత్రి కెటిఆర్ అండదండలపై కాంగ్రెస్ పోరాడుతున్నా కూడా ఇసుక మాఫియా చెలరేగిపోవడానికి ఈ ఘటన నిదర్శనమన్నారు. ప్రతి పది రోజులకు ఒక ఇసుక లారీ ప్రమాదం జరుగుతున్నా, దుమ్ము, దూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నా స్థానిక ఎంఎల్‌ఎ కెటిఆర్ పట్టించుకోకపోవడం, ఇసుక మాఫియాకు అండగా నిలబడడం ఆయన ధన దాహానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఇసుకలారీల దగ్ధంతో సంబంధం లేదు

మొరపెట్టుకున్న నేరెళ్ల బాధితులు

మన తెలంగాణ/కరీంనగర్ : ఇసుకలారీల దగ్ధం కేసులో తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పినప్పటికీ వినకుండా పోలీసులు తమను దారుణంగా హింసించారని నేరెళ్ల బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ జైలులో ఉన్న ఎనిమిది మంది బాధితులు షరతులతో కూడిన బెయిల్‌పై బుధవారం విడుదలయ్యారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, తమకు మత్తు మందు ఇచ్చి రాత్రి నుంచి ఉదయం వరకు ఎస్‌పి విశ్వజిత్‌తో పాటు 18మంది కానిస్టేబుళ్లు తమను కులం పేరుతో దూషిస్తూ చితకబాదారని అన్నారు. తమపై ఉన్న కేసులను ఎత్తివేసి న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు. నెలరోజులపాటు తమకు వేములవాడ దాటిపోరాదని న్యాయస్థానం ఉత్తర్వుల్లో పేర్కొందని తెలిపారు. వారు విడుదలైన సందర్భంగా జైలు వద్దకు బిజెపి నేతలు, కాంగ్రెస్ నేతలు మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్, బండి సంజయ్, జెఎసి నేతలు, కార్యకర్తలు, వచ్చి సంఘీభావం తెలిపారు.

రైల్వేల్లో ఆహారపదార్థాల తనిఖీ

మన తెలంగాణ / హైదరాబాద్ : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌తో పాటు పలు రైళ్లలో ఆహార పదార్థాల విక్రయంపై దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనధికారికంగా ఆహార పదార్థాలను విక్రయిస్తున్న వారి నుంచి రూ.2.41 లక్షల జరిమానాను వసూలు చేశారు. శాతవాహన, ఫలక్‌నుమా, విశాఖ, గోదావరి తదితర రైళ్లలో తనిఖీలు నిర్వహించి అనధికారికంగా ఆహారపదార్థాలను విక్రయిస్తున్న మొత్తం 92 మందిని అదుపులోకి తీసుకుని రైల్వే ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపర్చారు. ఈ తనిఖీల్లో హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బి.డి.కృష్టఫర్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ కె.సెంటిల్‌తో పాటు 16 మంది టిక్కెట్ తనిఖీ సిబ్బంది, 10 మంది కమర్షియల్ ఇన్‌స్పెక్టర్స్, 10 మంది ఆర్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ఉత్తర్వులను అమలు చేయండి

నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రైవేటు వైద్యశాలలు, నర్సింగ్ హోంలలో పని చేసే నర్సులకు కనీస వేతనం రూ.20,000 చెల్లించాలన్న కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోవాలని నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రిని కోరింది. కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసిన తొలి రాష్ట్రంగా వామపక్ష పార్టీల కూటమి అధికారంలో ఉన్న కేరళ నిలిచిందని అసోసియేషన్ కన్వీనర్ రుధావత్ లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు 50 మంది స్టాఫ్ నర్సులు ఉండాల్సిన చోట 1015 మందితో సరిపెడుతుండడంతో నర్సులపై పని భారం పెరిగిపోతుందన్నారు. ప్రైవైటు ఆసుపత్రులు, నర్సింగ్ హోంల యజమానులు, నర్సింగ్ సంఘాల ప్రతినిధులతో చర్చించి వెంటనే న్యాయం చేయాలన్నారు.

పార్క్‌లో ఆడుకోనివ్వడం లేదు

మన తెలంగాణ/హైదరాబాద్ : కొండాపూర్‌లోని సిఎంసి ఎన్‌క్లేవ్‌లో ఉన్న పార్క్ పిల్లలను అడుకోనివ్వకుండా అవరోధాలు సృష్టిస్తున్నారంటూ తమకు లేఖలు వచ్చాయని బాలల హక్కుల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. దీనిపై స్పందించి తాము మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామని సంఘం అధ్యక్షులు అనురాధ రావు పేర్కొన్నారు.

ఇకనైనా ప్రైవేట్ భారం తగ్గుతుందా..?

ప్రైవేట్ పుస్తకాలతో బరువు, ఖర్చు రెండూ ఎక్కువే

మన తెలంగాణ/హైదరాబాద్ : స్కూల్ బ్యాగు బరువును తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ప్రైవేట్‌లో పుస్తకాల భారంతో పాటు పుస్తకాలపై వెచ్చించే ఆర్థిక భారం తగ్గుతుందా..? లేదా..? అనే సందేహాలు వ్యక్త మవుతున్నాయి. 201718 విద్యాసంవత్సరం నుంచి ప్రైవేట్ స్కూళ్లలో కచ్చితంగా ప్రభుత్వ పుస్తకాలే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ భావించినప్పటికీ అధికారికంగా ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదు. ప్రైవేట్ ప్రచురణకర్తలు ముద్రించిన పుస్తకాలే వినియోగించేలా విద్యాశాఖ యాజమాన్యాలకు వెసులుబాటు కల్పించింది. ప్రధానంగా ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం ముద్రించిన పుస్తకాలు వినియోగిస్తే పుస్తకాల బరువుతోపాటు పుస్తకాలపై వెచ్చించే ఖర్చు కూడా తగ్గుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ వచ్చే విద్యాసంవత్సరం నుంచి కూడా ఈ విధానం అమలయ్యే అవకాశం కనిపించడం లేదు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రైవేట్ ప్రచుకరణకర్తలు ముద్రించిన పుస్తకాలు విక్రయిస్తే, వాటిపై ఆదాయం ఎక్కువగా లభిస్తుంది. దాంతో యాజమాన్యాలు ప్రైవేట్ పుస్తకాలకే మొగ్గు చూపుతుంటారు. అయితే తరగతుల వారీగా స్కూల్ బ్యాగు బరువును నిర్ధేశిస్తూ ప్రభుత్వం జారీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం ప్రైవేట్ స్కూళ్లు మోత బరువును తగ్గిస్తాయా..? లేదా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఇప్పటికే ఇప్పటికే తమ పిల్లల కోసం తల్లిదండ్రులు అధిక బరువు ఉండే పుస్తకాలు కొనుగోలు చేశారు. వాటి బరువును ఎలా తగ్గిస్తారు..? ఒక వేళ తగ్గించకపోతే విద్యాశాఖ ఎలాంటి చర్యలకు పూనుకుంటుందనేది వేచిచూడాలి.

బరువు, ఖర్చు రెండూ ఎక్కువే

ప్రైవేట్ ప్రచురణకర్తలు ముద్రించిన పుస్తకాల బరువుతోపాటు, ఖర్చు కూడా ఎక్కువే. వీటిలో అవనసరమైన పుస్తకాలే అధికంగా ఉంటాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ప్రైవేట్ స్కూళ్లలో 15 తరగతుల పుస్తకాలకు తల్లిదండ్రులు అధిక మొత్తంలో వెచ్చించాల్సి వస్తోంది. ప్రీప్రైమరీ, ఒకటవ తరగతి పుస్తకాలకు కూడా రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు తల్లిదండ్రులు వెచ్చిస్తున్నారు. ప్రైవేట్, కార్పోరేట్ స్కూళ్లలో కచ్చితంగా యాజమాన్యాలు చెప్పిన పుస్తకాలనే తల్లిదండ్రులు తీసుకోవాల్సి ఉంటుంది. స్కూళ్ల యాజమాన్యాలు ప్రైవేట్ ప్రచుకరణకర్తలతో ఒప్పందాలు కుదుర్చుకుని ప్రీ ప్రైమరీ పుస్తకాలకు కూడా రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ పుస్తకాలలో విద్యార్థులకు శాస్త్రీయమైన విద్య అందే అవకాశం ఉంటుంది. విద్యావేత్తలు, సబ్జెక్టు నిపుణులు రూపొందించిన సిలబస్ ఆధారంగా ప్రభుత్వ పుస్తకాలు ముద్రిస్తారు. ప్రభుత్వం ముద్రించిన పుస్తకాలను ఉపయోగించడం వల్ల తల్లిదండ్రులు పాఠ్యపుస్తకాలపై వెచ్చించే ఖర్చు కూడా చాలా వరకు తగ్గుతుంది. ప్రైవేట్ ప్రచురణకర్తలు ముద్రించే పుస్తకాలు కేవలం ధనార్జనే లక్ష్యంగా ముద్రిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పుస్తకాలు ఉపయోగించడం ద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం అధికంగా ఉంటుంది.

డోపింగ్‌తో క్రీడలకు తీరని నష్టం : బోల్ట్




లండన్: క్రీడా రంగానికి డోపింగ్ శాపంగా మారిందని, ఈ భూతాన్ని పారదోలేందుకు ప్రతి అథ్లెట్ నడుం బిగించాలని ప్రపంచ దిగ్గజ అథ్లెట్ ఉసెన్ బోల్ట్ పిలుపు నిచ్చాడు. డోపింగ్‌కు పాల్పడం కంటే మరో నీచమైన పని మరొకటి లేదని ఈ జమైకా చిరుత అభిప్రాయపడ్డాడు. డోపింగ్‌కు పాల్పడే అథ్లెట్స్ అంటే తనకు పరమ అసహ్యమన్నాడు. డోపింగ్ మహమ్మరి క్రీడా రంగానికి చీడ పురుగుల అవతరించిందన్నాడు. దీన్ని నివారించేందుకు ప్రపంచ వ్యాప్తంగా అథ్లెట్లు, క్రీడా సంఘాలు, ప్రభుత్వాలు నడుంబిగించాల్సిన సమయం అసన్నమైందన్నాడు. ప్రపంచంలోనే డోపింగ్ ఓ భూతంలా తయారైందన్నాడు. క్రీడా రంగానికి ఇది ఎంతో చేటు తెస్తుందన్నాడు. డోపింగ్‌కు పాల్పడే క్రీడాకారులను కఠినంగా శిక్షించాల్సిందేనని స్పష్టం చేశాడన్నాడు. స్వశక్తినే నమ్ముకుని తాను ఈ స్థాయికి చేరుకున్నానని ఈ స్టార్ అథ్లెట్ వ్యాఖ్యానించాడు. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నడూ కూడా తప్పుడు పనుల జోలికి వెళ్ల లేదన్నాడు. కాగా, లండన్‌లో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు బోల్ట్ ఇక్కడికి వచ్చాడు. ఈ సందర్భంగా అతను మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలు చెప్పాడు. ఈ పోటీలు ముగిసిన వెంటనే బోల్ట్ తన కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించనున్నాడు. దీంతో అందరి దృష్టి బోల్ట్‌పైనే నిలిచింది.



లంక మ్యాచ్‌లను చూడడం మానేశా

మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ

కొలంబో : శ్రీలంక ఆడే మ్యాచ్‌లు చూడడం మానేశానని ఆ జట్టు మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ అన్నాడు. శ్రీలంక క్రికెట్ బోర్డు అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు నిరసనగా తాను ఈ నిర్ణయం తీసుకున్నట్టు రణతుంగ తెలిపాడు. భారత్‌తో జరిగిన 2011 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ ఇక్సింగ్‌కు గురైందని గతంలో రణతుంగ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. కొంతకాలంగా లంక క్రికెట్ పెద్దలపై, ఆ జట్టు మాజీ కెప్టెన్లు కుమార సంగక్కర, మహేల జయవర్ధనే తదితరులపై రణతుంగ సంచలన ఆరోపణలు చేస్తున్నాడు. తాజాగా శ్రీలంక ఆడే క్రికెట్ మ్యాచ్‌లు చూడకూడదనే నిర్ణయానికి వచ్చాడు. ఈ విషయాన్ని ఓ జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు. ప్రస్తుతం శ్రీలంక క్రికెట్ బోర్డులో అవినీతి రాజ్యమేలుతోందని, వారు అనుసరిస్తున్న విధానాల వల్ల దేశ క్రికెట్ భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నాడు. పరిస్థితిని చక్కదిద్దాల్సిన అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇది తనను ఎంతో ఆవేదనకు గురి చేస్తుందని ఈ మాజీ దిగ్గజం వాపోయాడు. రణతుంగ సారథ్యంలో శ్రీలంక జట్టు వన్డే ప్రపంచకప్ గెలుచుకున్న విషయం తెలిసిందే. కొంతకాలంగా తమ జాతీయ జట్టు శ్రీలంక ఆడే మ్యాచ్‌లను చూడడం మానేశానని వివరించాడు. జట్టు ఆడే ఏ మ్యాచ్‌ను కూడా తాను ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా కానీ చూడడం లేదని స్పష్టం చేశాడు. అయితే భారత్ ఆడే ఆయా సిరీస్‌లను క్రమం తప్పకుండా చూస్తున్నానని తెలిపాడు. అయితే భారత్–శ్రీలంక సిరీస్‌ను మాత్రం చూడడం లేదని తేల్చి చెప్పాడు. కాగా, శ్రీలంక క్రికెట్ బోర్డును ప్రక్షాళన చేయాలని, దీని కోసం తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేయాలని రణతుంగ ఆ దేశ ప్రధాని రాణిల్ విక్రమ్ సింఘేను కోరాడు. ఈ మేరకు ప్రధానికి లేఖ కూడా రాయనున్నట్టు రణతుంగ వివరించాడు.



కెఎల్ రాహుల్ ఫిట్

కొలంబో : శ్రీలంకతో జరిగే రెండో టెస్టుకు ఓపెనర్ కెఎల్.రాహుల్ సిద్ధంగా ఉన్నాడని భారత కెప్టెన్ విరాట్ కోహ్లి తెలిపాడు. జ్వరం వల్ల తొలి టెస్టుకు దూరమైన రాహుల్ రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉంటున్నాడని కోహ్లి వివరించాడు. ఈ మ్యాచ్‌లో శిఖర్ ధావన్‌తో కలిసి రాహుల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తాడని తెలిపాడు. దీంతో రెండో టెస్టు మ్యాచ్ నుంచి మరో ఓపెనర్ అభినవ్ ముకుంద్‌ను తప్పిస్తున్నట్టు భారత సారథి సంకేతాలు ఇచ్చాడు. చాలా రోజులుగా రాహుల్ టీమిండియాకు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత రాహుల్ ఫిట్‌నెస్ లేమితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతను ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నీకి కూడా దూరమయ్యాడు. ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ, వెస్టిండీస్ సిరీస్‌లకు కూడా అందుబాటులో లేకుండా పోయాడు. అయితే పూర్తి ఫిట్‌నెస్ సంతరించు కోవడంతో అతన్ని శ్రీలంక సిరీస్‌కు ఎంపిక చేశారు. కానీ జ్వరం వల్ల అతను మొదటి టెస్టుకు దూరమయ్యాడు. దీంతో అతనికి బదులు అభినవ్ ముకుంద్ బరిలోకి దిగాడు. ప్రస్తుతం ధావన్ ఫాంలో ఉండడం, రాహుల్ ఫిట్‌నెస్ సాధించడంతో ముకుంద్ పెవిలియన్‌కే పరమితం కాక తప్పడం లేదు. కాగా, రాహుల్ చాలా మంచి ఆటగాడని, అతన్ని తుది జట్టులో నుంచి తప్పించడం మంచిది కాదని కోహ్లి అభిప్రాయపడ్డాడు. దీంతో గురువారం ప్రారంభమయ్యే రెండో టెస్టులో రాహుల్ ఆడడం ఖాయమనే విషయం తేలి పోయింది.

సమరోత్సాహంతో భారత్

- **లంకకు చావోరేవో,**
  నేటి నుంచి రెండో టెస్టు

కొలంబో : శ్రీలంకతో గురువారం ప్రారంభమయ్యే రెండో టెస్టుకు భారత్ ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. తొలి టెస్టులో ఘన విజయం సాధించిన కోహ్లి సేన ఈ మ్యాచ్‌లో సమరోత్సాహంతో బరిలోకి దిగనుంది. ఓపెనర్ కెఎల్.రాహుల్ ఈ మ్యాచ్‌లో ఆడనున్నాడు. దీంతో భారత్ బ్యాటింగ్ మరింత బలోపేతంగా మారింది. మరో వైపు తొలి మ్యాచ్‌లో ఘోర పరాజయం పాలైన ఆతిథ్య శ్రీలంకకు ఈ మ్యాచ్ చావోరేవోగా మారింది. సిరీస్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే లంక ఈ మ్యాచ్‌లో గెలవక తప్పదు. అయితే కీలక ఆటగాళ్లు ఫిట్‌నెస్ లేమితో బాధ పడుతుండడం లంక కష్టాలను రెట్టింపు చేస్తోంది. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో లంక ఉంది. అయితే భీకర ఫాంలో ఉన్న టీమిండియాను ఓడించడం ప్రస్తుత పరిస్థితుల్లో లంకకు శక్తికి మించిన పనిగానే విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఎంతో బలంగా ఉన్న కోహ్లి సేన ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ మ్యాచ్‌లో కూడా గెలిచి సిరీస్‌ను దక్కించుకోవాలనే పట్టుదలతో భారత్ ఉంది. లంక కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో పోరు నువ్వానేనా అన్నట్టు సాగడం ఖాయం.

అందరి దృష్టి ధావన్‌పైనే..

తొలి మ్యాచ్‌లో అద్భుత సెంచరీతో కదం తొక్కిన ఓపెనర్ శిఖర్ ధావన్ ఈ మ్యాచ్‌కు కూడా ప్రత్యేక ఆకర్షణగా మారాడు. అనిశ్చితికి మరో పేరుగా చెప్పుకునే ధావన్ ఈ మ్యాచ్‌లో రాణిస్తాడా లేదా అన్నది అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. తనదైన రోజు ఎంతటి బౌలింగ్ నైనా చిన్నాభిన్నం చేసే సత్తా ధావన్ సొంతం. ఈ మ్యాచ్‌లో అతను ఎలా బ్యాటింగ్ చేస్తాడనేది ఆసక్తిగా మారింది. జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలంటే ధావన్ ఈ మ్యాచ్‌లోనూ మెరుపులు మెరిపించక తప్పదు. మరోవైపు చాలా రోజుల తర్వాత బరిలోకి దిగుతున్న కెఎల్. రాహుల్‌కు కూడా మ్యాచ్ కీలకంగా మారింది. ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గిన రాహుల్ రెండో టెస్టుకు సిద్ధమయ్యాడు. ముకుంద్ స్థానంలో అతనికి తుది జట్టులో చోటు లభించింది. గాయం వల్ల రాహుల్ చాలా రోజులుగా టీమిండియాకు దూరమయ్యాడు. దీంతో అతను ఎలా ఆడతాడనే విషయం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో అసాధారణ ఆటను కనబరిచిన రాహుల్ గాయం వల్ల జాతీయ జట్టుకు దూరమైన విషయం తెలిసిందే. తాజాగా అతనికి శ్రీలంక సిరీస్ కోసం జట్టులో చోటు దక్కింది. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలనే పట్టుదలతో రాహుల్ ఉన్నాడు. జట్టులో ఓపెనర్ స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో రాహుల్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. దీన్ని అతను ఎలా ఎదుర్కొంటాడనే అనేది ఆసక్తి రేకెత్తించే అంశం.



జోరుమీదున్నారు

ఇక, టీమిండియా టాప్ ఆర్డర్ భీకర ఫాంలో ఉంది. వన్ డౌన్‌లో వచ్చే చతేశ్వర్ పుజారా తొలి టెస్టులో అద్భుత సెంచరీతో కదం తొక్కాడు. ఈ మ్యాచ్ పుజారాకు 50వది కావడంతో అందరి దృష్టి అతనిపై నెలకొంది. ఈ మ్యాచ్‌లోనూ మెరుగైన బ్యాటింగ్‌ను కనబరిచి తీపి జ్ఞాపకంగా పెట్టుకోవాలనే లక్ష్యంతో ఉన్నాడు. తొలి మ్యాచ్‌లో పుజారా సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. మైలురాయి మ్యాచ్‌లో కూడా మంచి ఇన్నింగ్స్ ఆడాలనే పట్టుదలతో పుజారా కనిపిస్తున్నాడు. ఇదే జరిగితే లంక బౌలర్లకు కష్టాలు తప్పక పోవచ్చు. ఇక, కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా ఫాంలోకి వచ్చాడు. తొలి మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో కోహ్లి అద్భుత శతకం సాధించిన సంగతి తెలిసిందే. ఈసారి కూడా మెరుపులు మెరిపించాలనే లక్ష్యంతో కోహ్లి ఉన్నాడు. అజింక్య రహానె కూడా తొలి టెస్టులో నిలకడైన ఆటను కనబరిచాడు. ఈసారి కూడా జట్టుకు కీలకంగా మారాడు. వెస్టిండీస్ సిరీస్ నుంచి రహానె ఆకాశమే హద్దుగా చెలరేగి పోతున్నాడు. ఈ మ్యాచ్‌లోనూ మెరుగైన బ్యాటింగ్ కనబరచాలనే పట్టుదలతో ఉన్నాడు. వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా, ఆల్‌రౌండర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యాలు కూడా బ్యాట్‌తో సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. ఆడిన తొలి మ్యాచ్‌లోనే పాండ్యా ఆకట్టుకున్నాడు. దీంతో అతనిపై అంచనాలు భారీగా పెరిగాయి. అశ్విన్, సాహాలకు కూడా టెస్టుల్లో మంచి రికార్డు ఉండడం భారత్‌కు కలిసి వచ్చే అంశం.

స్పిన్నర్లపైనే ఆశలు

మరోవైపు భారత్ ఈ మ్యాచ్‌లో కూడా స్టార్ స్పిన్నర్లు రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లను నమ్ముకుంది. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో వీరిద్దరూ కీలక సమయంలో వికెట్లు తీసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఈసారి కూడా జట్టుకు వీరు కీలకంగా మారారు. ఒంటి చేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా వీరికుంది. దీంతో కెప్టెన్ కోహ్లి ఈ మ్యాచ్‌లో కూడా వీరినే నమ్ముకున్నాడు. ఇక, ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమిలు కూడా తొలి మ్యాచ్‌లో మెరుగైన బౌలింగ్‌ను కనబరచడం భారత్‌కు కలిసి వచ్చే అంశం. ఈసారి కూడా వీరు అదే జోరును కనబరిచేందుకు సిద్ధంగా ఉన్నారు. పాండ్యా కూడా మెరుగైన బౌలింగ్‌తో జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు.

జట్ల వివరాలు :

భారత్ (అంచనా):
విరాట్ కోహ్లి (కెప్టెన్), కెఎల్.రాహుల్, శిఖర్ ధావన్, చతేశ్వర్ పుజారా, అజింక్య రహానె, వృద్ధిమాన్ సాహా, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యా, ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమి.

శ్రీలంక (అంచనా):
చండీమల్ (కెప్టెన్), ఉపుల్ తరంగ, కరుణరత్నె, మాథ్యూస్, గుణతిలక, డిక్వెల్లా, కుశాల్ మెండిస్, దిల్రువన్ పెరీరా, నువాన్ ప్రదీప్, రంగన హెరాత్, లహిరు కుమార.

లంకకు పరీక్షే!

ఆతిథ్య శ్రీలంకకు ఈ మ్యాచ్ చావోరేవోగా మారింది. తొలి టెస్టులో ఘోర పరాజయం చవిచూసిన లంకకు ఈ మ్యాచ్‌లో కూడా కష్టాలు ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో చాలా బలంగా ఉండడం, లంక పరిస్థితి రోజు రోజుకు దయనీయంగా మారడంతో మ్యాచ్ ఏకపక్షంగా సాగే అవకాశాలే అధికంగా ఉన్నాయి. అయితే రెగ్యులర్ కెప్టెన్ దినేష్ చండీమల్ జట్టులోకి రావడం లంకకు ఊరటనిచ్చే అంశం. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా చండీమల్‌కు ఉంది. ఇక, ఉపుల్ తరంగ, మాజీ కెప్టెన్ మాథ్యూస్, కుశాల్ మెండిస్, గుణతిలక, కరుణరత్నె, డిక్వెల్లా వంటి ప్రతిభావంతులైన బ్యాట్స్‌మెన్ లంకకు అందుబాటులో ఉన్నారు. అయితే అనుభవ రాహిత్యం లంకకు పెద్ద సవాలుగా మారింది. ఈ లోపాన్ని అధిగమిస్తేనే లంక మెరుగైన ప్రదర్శన ఇచ్చే అవకాశం ఉంది. తొలి మ్యాచ్‌లో భారత్‌కు కనీస ప్రతిఘటన ఇవ్వడంలో కూడా లంక విఫలమైంది. అయితే ఈసారి మెరుగైన ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతో లంక ఉంది. తిరిమన్నే చేరికతో బ్యాటింగ్ బలోపేతంగా మారింది. రంగన హెరాత్, నువాన్ ప్రదీప్ తదితరులతో బౌలింగ్ బలంగానే ఉంది. సొంతగడ్డపై జరుగుతున్న మ్యాచ్‌లో మెరుగైన ఆటతో సిరీస్‌ను సమం చేయాలనే లక్ష్యంతో లంక పోరుకు సిద్ధమైంది. ఇందులో చండీమల్ సేన ఎంత వరకు సఫలమవుతుందో వేచి చూడాల్సిందే.



ప్రిక్వార్టర్స్‌లో కశ్యప్, ప్రణయ్

- **న్యూజిలాండ్ ఓపెన్**

ఆక్లాండ్: న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్‌ప్రి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఆటగాళ్లు పారుపల్లి కశ్యప్, హెచ్‌ఎస్.ప్రణయ్ తదితరులు ప్రిక్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో వీరు విజయం సాధించారు. మరోవైపు సౌరవ్ వర్మ, సిరిల్ వర్మలు కూడా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. హోరాహోరీగా సాగిన రెండో రౌండ్‌లో భారత అగ్రశ్రేణి ఆటగాడు ప్రణయ్ 23–21, 21–18 తేడాతో ఇండోనేషియా ఆటగాడు అబ్దుల్లా ఖాలిక్‌ను ఓడించాడు. ప్రారంభం నుంచే పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. ఇద్దరు ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డారు. అబ్దుల్లా కూడా మెరుగైన ఆటను కనబరచడంతో హోరాహోరీ తప్పలేదు. ఒక దశలో ప్రణయ్ వెనుకబడ్డాడు. అయితే కీలక దశలో పుంజుకున్నాడు. చూడచక్కని షాట్లతో ప్రత్యర్థిని హడలెత్తిస్తూ తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో కూడా పోరు ఉత్కంఠభరితంగా సాగింది. కానీ, చివర్లో ప్రత్యర్థి ఆటగాడు అబ్దుల్లా వరుస తప్పిదాలకు పాల్పడ్డాడు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న ప్రణయ్ 21–18తో సెట్‌ను గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు.

అలవోకగా..

మరోవైపు తెలుగు తేజం పారుపల్లి కశ్యప్ రెండో రౌండ్‌లో సునాయాస విజయం సాధించాడు. న్యూజిలాండ్ ఆటగాడు ఒస్కార్‌గుతో జరిగిన పోరులో కశ్యప్ 21–9, 21–8 తేడాతో విజయం సాధించాడు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడిన కశ్యప్ పెద్దగా చెమటోడ్చకుండానే విజయం సాధించాడు. మరో పోటీలో సౌరవ్ వర్మ 21–16, 21–16 తేడాతో ఇండోనేషియా ఆటగాడు ఖోవి బోవును చిత్తు చేశాడు. పూర్తి ఆధిపత్యం చెలాయించిన సౌరవ్ సునాయాస విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నాడు. మరోవైపు సిరిల్ వర్మ కూడా రెండో రౌండ్‌లో సునాయాస విజయం సాధించి ముందంజ వేశాడు. ఏకపక్షంగా సాగిన పోరులో సిరిల్ 21–14, 21–16 తేడాతో విక్కి అంగా (ఇండోనేషియా)ను చిత్తు చేశాడు.



గుజరాత్–హర్యానా పోరాటం టై

మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా బుధవారం గుజరాత్ ఫార్చ్యున్ జెయింట్స్, హర్యానా స్టీలర్స్ మ్యాచ్ 27–27 పాయింట్ల తేడాతో టైగా ముగిసింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరు ఆఖరుకు టై అయ్యింది. రెండు జట్లు కూడా సర్వం ఒడ్డి పోరాడాయి. అసాధారణ పోరాట పటిమతో అభిమానులను అలరించాయి. కిందటి మ్యాచ్‌లో ఢిల్లీని ఓడించిన గుజరాత్ ఈసారి కూడా దూకుడైన ఆటతో ఆకట్టుకుంది. సమష్టి ఆటతో హర్యానాను ఉక్కిరిబిక్కిరి చేసింది. సుకేష్, సునీల్, పర్వేశ్, సచిన్ తలా మూడేసి పాయింట్లు సాధించి గుజరాత్‌కు అండగా నిలిచారు. మరోవైపు హర్యానా జట్టులో వికాస్, సురేందర్ చెలరేగి ఆడారు. ఇద్దరు గుజరాత్ ఆటగాళ్లను ముప్పుతిప్పలు పెడుతూ తమ జట్టుకు పైచేయి అందించారు. అద్భుత ఆటను కనబరిచిన వికాస్, సురేందర్ చెరో ఏడు పాయింట్లు సాధించారు. ప్రశాంత్ మూడు పాయింట్లు సాధించి తనవంతు పాత్ర పోషించాడు. కాగా, గుజరాత్, హర్యానా రెండు జట్లు కూడా సర్వం ఒడ్డి పోరాడడంతో మ్యాచ్ టైగా ముగిసింది.

మళ్లీ ఓడిన టైటాన్స్

మరోవైపు ఆతిథ్య తెలుగు టైటాన్స్ సీజన్‌లో వరుసగా నాలుగో ఓటమిని చవి చూసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 30–24 తేడాతో టైటాన్స్‌ను చిత్తు చేసింది. తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన తెలుగు టైటాన్స్ తర్వాత విజయం రుచి చూడలేదు. వరుసగా నాలుగో ఓటమితో అభిమానులను నిరాశకు గురి చేసింది. బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా టైటాన్స్ చెత్త ఆటతో నిరాశ పరిచింది. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేక చేతులెత్తేసింది.



వికాస్ అద్భుతంగా ఆడి 9పాయింట్లు సాధించినా ఫలితం లేకుండా పోయింది. కెప్టెన్ రాహుల్ చౌదరి, నిలేష్ సలుంకె ఐదేసి పాయింట్లు సాధించినా జట్టును గెలిపించలేక పోయారు. బెంగాల్ జట్టులో మహిందర్ సింగ్ చెలరేగి ఆడాడు. టైటాన్స్‌ను ఉక్కిరిబిక్కిరి చేసిన మహిందర్ ఏకంగా 11 పాయింట్లు సాధించి బెంగాల్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. జంగ్ కున్‌లీ 8 పాయింట్లు సాధించి తనవంతు భూమికను నెరవేర్చాడు.

సుందర్‌పై బ్రెట్‌లీ ప్రశంసల జల్లు



చెన్నై: భారత యువ సంచలనం వాషింగ్టన్ సుందర్ అంటే తనకు చాలా ఇష్టమని ఆస్ట్రేలియా మాజీ స్పీడ్‌స్టర్ బ్రెట్‌లీ అన్నాడు. ఐపిఎల్‌లో సుందర్ ప్రదర్శన తనను ఎంతో ఆకట్టుకుందని బ్రెట్‌లీ చెప్పాడు. ప్రస్తుతం వాషింగ్టన్ సుందర్ తమిళనాడు ప్రీమియర్ లీగ్ క్రికెట్ (టీఎన్‌పిఎల్) టోర్నమెంట్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. టుటీ పేట్రియాట్స్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న వాషింగ్టన్ తాజాగా అద్భుత సెంచరీతో కదం తొక్కాడు. వాషింగ్టన్ సుందర్ అసాధారణ ప్రతిభతో చెలరేగడంతో ప్రేటియాట్స్ జట్టు ఆడిన నాలుగు మ్యాచుల్లోనూ జయకేతనం ఎగుర వేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లోనూ సుందర్ సెంచరీతో చెలరేగి పోయాడు. దీంతో అతని ప్రతిభపై బ్రెట్‌లీ ప్రశంసల వర్షం కురిపించాడు. బ్రెట్‌లీ ప్రస్తుతం తమిళనాడు ప్రీమియర్ లీగ్‌కు ప్రచార కర్తగా వ్యవహరిస్తున్నాడు. సుందర్‌కు ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉందని, రానున్న రోజుల్లో అతను టీమిండియాకు కీలకంగా మారడం ఖాయమని బ్రెట్‌లీ జోస్యం చెప్పాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.